# కథామంజరి

## పది కథల సమాహారం



మార్చి 2025

# కథామంజరి

## పది కథల సమాహారం



కథా మార్గదర్శి

**మార్చి 2025**

సంపుటి : 6 ♦ సంచిక : 3



# మా జట్టు

సంపాదకుడు
**జయంతి ప్రకాశ శర్మ**

ప్రచురణ కర్త
**అవసరాల వెంకటరావు**

సంపాదక సహకారం
**ఎం.ఏ. పద్మనాభరావు**
**కృపాకర్ పోతుల**
**నండూరి సుందరీ నాగమణి**

ప్రచురణా సహకారం
**ఎం.ఎల్. కాంతారావు**

సాంకేతిక సహకారం
**Harbinger Publishing**

బొమ్మలు
**కొయిలాడ రామ్మోహనరావు**
**కొచ్చెర్ల వి.ఆర్.**
**సూరంపూడి చలపతిరావు**



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి
## సహకారం అందించిన గళాకారులు

శ్రీ /శ్రీమతి /కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వరరావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్నగారు
- అవసరాల వెంకటరావు గారు
- చీమలపాటి శ్రీనివాసరావు గారు
- సమ్మెట ఉమాదేవి గారు

**శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి**


ఉగాది
శుభాకాంక్షలు


రంజాన్
శుభాకాంక్షలు




## శీర్షికలు


| | |
|---|---|
| కథాకీయం | i |
| విశిష్ట అతిథి | iii |
| కథా మార్గదర్శి | v |
| కథా పరిచయం | vii |
| కథాపుస్తక పరిచయం | x |


## కథలు, వ్యాసాలు


| | | |
|---|---|---|
| చర్మ (చరమ) గీతి | వసుంధర | 1 |
| తండ్రి | పి. రాజేంద్రప్రసాద్ | 10 |
| ఎవరి ఆనందం వారిదే కాని... | మల్లాప్రగడ రామారావు | 14 |
| తాళంచెవి | నాగమంజరి గుమ్మా | 18 |
| నేటి మహిళ | పాలెపు బుచ్చిరాజు | 22 |
| మరుభూమిలో మారణహోమం | స్వరలాసిక | 31 |
| బహుమతి | ఇందిర రాజగోపాల్ | 37 |
| పొడుగు తోక | ఆర్. సి. కృష్ణస్వామి రాజు | 39 |
| పేరులో ఏముంది? | డా. జె. భాగ్యలక్ష్మి | 41 |
| హాట్ హోం | సి. ఆనందారామం | 47 |


Cover Page Credits : Shri P.S.N. Murty, Visakhapatnam

# కథాకీయం

'ఇంకా పరిపక్వత రాలేదు' అనే మాట వింటూంటాం! ఆంగ్లంలో 'మెచూరిటీ' అంటాం! అందరి జీవితాల్లో.. అన్ని వయసుల్లోనూ ఎదురొచ్చే సమస్యేం కాదు.. ఇదో జీవిత సత్యం! విజ్ఞానం పెరిగితే పరిపక్వత వస్తుంది. చేసే పనులలో అనుభవం వస్తే పరిపక్వత పెరుగుతుంది. వయసు పెరుగుతున్న కొలదీ 'మెచూరిటీ' పెరుగుతుంది! ఈ విషయంలో పాఠకుల మాట ఎలా వున్నా.. వారిని ప్రభావితం చేసే రచయితలు కూడా అతీతులు కాదు.

ఈ ఉపోద్ఘాతం ఎందుకంటే... మారిన కాలమాన పరిస్థితుల కారణంగా రచయితల పరిస్థితిని ఓసారి సింహావలోకనం చేసుకోవాలి.


ఒక ముప్పయ్ నలభై సంవత్సరాల క్రితం.. హైస్కూలు స్థాయిలో కూడా ప్రతీ ఏడాది, ప్రతీ స్కూలు 'వార్షిక సంచిక' (మాగజైన్) విడుదల చేసేవి. అందులో ఉపాధ్యాయులతో పాటు, విద్యార్థుల చేత వ్యాసాలో, కథలో, కవితలో వ్రాయించి, వేసేవారు. గ్రూపు ఫోటోలు, విద్యార్థులు వేసిన బొమ్మలు.. ఇలా ఆ సంచిక చాలా అపురూపంగా ఉండేది. కొండకచో.. ఆ సంచికలో ప్రచురించిన వాటిలో కొన్నింటికి బహుమతులు కూడా ఇచ్చేవారు. ఆ సంచికలో తమవి పడాలని విద్యార్థులు పోటీపడి కూడా వారివారి సృజనాత్మకతకు పదునుపెట్టి, రచనలు అందించేవారు. ఆ వయసులో వారికి అంతగా లోకజ్ఞానం ఉండకపోవచ్చు. సాహిత్య సంబంధ విషయాలు తెలియకపోవచ్చు. కొద్దికాలం గడిచిన తర్వాత ఆ రచనలు తమకు తామే చదివి నవ్వుకోవచ్చు.. నేనే రాసానా అని ఆశ్చర్యపోవచ్చు. కాని ఆ వయసులో రచనాశక్తికి బీజం పడిందనే ముఖ్యవిషయాన్ని విస్మరించకూడదు. అలా రచనారంగంలో అడుగుపెట్టిన వారికి యుక్తవయసు వచ్చేసరికి ఆలోచనా రీతులు మారుతాయి. దృక్పథం మారుతుంది. నడవడిక మారుతుంది. వృత్తి, ప్రవృత్తుల్లో పరిపక్వత ఆ వయసులోనే సాధిస్తారు. అలా రచనారంగంలో ఉన్నవారు.. ఆ పరిపక్వతతో మంచిరచనలు అందిస్తారు. నిన్న, మొన్నటి తరం తెలుగు కవులు, రచయితలు, పండితులను చూస్తే.. వారందరూ పది పదిహేను సంవత్సరాల వయసులోనే ఆయా రంగాల్లో అడుగు పెట్టి, మధ్యవయసు వచ్చే సరికే నిష్ణాతులయ్యారు. కాని.. మారిన కాలమాన పరిస్థితులలో కొత్త యువతరంలో రచయితలు కనబడటం లేదు. మహా అయితే ముప్పయ్, నలభై సంవత్సరాల వారు అతి కొద్దిమంది కనబడతారు. ఇప్పుడు రచనలు చేస్తున్నవారు గాని, కొత్తగా అడుగుపెడుతున్నవారు గాని.. తొంభై శాతం మంది అరవై పైచిలుకు వయసు వారే ఉన్నారు. అయితే.. ఈ వయసులో అడుగుపెడితే, వారు రచనలలో పరిపక్వత ఎప్పుడు సాధిస్తారు? తపన, కృషి ఉండొచ్చు. కాని వయసు ఆగదు కదా!

ఈ రోజుల్లో.. పిల్లలకి కొద్దో గొప్పో సంగీతం, ఆటల మీద మక్కువ పెరుగుతోంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా వాటి మీదే కేంద్రీకృతమై ఉంది. వాటికి 'కోచింగ్ సెంటర్లు' కూడా వెలిసాయి. సాంఘికమాధ్యమాలు ప్రోత్సహిస్తున్నాయి.. పోటీలూ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వాలు కూడా ప్రోత్సహిస్తున్నాయి. చదువును పక్కనపెట్టి, అటు పూర్తిగా దృష్టి పెట్టినవారు కనబడుతున్నారు.

కాని, కాని.. రచనారంగం పూర్తిగా అణిగిపోతుంది. పిల్లలు, యువత ఇటు రావడంలేదు, తల్లిదండ్రుల ప్రోత్సాహం సుమారుగా నిండు సున్న! ప్రభుత్వం సరే సరి.. చెప్పేదేముంది! ఈ పరిస్థితులు ఇలా ఉంటే.. రేపటితరానికి అందించడానికి ఏం ఉండదు. ఉనికికే ప్రమాదం వస్తుంది!

ఈ పరిస్థితులు మారాలి. తిరిగి హైస్కూలుస్థాయి నుంచి ఈ ప్రయత్నం మొదలవ్వాలి. పిల్లల్లో భాషా సాహిత్యాల పట్ల ఆసక్తి కలిగించే విద్యావ్యవస్థ ప్రవేశపెట్టాలి. రచనాసక్తిని మాధ్యమాలు కూడా ప్రోత్సహించాలి. వీటితో పాటు తల్లిదండ్రుల ఆలోచనా సరళి మారాలి! అప్పుడే తెలుగు మనిషి ఉనికి నిలబడుతుంది! అదే ఆశిద్దాం.

**సంపాదకుడు**



*మార్చి 15, 1898 తేదిన జన్మించిన శ్రీ మునిమాణిక్యం నరసింహారావుగారు తెలుగు సాహిత్యంలో హాస్యం ప్రాముఖ్యతని పెంచిన ప్రముఖులలో ఒకరు. ఆయన రాసిన "కాంతం కథలు" గురించి మాట్లాడుతూ ఒక ప్రముఖుడు "సామాన్యుడి జీవితంలోని చిరు విషాదాలను కూడా నవ్వుగా మార్చగల శక్తి కలిగి ఉంటాయి" అని వ్యాఖ్యానించారు.*

*ఇది ఆయన హాస్యం గురించి చేసిన మరొక వ్యాఖ్య "హాస్యం అనేది బహుశా గొప్పదే, కానీ అది మునిమాణిక్యంవారి చేతిలో కవచకుండలాలు ధరించిన అర్జునుడిలా కనిపిస్తుంది. ఆయన మాటల్లో పొదుపు, పదాలలో చురుకుదనం అపూర్వం". ఆయన మరొక రచన "అప్పులు చేయడం – తీర్చడం" లో సమాజంలో మనుషులను ఆయన చేసిన వర్గీకరణ – "అప్పుచేసిన మొత్తమును తిరిగి ఇచ్చేవాడు అధముడు. కాలం గడిపేవాడు మధ్యముడు. తెచ్చిన మరుక్షణములో ఆ విషయం సులువుగా మరవగలిగినవాడు ఉత్తముడు."*

*మునిమాణిక్యంవారి రచనా శైలిని స్పష్టంగా విశదీకరించే మరో వ్యాఖ్య — ఆయన రచనలు చదువుతుంటే అనిపించే వింత ఏమిటంటే, మన జీవితంలో మనమే పాత్రలుగా ఉన్నామన్న భావన. అలాంటి సహజత ఆయన రచనలలో అపూర్వం. బి.ఏ. చదివిన మునిమాణిక్యంవారు ఆంధ్ర సారస్వత పరిషత్తులోనూ, ఆకాశవాణిలోనూ పనిచేశారు.*

*ఎదుటివారి అవకరాన్ని ఆసరాగా తీసుకుని హాస్య సృష్టి చేయడాన్ని దుమ్మెత్తి పోసిన మునిమాణిక్యంవారు, తెలుగులో హాస్యాన్ని క్రోడీకరించి, వర్గీకరించి "మన హాస్యము"గా గ్రంథస్థం చేశారు. దీనిలో హాస్యం రకాలు, మంచి చెడులు విశదీకరించి మనకి అందిస్తారు.*

*ఈ పుస్తకానికి ప్రస్తావిత చేసిన శ్రీ వీరభద్ర శాస్త్రిగారి మాటల్లో "హాస్యరసాన్ని మనపూర్వులు ప్రధానరసాలలో ఒకటిగా గుర్తించినప్పటికీ, దానికి ఉండదగినంతటి ప్రాధాన్యం ఏర్పడలేదు. పాశ్చాత్య వాఙ్మయ ప్రభావం ప్రసరించిన తరువాత వచ్చిన ఆధునికాంధ్ర సాహిత్యంలో హాస్యరీతులలో కొంత వైవిధ్యమూ, క్రొత్తదనమూ కానవస్తుంది. అయినా హాస్యరస స్వరూప స్వభావాలను సాకల్యంగా పరామర్శించే గ్రంథజాలం వెలువడలేదు. ఈ కొరత తీర్చడానికి శ్రీ మునిమాణిక్యం ప్రయత్నించారు."*



# విశిష్ట అతిథి

**డా. జె. భాగ్యలక్ష్మి**

తెలుగు భాష, సాహిత్యం ఇతర రాష్ట్రాలలో, దేశాలలో గుర్తింపుకు రావడానికి ప్రవాసాంధ్రులు చేసిన, ఇప్పటికీ చేస్తున్న కృషే కారణం అని చెప్పాలి. ఈ మధ్యకాలంలో యువతలో ఈ ఉత్సాహం కనబడటంలేదు గాని, ఆయా ప్రాంతాలలో స్థిరపడిపోయిన చాలామంది తెలుగువారు.. వయసు పైబడ్డా కూడా.. ఇప్పటికీ సాహిత్యపరమైన కృషిలో నిమగ్నమై ఎనలేని సేవలు అందిస్తున్నారు.

అలా సాహిత్యపరమైన కృషి చేస్తున్నవారిలో ముఖ్యులు డా. జె. భాగ్యలక్ష్మిగారు. గత ఆరు దశాబ్దాలుగా ఆంగ్ల, తెలుగు భాషల్లో బాగా గుర్తింపు పొందిన రచయిత్రి. "ఏ భాషయినా భావప్రకటనకు అది ఒక మాధ్యమం! మన భాష, పరభాష అనేది ఏది ఉండదు. భాషలవల్ల జ్ఞానం విస్తరిస్తుందే గాని, కుచించుకు పోదు. మనం భాషను ప్రేమించగలిగితే, అందులోని సొగసులు, అందమైన కూర్పులు, మధురసంగీతం మనల్ని అలరిస్తాయి. ఏ భాషలో వ్రాసినా మనం మనమే! మన ఆలోచనలు, అవగాహనలు, సిద్ధాంతాలు, దృక్పథాలు.. మన రచనల్లో కనబడతాయి!" అంటూ భాషా సాహిత్యాల మీద అభిప్రాయాలని వ్యక్తపరిచే భాగ్యలక్ష్మిగారి వృత్తి, ప్రవృత్తి కూడా సాహిత్యపరమైనవే! ఈమె ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసు ఆఫీసర్‌గా, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖలో మీడియా డైరెక్టర్‌గా, కేంద్ర సమాచార, ప్రచార మంత్రిత్వశాఖ వారి పత్రిక 'యోజన' కి ఛీఫ్ ఎడిటర్‌గా, 'ఇండియన్ అండ్ ఫారిన్ రివ్యూ కమ్యూనికేటర్' పత్రికా సంపాదకురాలిగా పనిచేసారు. ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా, గెస్ట్ ఫాకల్టీగా.. ఇంకా ఎన్నో వృత్తుల్లో పనిచేసి, దేశ విదేశాలలో ప్రభుత్వ ప్రతినిధిగా, జర్నలిస్టుగా పర్యటించారు.

ఈ అనుభవసారంతో పాటు, శరత్ సాహిత్యం, షెకోవ్, ఓ హెన్రీల ప్రభావం కూడా ఎక్కువగా భాగ్యలక్ష్మిగారి రచనలలో కనబడతాయి. కథలు క్లుప్తంగా, పొందికగా ఉంటాయి. ముగింపు పాఠకుల అవగాహనకి వచ్చి, విస్తృతార్థం ఇస్తాయి. కొన్ని రచనలలో స్త్రీవాద ఛాయలు కనబడతాయి. తాను పుట్టి పెరిగిన మదనపల్లె గ్రామీణవాతావరణ వాసనలు పదిలంగా ఉన్నాయని అనిపించేలా కొన్ని కథలు ఉంటాయి. నిజాయితీ, నిబద్ధత.. కొట్టొచ్చినట్లు కనబడతాయి. వెరసి.. ఏ కథ చూసినా, కథాంశం ఏదైనా.. కథని ఒప్పించేలా రాయడం భాగ్యలక్ష్మిగారి శైలి విన్యాసం అని చెప్పాలి.

భాగ్యలక్ష్మిగారు తెలుగు, ఆంగ్లభాషల్లో నలభై ఐదుకు పైగా పుస్తకాలు వ్రాసారు. అలాగే కథాసంకలనాలు, కవితా సంకలనాలు, సాహిత్య విమర్శ, అనువాదాలు కూడా ఉన్నాయి. ఆర్. కె. నారాయణ్ అవార్డు, జేష్ఠ లిటరరీ అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ రచయిత్రి అవార్డు.. వంటి ఎన్నో పురస్కారాలు అందుకున్న డా. భాగ్యలక్ష్మిగారు 1940లో

మదనపల్లెలో జన్మించారు. దేశ రాజధానిలో ఉద్యోగరీత్యా అడుగుపెట్టి, అక్కడే స్థిరపడ్డారు. ఈ సంచిక విశిష్ట అతిథిగా విచ్చేయవలసిందిగా ఆహ్వానించినప్పుడు.. ఎంతో ఆప్యాయంగా మాట్లాడి, కథామంజరి గురించి అడిగి, తెలుసుకుని చాలా ప్రోత్సాహకరంగా స్పందించారు. రానున్న కాలంలో డా. భాగ్యలక్ష్మిగారి కలం నుంచి మరిన్ని సాహితీకుసుమాలు జాలువారి, సాహితీప్రపంచంలో తెలుగుజాతి ఖ్యాతిని మరింత పెంచగలదని ఆశిస్తూ.. డా. భాగ్యలక్ష్మిగార్కి కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాం!

**కథామంజరి బృందం**



# కథా మార్గదర్శి

**కీ.శే. డా. సి. ఆనందారామం**

'ప్రస్తుతం సాహిత్యం చదివే పాఠకుల బాగా తగ్గిపోయారు కదా, తిరిగి పాఠకులు చదివేలా చేయలాంటే ఎలాంటి సాహిత్యం రావాలి' అనే ప్రశ్నకి జవాబుగా "సాహిత్యానికి కొత్త కోణం కావలసిన అవసరం ఉంది. కథ చెప్పే పద్ధతిలోను, శిల్పంలోను మార్పు రావాలి. ముఖ్యంగా వేగం ఉండాలి. అతి తక్కువకాలంలో ఓ మెరుపులా కథనం ఉండాలి. మేధస్సును మెరుగుపరిచి, దాన్ని ఉపయోగించి రచనలు చెయ్యాలి! పందొమ్మిది వందల తొంభై వరకు.. కాలానుగుణంగా రకరకాలు మార్పులు చెందినా సరే తెలుగు సాహిత్యానికి పెద్దపీట ఉండేది. మంచి సాహిత్యం వచ్చింది, ఆదరణ పొందింది. తర్వాతే.. స్తబ్దత వచ్చింది. మళ్ళీ మార్పు ఎప్పుడు వస్తుందో, ఎవరి ద్వారా వస్తుందో చెప్పలేం. ఎదురు చూడవలసిందే" అంటూ ఓ ఇంటర్వ్యూలో తన అభిప్రాయాన్ని ఖచ్చితంగా తెలియచేసిన మరో సాహితీఋషీమణీ, ప్రముఖ రచయిత్రి డా. సి. ఆనందరామం గారు!

సమాజంలో కనబడే ప్రతీ విషయానికి ప్రతిరూపమే సాహిత్యం. అలాగే సాహిత్యం.. సమాజాన్ని మంచిబాటలో నడిపించడానికి ఉపయోగపడాలి. సాహిత్యంలో ఏ ప్రక్రియైనా, మనిషికి మార్గదర్శకంగా ఉండాలనే ఆలోచనలతో రచనలు చేసిన ఆనందారామంగారు, అరవైకి పైగా నవలలు, వందకు పైగా కథలు, మరెన్నో వ్యాసాలు వ్రాసారు. ఆ రోజుల్లో తెలుగుసాహిత్యంలో ఏ ప్రక్రియలో చూసిన ఆనందరామంగారి రచనలు తొలివరసలో నిలబడేవి. మంచి విమర్శకులు, పరిశోధనాత్మక రచయిత్రిగా వాసికెక్కిన ఆనందరామంగారి నవలలు ఆధారంగా "సంసార బంధం", "జ్యోతి", "త్రిశూలం" వంటి నాలుగైదు సినిమాలు కూడా వచ్చాయి. వీరి రచనలు మైసూరు యూనివర్సిటీ విద్యార్థులకు తెలుగు పాఠ్యాంశంగా కూడా ఉండేవి.

"నేటి ఆధునిక స్కూళ్లు కంటే అప్పటి వీధిబడులే బావున్నాయి. నేను చిన్నప్పుడు బడిలో చదివిన పద్యాలు ఇప్పటికీ గుర్తున్నాయి. చదువుల విధానం బావుండేది. మంచి ఉపాధ్యాయులు ఉండేవారు. నా మొదటికథ "అటు పోటు" నేను బి.ఎ. చదువుతున్న రోజుల్లో వ్రాసాను. మా నాన్న దెబ్బలాడారు కూడా! ఆయనకు తెలియకుండా మా మిత్రురాలు ఆంధ్రప్రభకి పంపితే, వాళ్ళు దాన్ని ప్రచురించి, పదిహేను రూపాయాల పారితోషికం కూడా పంపారు. 'ఓహో.. పారితోషికం కూడా ఉంటుందా' అంటూ, మళ్ళీ నాకు అభ్యంతరం పెట్టలేదు. అలా సాహిత్యప్రవేశం జరిగింది. పెళ్లయిన తర్వాత మా మావగారు, నేను ఏం.ఏ., పి.హెచ్.డి. చేయడానికి ప్రోత్సహించారు. అలా వాళ్ళిద్దరి సహకారం, ప్రోత్సాహలతో వెనక్కి చూడలేదు!" అంటూ ఆనందరామంగారు తన సాహితీప్రస్థానం గురించి చెప్పేవారు. నిజజీవిత

ఘట్టాల మీద రచనలు చేసినప్పుడు.. 'మా విషయాల మీద నవలలు వ్రాసావేమిటి?'' అని కొంతమంది మొహం మీదే అడిగేవారుట! అయితే తాను నమ్మిన సిద్ధాంతాల విషయంలో ఎప్పుడు రాజీపడకుండా, రచనలు సాగించారు.

1935లో ఏలూరులో జన్మించిన ఆనందరామంగారి అసలు పేరు ముదుంబై ఆనందలక్ష్మి. చిలకమర్రి రామంగారితో వివాహం అయిన తర్వాత చిలకమర్రి ఆనందరామంగా పేరు మారింది. బి.ఏ. తర్వాత ఆగిపోయిన చదువు, వివాహం అనంతరం మామగారి ప్రోత్సాహంతో.. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి తెలుగులో ఎం. ఎ. చదివి, తర్వాత జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా. సి. నారాయణ రెడ్డిగారి మార్గదర్శకత్వం లో పిహెచ్.డి. చేసి డాక్టరేట్ పొందారు. హైదరాబాదులో హోమ్ సైన్స్ కాలేజీ, నవజీవన్ కాలేజిలలో అధ్యాపకురాలుగా పనిచేసి, 1972లొ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో ప్రొఫెసర్‌గా చేరి అక్కడే పదవీ విరమణ చేసారు. ఆమె దగ్గర పిహెచ్‌డి చేసిన విద్యార్థులు కొంతమంది ''నన్ను అమ్మలా ఆదరించారు'' అని థీసీస్లో రాసుకునేంత ప్రేమను పంచారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డుతో పాటు, ఏడు ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకున్నారు.

తెలుగు సాహితీరంగంలో సాహితీ ఋషీమణీగా గుర్తింపు పొందిన డా. సి. ఆనందరామంగారు 2021లో మరణించారు. వారికి ఘనమైన నివాళిలు తెలియచేసుకుంటున్నాం.

**కథామంజరి బృందం**

# కథా పరిచయం

ఒకే సమస్య మీద చాలా మంది రచయితలు చాలా కథలు వ్రాయవచ్చు. వ్రాస్తున్నారు కూడా! అయితే ఆధునిక తెలుగు కథకు ఆద్యులు ఇద్దరూ, ఒకే సమస్య మీద ఎప్పుడో నూట ఇరవై సంవత్సరాల క్రిందట రాసిన కథల మీద విడివిడిగా వందల్లో విశ్లేషణలు వచ్చాయి. అయినా సరే ఇంకా రాయగల కథలు అవి. అయితే కథా సాహిత్యాన్ని బాగా చదివి అవగాహన చేసుకున్న ఓ మంచి పాఠకుడు శ్రీ శాయి రాచకొండ.. ఈ రెండు కథల్ని కలిపి విశ్లేషించడం.. ఓ కొత్త ప్రయోగమని చెప్పాలి. కథామంజరి పాఠకులకు తప్పకుండా నచ్చుతుందని ఆశిస్తున్నాం!

**సంపాదకుడు**

## గురజాడ అప్పారావు గారి కథ “దిద్దుబాటు” (1910)
## భండారు అచ్చమాంబగార్రి కథ “స్త్రీ విద్య” (1902)

పై రెండు కథలూ సుమారుగా ఒకే కాలంలో వచ్చినవే, ఇరవయ్యో శతాబ్దం మొదట్లో! అప్పట్లో ఉన్న సాంఘికసమస్యలలో ఒకటి.. ‘స్త్రీకి విద్య అవసరమా, కాదా’ అని! ఒకప్పుడు స్త్రీకి ఓటు హక్కునివ్వాలా వద్దా అని కూడా ఆలోచించిన ప్రపంచం మనది. ఈరోజు చాలా తేడాగా కనిపించచ్చు. వ్యవహార తెలుగులో సుమారు నూటపాతిక సంవత్సరాల క్రితం రాసిన ఈ కథలు సమాజాన్ని ఉద్దేశించి స్త్రీకి విద్య అవసరం అని, ఆ విద్య వల్ల కలిగే ప్రయోజనాలను సూటిగానో, నాటక ఫక్కీలోనో, వ్యంగ్యంగానో చెప్పిన కథలివి .

గురజాడగారు తన కథలో స్త్రీవిద్య గురించి ప్రస్తావించినా, దాని ఫలితాల గురించి చెప్పినా.. అది సూటిగా కాదు. తన సహజ ధోరణిలో వ్యంగ్యం చొప్పిస్తూ, అప్పట్లో సంఘంలో ప్రబలిపోయి ఉన్న మరో రుగ్మత అయిన వ్యభిచారాన్ని ఎట్టి చూపిస్తూ, స్త్రీకి విద్య ఎంత అవసరమో చెప్పకుండా చెప్పిన కథ ఇది.

అచ్చమాంబగారు అలా కాదు. సుదీర్ఘమైన సంభాషణలతో, ప్రశ్నోత్తరాల మధ్యలో స్త్రీకి విద్య ఎంత అవసరమో, ఎందుకు అవసరమో విశదీకరించి చెప్పడం జరిగింది. అంటే ఈ కథ చదివిన వారికి ఒక వ్యాసం చదివినట్లుంటుంది! కథలో కథ కేవలం 5% మాత్రమే. మిగతా తొంభై అయిదు పాళ్ళు ప్రశ్నోత్తరాలతో నడిచిన సంభాషణే!

గురజాడ వారి కథ గురించి కొంచెం విపులంగా చూద్దాం.

కథ తనలో తను మాట్లాడుకుంటున్న గోపాలరావు మాటలతో మొదలవుతుంది. సంఘంలో తానొక ఆంటీ నాచ్. వ్యభిచారానికి వ్యతిరేకం. అయితే తను వస్తున్నది సానిదాని పాట విని! ఆ పాట ముగిసే వరకు తను కూర్చోవడమేమిటి? ఇంటికొచ్చాడు. భార్య కమలినిని లేపకుండా పనివాడు రాముని మెల్లిగా అడిగి, తలుపు తీయించుకుంటే, తను పెద్దమనిషిలా వెళ్ళి పక్కలో పడుకోవచ్చు. అదీ అతని ఆలోచన. మెల్లగా తలుపు తోసుకొచ్చిన గోపాలానికి కమలిని పక్కమీద కనబడలేదు. కోపం చికాకు కలిగాయి. రాముడు కూడా ఇంట్లో లేడు. చుట్ట కాలుస్తూ బయటకు వచ్చి చూస్తుంటే రాముడు కనబడ్డాడు. వాడికీ తెలీదు.. అమ్మగారెక్కడికెళ్ళారో! కోపంలో వాడి వీపు మీద రెండు దెబ్బలు తగిలాయి గోపాలరావు చేతిలో! కమలిని

పుట్టింటికెళ్ళి వుంటుందా అంటే రాముడి సమాధానం “అంతవారు కారనా, బాబూ. ఆడారు చదువు నేరిస్తే యేటవుతది?” అని. ‘నువ్వూరుకోరా, చదువు విలువ నీకేం తెలుసురా, రామా!” అంటాడు గోపాలరావు. ఇంతలో కమలిని చేవ్రాతలో గోపాలరావుని ఉద్దేశించి రాసిన ఒక ఉత్తరం దొరుకుతుంది. పది రోజులుగా గోపాలరావు లోకోపకారాలు చేస్తున్నట్లు చెబుతూ ఇంటికి రాలేదని, అయితే తన చెలుల వలన అసలు సంగతి తెలుసుకుందని, తన భర్త స్వేచ్ఛను నిర్బంధించకుండాను, అబద్ధం చెప్పే అవకాశం ఇవ్వకుండాను వుండాలంటే, తను కన్నవారింటికి పోతున్నానని చెబుతుంది ఉత్తరంలో.

మళ్ళీ రాంబాబు అంటాడు “... ఆడదాయి చెప్పకుండా పుట్టినారింటికి యెల్తానంటే లెంపలాయించి కూకోబెట్టాలి గాని, మొగోరిలాగ రాతలూ కోతలూ మప్పితే ఉడ్డోరం పుట్టదా బాబు?” దానికి సమాధానంగా గోపాలరావు అంటాడు “ఓరి మూర్ఖుడా! భగవంటుడి సృష్టిలో కల్లా ఉత్కృష్టమైన వస్తువు విద్య నేరిచిన స్త్రీ రత్నమే. శివుడికి పార్వతి సగం దేహం పంచి ఇచ్చాడు. ఇంగ్లీషు వాడు భార్యను బెటర్ హాఫ్ అన్నాడు. అనగా పెళ్ళాము మొగుని కన్న దొడ్డది అన్నమాట. బోధపడ్డాడా?”

తను నాలుగు రోజులు ఊళ్ళో ఉండనని, రాముడే వెళ్ళి కమలినిని తీసుకురావాలని, ఏమి చెప్పి తీసుకురావాలో చెప్తాడు. పంతులికి బుద్ధి వచ్చిందని, ఇంకెప్పుడూ సానుల పాట వినరనీ, రాత్రులు ఇల్లు కదలరనీ చెప్పి, బ్రతిమాలుకున్నారని చెప్పాలి. అసలు మాట... దయతలచి ఆయన లోపములు బయట పెట్టకుండా రెండుమూడు రోజులలో వెళ్ళి రమ్మన్నారని! రాముడేమైనా తక్కువ తిన్నవాడా? “ఆడోరు యెజమాని చెప్పినట్టల్లా ఇని పల్లకుండాలి. లేకుంటే మా పెద్ద పంతులార్లాగా.. అయ్యగారు కూడా సానమ్మనుంచుకుంటారు. మీ సెవులో మాట! పట్నంలోకి బంగారబ్బొమ్మలాటి సానమ్మోచ్చింది. మరి పంతులు మనసు మనసులో లేదు. ఆపైన మీ ఇష్టం.”

కథ చివరి వాక్యం.. “అంతట మంచము క్రింద నుండి అమృత నిష్యందినియగు కలకల నగవును కరకంకణముల హృద్యారావమును విననయ్యెను.

ఇక భండారు అచ్చమాంబ గారు రాసిన రెండవ కథకు వస్తే, ఇది ఒక భార్యాభర్తల సంవాదం. మరునాడు ప్రయాణానికి సిద్ధమయిన ఒక ఆదర్శ వ్యక్తి అయిన భర్తతో ఆతని భార్య జరిపిన సంభాషణ. భార్య ఎందుకు చదువుకోవాలి అన్న ప్రతి ప్రశ్నకు ఆ భర్త ఇచ్చిన సమాధానమే ఈ కథకు మూలం.

చదువుంటే తానే మొగుడికి ఉత్తరాలు రాయవచ్చుకదా! ఇంకొకరిపై ఆధారపడాలా తమిద్దరిమధ్యా జరిగే ఆత్మీయ సంభాషణలకు? స్త్రీలు చదువుకుంటే తమ భర్తలకు ఆయుక్షీణమని శాస్త్రాలలో ఉందా అసలు?

తనకిప్పుడు చదువెందుకసలు? ఉద్యోగాలు చేయాలా?పుస్తకాలు చదవడమెందుకు, దాని ప్రయోజనమేమిటి అన్న ప్రశ్నకు భర్త ఇచ్చిన జవాబు.. ‘విద్యామృతపాలన వలన ఇదివరకున్న పిచ్చి విచారములు మనసులో చోటు చేసుకోవు. అక్షరములు వ్రాయను జడవను నేర్చునంతమాత్రమున నరులు విద్యావంతులు కాజాలరు. అనేకులు వ్రాసిన ఉద్గ్రంథములను జదివి, వాని తాత్పర్యమును గ్రహింపగల వారలే విద్యాయుతులనబడుదురు.” అలాంటి విద్య వలన బుద్ధి వికసించును. మనుష్యులను, ఉదాత్తవంతులను చేయును. దుర్గుణములు పోయి సద్గుణములు కలుగజేయును. మనసునకు ఆహ్లాదము కలుగును. భర్తకు సహాయురాలగు పత్ని విద్య నేరిస్తే కాని తన కర్తవ్యం పూర్తిగా నిర్వహించినట్లు కాదు. విద్య నేర్చినందువల్ల లెక్కలలో తప్పులు రావు.

ఇక శాస్త్రాల విషయమా? చదువే వస్తే, శాస్త్రాలలో ఏముందో తెలుసుకోవడం సులభం కదా! శాస్త్రాలలో ఉన్నాయనంటూ ఏమీ తెలియని వారు ప్రచారం చెయ్యడం, నాయనమ్మ లాంటి వారు నమ్మి తిరిగి ప్రచారం చెయ్యడం జరుగుతోంది. అందుకే చదువుకోవడం కావాలి. అంటే కాదు. "... పురుషుల కంటెను స్త్రీలు విశేష జ్ఞానసంపన్నులగుట, అధిక యావశ్యము! ఏలన.. నికముందు పుట్టబోవు వారి నున్నత పదవికి తెచ్చుట స్త్రీల యధీనములోనిదై యున్నది."

భార్య తను చదువు నేర్చుకోడానికి సిద్ధమవడంతో కథ అంతమవుతుంది.

రెండు కథలూ ఒకే కాలంలో రచింపబడినవి. అచ్చమాంబగారి 'స్త్రీవిద్య' కథలో సూటిగాను, గురజాడవారి 'దిద్దుబాటు' కథలో ఒక వ్యంగ్య ధోరణిలోను, స్త్రీకి విద్య అవసరం గురించి చెప్పడం జరిగింది. గురజాడ వారి కథలో సమాజంలో పురుషులపై సానుల ప్రభావాన్ని చూపడం కూడా ఒక ఉద్దేశ్యం. రెండు రచనలూ సమాజంలోని రుగ్మతలను ఎత్తి చూపేవే!

అచ్చమాంబగారి అన్ని కథలూ ఈ కథంత సూటిగా లేవు. కాని, ఆవిడ ఈ కథను చెప్పడానికి, అందులో స్త్రీవిద్య అవసరాన్ని గురించి చెప్పడానికి ఎంచుకున్న మార్గం సంభాషణ! దిద్దుబాటు కథ కూడా సంభాషణ పూరితమైనదే కాని, అదొక నాటక ఫక్కీ! కథలో సంభాషణలు, నేపథ్యం, అన్నీ ఒక చిన్న సైజు రూపకంగా వేయవచ్చు.

'స్త్రీవిద్య' కథలోనిది స్త్రీకి విద్య కావాలా వద్దా అన్నది కూలంకషమైన చర్చ. స్త్రీకి విద్య అవసరమని చాలా స్పష్టంగా, ఎవరు చదివినా ఒప్పించగలిగే వాదనతో భావాలు వ్యక్తం చేయడం జరిగింది.


దిద్దుబాటు కథ అలా కాదు. స్త్రీ చదువు చాలా అవసరమని గోపాలరావు పైకి చెబుతూంటాడు. అయితే అతనిలోని నిగూఢ భావాలను రాముడు చెప్పకనే చెబుతూంటాడనిపిస్తుంది. గోపాలరావు కపటం.. సాని పాట వినడానికి వెళ్ళి భార్యకు అబద్ధాలు చెప్పడమే కాదు. ఆమె నిజం తెలిసి పుట్టింటికి వెళ్ళిపోయిందని తెలిసి కూడా ఆమెను తీసుకుని రావడానికి తను వెళ్ళడు. రాముడిని పంపించడాని ప్రయత్నిస్తాడు, అది కూడా, ఆమె ఇంకెవరికీ ఈ విషయం చెప్పకూడదని. రాముడు తను చెప్తానని అన్న మాటలు మళ్ళీ నిజాన్ని చెప్పేవే – రాకపోతే కొత్తగా వచ్చిన అందమైన సాని భార్య సరిగా ప్రవర్తించకపోతే జాగ్రత్త అని హెచ్చరిస్తూ. కథ మంచం కిందనుంచి వచ్చే నవ్వులతో ముగుస్తుంది. కమలిని చదువుకున్నదని పాఠకులకు తెలుస్తుంది. అదే చదువు ఇచ్చిన వివేకం వల్ల ధైర్యంగా ఒక నాటకం ఆడగలిగింది. గోపాలరావు గురించిన నిజం గురించి బయలు చేయడమే కాదు,ఆ నైజం తనకు తెలుసని కూడా స్పష్టంగా చెప్పింది. ఈ కథలో కమలిని, గోపాలరావుల మధ్య సంబంధం ఏమైందన్నది పాఠకుల ఊహలకే వదిలేశారు గురజాడ వారు. ఒక రచయితగా ఆయన బాధ్యతల్లా పాఠకుడికి సమాజంలో లోపాల్ని ఎత్తి పొడుస్తూ చూపడమే. పరిష్కారం సమాజానికే వదిలేశారు ఈ కథలో!

అచ్చమాంబ గారు అలా కాదు. ఆవిడ స్పష్టంగా సమస్యను పాఠకుల ముందుంచడమే కాదు, భర్త చెప్పిన విషయాలను ఒప్పింపబడి ఆలోచనలను మార్చుకున్న స్త్రీని పాఠకుల ముందుంచారు. అంతే కాదు... ఏ రోజుల్లోనైనా రూమర్లు, అసత్యాలు, ఎలా ప్రచారమవుతాయో అని ఆవిడ చెప్పిన పద్ధతి ఈ రోజుకీ అదే తంతు. మీడియా మారిందంతే.

రెండు కథలూ ఆ కాలానికి ఎన్నో దశాబ్దాలు ముందున్నాయని చెప్పాలి. ఎవరి ధోరణిలో వారు రాసినా, చివరికి సమాజం మారాలనే ఒక ఆశయం రెండు కథల్లోనూ స్పష్టంగా కనిపిస్తుంది.

***పరిచయకర్త: శాయి రాచకొండ, హ్యూస్టన్***

# కథాపుస్తక పరిచయం




## ఆలోచనా తరంగాలు

సామాజిక స్థితిగతులను, మనుషుల మనస్తత్వాలను, మనుషుల మధ్య సంబంధాలను. తన అనుభవంలో ఎదురైన వ్యక్తులను పరిశీలించి, పరిశోధించి.. తన ఆలోచనలకు అక్షరరూపం ఇచ్చి, డా. మజ్జి భారతి వ్రాసిన 24 కథల సమాహారం. ఈ సంపుటి సెప్టెంబర్ 2021 లో విడుదల అయింది. సంపుటి వెల రు. 160/-

ప్రతుల కోసం

✆ 9440615206

మెయిల్ : bharathikanthi65@gmail.com


## శారద సాహిత్యం

పొట్టకూటి కోసం ఆంధ్ర వచ్చి, నానాకష్టాలు పడుతూ, మాతృభాష తెలుగు కాకపోయినా, తెలుగు నేర్చుకుని అణిముత్యాల వంటి కథలు వ్రాసి, పిన్నవయసులోనే కాలంచేసిన రచయిత శారదా నటరాజన్. మరుగున పడిపోయిన వారి సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకొచ్చి, అరసం గుంటూరుజిల్లా శాఖ, శారద నటరాజన్‌గారి కథలు, గల్పికలు, లేఖలను శ్రీ వల్లూరు శివప్రసాద్, కె. శరత్చంద్ర జ్యోతిశ్రీ సంపాదకత్వంలో ఫిబ్రవరి 2020లో విడుదల చేశారు. వెల రు. 225/-

ప్రతుల కోసం

విశాలాంధ్ర బుక్‌హౌస్, నవచేతన బుక్‌హౌస్ ,

నవోదయ బుక్‌హౌస్‌ల బ్రాంచిలలో లభ్యమవుతాయి.



# చర్మ (చరమ) గీతి

వసుంధర

✆ 9885620065

***"నో తాతయ్యా – అర్థం చేసుకో. నాకు ఫ్లర్టింగు నచ్చదు" అంది నవజాత రక్కున.***
***ఛెళ్లుమంది నాకు. ఫ్లర్టింగ్ అంటే అసభ్యంగా ప్రవర్తించడం. ఆ పదానికి స్పెల్లింగు కూడా తెలియకూడని ఆరేళ్ల పసిపాప ఆ పదాన్ని అర్థవంతంగా వాడింది.***
***జీవితంలోని అన్ని దశల్లోనూ, ఆడదాన్ని గౌరవించడంలో ఆదర్శపురుషుడినని, నేనెరిగిన మహిళాలోకంలో పేరు తెచ్చుకున్న నామీద... ఆ పసిపాప ఫ్లర్టింగు ఉద్దేశ్యాన్ని ఆరోపించింది.***

"సర్వేంద్రియాణాం నయనం ప్రధానం – అంటారు. కానీ నా అభిప్రాయంలో నయనం కంటే ముఖ్యమైనది చర్మం!" అన్నాడు ఆచంట అప్పలనరసింహశాస్త్రి.

శాస్త్రిగారు ప్రవచన దురంధరుడు. గంటల తరబడి ప్రసంగించినా అలుపెరుగడు. జనాల్ని ఆకట్టుకునే గొంతు, విజ్ఞుల్ని విస్మయపరిచే పాండిత్యం... ఆయన ప్రత్యేకతలు!

నేటి బిజీ జీవితాన్ని నిరసిస్తాడు. మన ప్రాచీనగ్రంథాల ఔన్నత్యాన్ని ప్రశంసిస్తాడు. ఆయన ప్రసంగాలు వినడానికి జనం ఆలయాల్లో, సభల్లో బారులు తీరతారు. ప్రసంగం ముగిసేవరకూ కిమ్మనకుండా వింటారు. కొన్నాళ్లుగా టివిలో ఆయన నిర్వహిస్తున్న 'ప్రశాంత జీవనం' అనే కార్యక్రమానికి వచ్చే టిఆర్‌పి... సినీరంగంలో సూపర్‌స్టార్సు, గ్లామర్ గాళ్సు కనిపించే షోల టిఆర్‌పిని మించిపోయిందట!

నాకిలాంటివి మహా చిరాకు. ఏమాత్రం జ్ఞానం, పరిజ్ఞానం లేకుండా ఎదుటివాడికి అనర్గళంగా చెప్పగలిగింది వేదాంతం ఒక్కటేనని నా అభిప్రాయం.

"ఊహించడం కాదు. ఒక్కసారి ఆయన ప్రసంగం విని ఈ మాటను" అన్నాడు నా చిరకాల మిత్రుడు ఆనంద్.

తను రిటైరయ్యేక పల్లెటూళ్లో మా ఇంటి పక్కనే స్థిరపడ్డాడు. పేరుకి తగ్గట్లే ఎప్పుడూ ఆనందంగా ఉంటాడు. ఇష్టమైనవారికి లేని మంచి లక్షణాల నాపాదించడం అభిమానులకు మామూలే కదా, ఆనంద్ అభిప్రాయంలో శాస్త్రిగారు డిఫరెంటు! జనతకు సచ్ఛీలతని ప్రబోధిస్తూ, అందుకు అనువైన సూత్రాలు సూచిస్తాడట!

జీవితంలో ఎదురుదెబ్బలు ఎరుగను. అందుకేనేమో... దేవుడు, వేదాంతం గురించి ఆట్టే పట్టించుకోలేదు.

అలాంటి నాకు... రెండ్రోజుల క్రితం ఆరేళ్ల నా మనవరాలు నవజాత పెద్ద షాకిచ్చింది. మనసు పాడయింది. తేరుకోవడం కష్టంగా ఉంది. నా భార్య నన్ను ఓదార్చినా, కల్లోలమైన మనసుకి ప్రశాంతత కరువైంది.

ఆ సమయంలో మా ఊరి శివాలయంలో ప్రసంగించడానికి వచ్చారు ఆచంట అప్పలనరసింహశాస్త్రిగారు. అంతవరకూ ఆయన ప్రసంగాలు బయటే కాదు, టివిలో కూడా నేను వినలేదు.



“ఆయనే నిన్ను వెతుక్కుంటూ వచ్చాడు. నాకు కంపెనీ ఇవ్వడానికైనా రా” అని ఈసారి ఆనంద్ పట్టుబట్టాడు.

మామూలుగా ఐతే ఏమో కానీ, ఆ బలహీన క్షణంలో, ఆనంద్‌కి ఫేవర్ చేస్తున్నట్లు, “ఊఁ” అన్నాను.

పాండిత్యమో, జనమిచ్చిన హోదా మహిమో కానీ.. అక్కడ ఆయన దివ్యతేజస్సుతో వెలిగిపోతున్నాడు. అంతా ఆయనకి చేతులు జోడిస్తుంటే అప్రయత్నంగా నేనూ వాళ్లలో కలిశాను. ఆయన వేదిక మీద ఆసీనుడై ప్రసంగం ఆరంభించాడు.

గంభీర గళం. మాటలు అనర్గళం.

ముందేం చెప్పాడో కానీ... “సర్వేంద్రియాణాం నయనం ప్రధానమంటారు. కానీ నయనం కంటే ముఖ్యమైనది చర్మం” అన్న మాట చెవులబడి, నా దృష్టి పూర్తిగా ఆయన ప్రసంగం వైపు మళ్లింది.

ఆనంద్ అన్నట్లే... ఆయన చేప్పేవన్నీ మధ్యతరగతి జీవితంలో మనకి తెలిసిన ఘటనలే!

అందరు పిల్లలకిలాగే శాస్త్రిగారికీ చిన్నప్పుడు తల్లితో విడదీయలేని అనుబంధం ఉండేది. కనబడకపోతే వెతుక్కునేవాడు. కనబడగానే చప్పున వెళ్లి కౌగలించుకునేవాడు. ఆమె హత్తుకుంటే, వయసులో ఉన్నప్పటి ప్రియురాలి కౌగలింత కూడా ఆ మధురానుభూతికి సాటిరాదు.

శాస్త్రిగారి తల్లి ఛాందసురాలు. నెలకి మూడు రోజులు ఇంట్లోకి రాకుండా, వసారా గదిలో ఉండేది. ఆ సమయంలో ఆమె అంటరానిది. శాస్త్రిగారితో దూరం నుంచే మాట్లాడేది.

మూడు రోజుల తర్వాత స్నానం చేసి, ఇంట్లోకొచ్చే తల్లి కోసం కాచుకుని ఉండేవాడాయన. ముట్టుకోవచ్చా అనడిగి, ఔననగానే ఆమెకు అల్లుకుపోయేవాడు. ఆమె వీపు నిమురుతుంటే అదో పరవశం.

“అమ్మని కళ్లతో చూస్తే ఆనందం కలగొచ్చు. కానీ తాకినప్పుడు ఆ తృప్తే వేరు. ఆ స్పర్శానుభూతినిచ్చే చర్మం సర్వేంద్రియాల్లోకీ ప్రధానమైనది. గుడ్డివానికి చూపు లేని లోటుని తీర్చగలిగే స్పర్శ... ఓ మహత్తర శక్తి!”

వింటూ కాసేపు నేనే ఆయనైపోయాను. ఆయన చెప్పే ఉదాహరణలు నా జీవితంలో ఎన్నో...

నా చిన్నప్పుడు అమ్మకి జబ్బు చేసింది. అది అంటువ్యాధిట. నన్ను దగ్గరకెళ్లనివ్వలేదు. అమ్మని దూరాన్నుంచి చూడ్డం అసంతృప్తిగా ఉండేది. నయమయ్యేక, మొదటిసారి అమ్మని ముట్టుకున్నప్పుడు... ఆ అనుభూతి ఎప్పటికీ మర్చిపోలేను.

పెద్దలు పెళ్లిచూపులు ఏర్పాటు చేస్తే, మొదటిసారి చూసాను నా భార్య విమలని. తొలిచూపులోనే ఆమె అంటే ఇష్టం ఏర్పడిపోయింది. కానీ ఒకరినొకరు తాకినప్పుడే, ఆ ఇష్టానికి తగిన అనుభూతి కలిగింది.

మాకో అబ్బాయి, అమ్మాయి! చంటప్పుడు పలకరిస్తే చాలు, మనోహరంగా నవ్వేవారు. కానీ వాళ్లని దగ్గరగా తీసుకుని, ఎత్తుకుంటే ఆ అనుభూతి అలౌకికం.

పిల్లలకి కథలు చెప్పడం నాకిష్టం. ఇంటి పెరట్లోనో, డాబామీదో కూర్చున్నప్పుడు, కథ వినేటప్పటి వాళ్ల హావభావాలు నాకు సమ్మోహనం. కానీ రాత్రి భోజనాలయ్యేక కథ చెప్పడానికి పిల్లల్ని చెరో పక్కా దగ్గరగా తీసుకున్నప్పటి స్పర్శానుభూతి మాటలకందని ఓ అద్భుతం!

"స్పర్శకు సంబంధించి రామాయణంలో ఎన్నో అపూర్వ సంఘటనలున్నాయి" అంటున్నారు శాస్త్రిగారు.

వనవాసానికి వెళ్లేటప్పుడు వశిష్టమహర్షి సీతాదేవి తల నిమిరి, దీవించేడట. సీత ఆయన పాదాలంటి నమస్కరించి, "తండ్రీ! నీ స్పర్శతో నీ తపోబలం నన్నావహించింది. కఠోర వనవాసానికి నేనిప్పుడు సంసిద్ధురాల్ని. వనవాసమైతిరిగొచ్చేక, ఇలాగే దీవించి నన్ను చక్రవర్తి ఇల్లాలు కావడానికి సంసిద్ధురాల్ని చెయ్యాలి" అన్నదట.

ఇది చెప్పి శాస్త్రిగారు మంచినీళ్లు తాగుతుంటే, "ఈ సన్నివేశం వాల్మీకి రామాయణంలో ఉన్నదంటావా?" అని పక్కనున్న ఆనంద్‌ని అడిగాను.

"ఆయన ఏంచెప్పారన్నది కాదు, ఎందుకు చెప్పారన్నది ప్రధానం. విషయం వంటబట్టించడానికి ఆయన అప్పుడప్పుడు వివాదాస్పదం కాని కొత్త కథలు కల్పిస్తుంటారు" అన్నాడు ఆనంద్ వెంటనే.

ప్రసంగం కొనసాగుతోంది, "స్పర్శ విశిష్టమైనది. కంటికి కనిపించే పుష్పం కంటే, వంటికి తగిలే గాలి ఇచ్చే అనుభూతి గొప్పది. ఆ గ్రహింపే వనవాసంలో సీత సంతోషానికి కారణం. ఎందుకంటే, దేవుడు మనిషి కిచ్చిన గొప్ప కానుక ప్రకృతి! నగరాలు, రాజభవనాలు... ప్రకృతిని ఉందా లేదా అనిపించేంత పలుచన చేస్తాయి. అలాంటి చోటు నుంచి, ప్రకృతిమాత ఒడి అనతగ్గ అడవిలో అడుగెట్టిందామె. ఆ స్పర్శానుభూతి మామూలుదా?"

ఏ అంశం తీసుకుంటే – ఆ అంశాన్నే ప్రధానం చెయ్యడం ప్రవచనకారులకు మామూలే.

ఆయన సీత గురించి చెబుతుంటే, నాకు సీతయ్య గుర్తుకొచ్చాడు.

సీతయ్య మా పనిమనిషి చంద్రమ్మ కొడుకు. మా అమ్మాయి తొలికాన్పుకి వచ్చినప్పుడు వాడికి నాలుగేళ్లు.

చంద్రమ్మ వాణ్ణి తనతో తీసుకొచ్చి పెరట్లో ఉంచేది. ఇంట్లోకొచ్చి ఆడుకోవాలని వాడికుండేది కానీ మేము రానిచ్చేవాళ్లం కాదు. ఎందుకంటే వాడు మహా అపరిశుభ్రంగా ఉండేవాడు. అల్లరి కూడా ఎక్కువ. పెరట్లో వాడు పళ్లచెట్ల మీద రాళ్లు విసిరేవాడు. పూలమొక్కల పూలు కోసి నలిపేసేవాడు. పొరపాటున లోనికి రానిస్తే గోడల మీద బొగ్గుతోనో, సుద్దతోనే పిచ్చి గీతలు గీసేవాడు. వాడోసారి ఇంట్లోకొచ్చి పెరట్లోకెడితే, మా ఇల్లు తుఫానొచ్చి వెళ్లిన రోడ్డులా ఉండేది.

చంద్రమ్మ వాణ్ణి బాగా దెబ్బలాడేది. ఒకోసారి కాస్త గట్టిగానే కొట్టేది. కానీ వాడికి భయం తెలియదు. తన మీద ఆంక్షలెందుకో అర్థం కాదు.

కొడుకుని ఇంటి దగ్గర వదలడం చంద్రమ్మకి కుదరదు. బడిలో వేద్దామంటే, 'మీవాణ్ణి అదుపు చెయ్యడం నా వల్ల కాదమ్మా' అని టీచరు ఒప్పుకోలేదు. వాడి వల్లనే చంద్రమ్మకి రెండిళ్లలో పనులు పోయాయి. మేమూ తీసేసేవాళ్లమే, కానీ తను పనులు బాగా చేస్తుంది, అభిమానంగా చేస్తుంది.

"మీరెవరైనా తిట్టో, కొట్టో కాస్త భయం చెప్పండి బాబూ!" అని మనస్ఫూర్తిగానే అనేది చంద్రమ్మ.

కొట్టడం నాకిష్టముండదు. కొట్టే అలవాటూ నాకు లేదు. పెంకి పిల్లలు నాలాంటివాళ్లకి భయపడరని తెలుసు. వాణ్ణెలాగో ఇంట్లో అడుగెట్టకుండా ఒకరికిద్దరం కాపలా కాసేవాళ్లం. ఐతే నా కూతురికి నవజాత పుట్టేక... ఇక వాణ్ణి భరించలేమనే పరిస్థితి వచ్చింది!

నవజాత ఈ తరంలో మొదటి ఆడపిల్ల అని, దాన్ని చూసుకుని మేమంతా మురిసిపోతుండేవాళ్లం.

అది పుట్టగానే అల్లుణ్ణి డెప్యుటేషన్‌మీద మలేసియా పంపారు. అందుకని దానికి ఏడాది నిండేదాకా నా కూతురు ఇక్కడే ఉంది. మధ్యలో ఓసారి అల్లుడొచ్చి తన కూతుర్ని చూసుకుని వెళ్లాడు.

నవజాతకి నాదగ్గర బాగా చేరిక. రోజులో కనీసం నాలుగైదు గంటలు దాంతోనే గడిపేవాణ్ణి.

రోజులు క్షణాల్లా గడిచిపోయేవి కానీ, క్రమంగా సీతయ్య మాకు పెద్ద సమస్యగా మారాడు. ఇంకా మెడ నిలపలేని స్థితిలో ఉండగా... నవజాతని వాడు పెద్దగా పట్టించుకోలేదు.

ఎత్తుకుంటే అటూ ఇటూ చూడ్డం, పలకరిస్తే ముఖం మీద నవ్వులాంటి గీత రావడం, గొంతులోంచి ఊ, ఉక్కుం, ఉంగా లాంటి మాటలు రావడం మొదలయ్యేక, సీతయ్యకి అదంటే ఆకర్షణ మొదలైంది.

దగ్గరకొచ్చి పలకరించబోయేవాడు. మేము ‘దూరం, దూరం’ అనేవాళ్లం.

దాన్ని ఎత్తుకోవాలని మనసు పడేవాడు. కుదరదని అదిలించేవాళ్లం.

మేమెవరైనా కాస్త ఏమరుపాటుగా ఉంటే చాలు, నవజాత దగ్గరికెళ్లి “ఛీ ఛీ” అని ముద్దుగా పలకరించేవాడు. ఈలోగా ఎవరో ఒకరెళ్లి వాణ్ణి తరిమేసేవాళ్లం.

ఏడ్చేవాడు కానీ మేమెవ్వరం జాలి పడలేదు. వాణ్ణించి దాన్ని రక్షించడం కోసం వాణ్ణో కంట కనిపెడుతుండేవాళ్లం.

నవజాతకి మూడు నెల్లప్పుడు ఓ రోజు నేను దాన్ని భుజం మీదేసుకుని పెరట్లో తిరుగుతుంటే, ఉన్నట్లుండి సీతయ్య నాముందుకొచ్చి, “పాపని ఎత్తుకుంటా” అన్నాడు. రిక్వెస్టులా లేదు. ఆర్డరులా ఉంది.

“కుదరదు” అన్నాను.

“పాపకి నేనంటే ఇష్టం. నన్ను చూసి నవ్వింది” అన్నాడు సీతయ్య అదో సంజాయిషీలా.

“అదెప్పుడూ నవ్వుతూనే ఉంటుంది. నిన్ను చూసి అనుకోకు” అన్నాను.

సీతయ్య పట్టు వదల్లేదు. పాప తనని చూసి నవ్విందని ఋజువు చేస్తానన్నాడు.

నాకూ కాలక్షేపం కావాలి కదా, ‘సరేనని’ కుర్చీలో కూర్చుని, పాపని ఒళ్లో కూర్చోబెట్టుకున్నాను.

వాడు మాకు కాస్త దూరంగా నిలబడి ఏవేవో వెకిలి చేష్టలు చేశాడు.

పాప వాడివంకే చూసి కిలకిలా నవ్వింది. దాని చూపుల నిండా వాడంటే ఇష్టం కనిపించింది.

అలాంటి చూపులు, నవ్వులు దాన్నించి అదే మొదటిసారి. ఎంత ముద్దొచ్చిందంటే... దాన్ని బలంగా హత్తుకున్నాను. ఆ స్పర్శ ఎంత బాగుందో! నాకే అలా ఉంటే పసివాడికుండదూ ఆకర్షణ!

“నేనూ ఎత్తుకుంటా” అన్నాడు సీతయ్య.

"దూరాన్నుంచి ఆడించు. ఎత్తుకుందుకు వీల్లేదు" అన్నాను. అదే మహాభాగ్యమనుకున్నాడో ఏమో, సీతయ్య దూరాన్నించే మళ్లీ ఏవేవో వెకిలి చేష్టలు చేశాడు. పాప కిలకిల నవ్వింది.

ఆ చేష్టలు వాడికే సాధ్యం. ఆ నవ్వులు వాటికే లభ్యం.

ఇంట్లోవాళ్లని పిలిచి ఆ సీన్ రిపీట్ చేయించాను. అంతా ఎంత మురిసిపోయారంటే... రోజూ దూరాన్నుంచి పాపని ఆడించడానికి వాడికి అనుమతి ఇచ్చారు. పేరుకి అనుమతి కానీ, అది రిక్వెస్టులా ఉంది.

"నేను పాపని ఎత్తుకుంటాను" అన్నాడు సీతయ్య మళ్లీ. ఈసారి వాడి గొంతులో కాదనమన్న ఆశ ఉంది.

"ఎడ్డి వెధవా! ఎప్పుడైనా స్నానం చేసిన మొహమా నీది? నువ్వెత్తుకుంటే, పాపకి ఎక్కడ లేని రోగాలూ వస్తాయి" అని కసిరింది నా భార్య.

మర్నాడు చంద్రమ్మ పనికొచ్చినప్పుడు, కొడుకుని ఎత్తుకుని తీసుకొచ్చింది.

"ఎద్దులా ఎదిగాడు. వాణ్ణి ఎత్తుకోవడమేమిటే!" అని కసిరింది నా భార్య.

మాకు ఎద్దు కానీ, చంద్రమ్మకి కొడుకు ముద్దే కదా... ఏమనలేక వాణ్ణి దింపి పనిలోకి వెళ్లింది.

అప్పటికి పాప నిద్ర పోతోంది. లేవడానికి కనీసం గంట పడుతుంది. అందుకని ఎవరి పనుల్లో వాళ్లున్నాం.

ఉన్నట్లుండి చంద్రమ్మ పెద్దగా అరవడం విని అటు వెడితే, కళ్లబడ్డ దృశ్యాని కేడవాలో నవ్వాలో తెలియలేదు.

సీతయ్య పాపనెత్తుకుని పరుగెడుతున్నాడు. చంద్రమ్మ వాణ్ణి తరుముతోంది.

నేరస్థుడు కొడుకైతే... తల్లికి అందుతాడా?

నేను చటుక్కున వాణ్ణి పట్టుకుని, పాపని లాక్కుని, "దీన్ని ముట్టుకోవద్దని చెప్పానా?" అన్నాను కోపంగా.

వాడి మొహంలో భయం లేదు. "ఈవేళ నీళ్లోసుకున్నా. వాసన సబ్బుతో వళ్లు రుద్దుకుని శుభ్రంగా తయారయ్యా. నడిస్తే చెమటలు పడతాయని, అమ్మ చంకలో కూర్చుని ఇక్కడికొచ్చా. అందుకే పాపని ఎత్తుకున్నా" అన్నాడు. తన హక్కుని కష్టపడి సాధించుకున్న భావం వాడి మొహంలో ప్రతిఫలిస్తోంది.

అప్పుడు వాణ్ణి చూస్తే, రోజూ చూసే సీతయ్య కాదు. కడిగిన ముత్యంలా ఉన్నాడు.

అర్థమైంది. నిన్న నా భార్య వాణ్ణి ఎడ్డి వెదవా అంది. తన ఎడ్డితనమే పాపని ఎత్తుకోవడానికి అడ్డని భ్రమపడి, వాడు పాపకోసం స్నానం చేసొచ్చాడు.

నిజం చెప్పొద్దూ... ఆ క్షణంలో వాడి హావభావాలే కాదు, వాడూ ముద్దొచ్చాడు నాకు.

నాకు తెలుసు. వాడికి స్నానమంటే చిరాకు. వాళ్లమ్మ నీళ్లోస్తే వెంటనే మట్టిలో దొర్లేస్తాడు. విసిగిపోయిన చంద్రమ్మ వాడిని రోజంతా అలాగే వదిలేసి, రాత్రి పడుకోబోయేముందు ఒళ్లు కడిగేసి పడుకోబెడుతుంది. అలాంటివాడు ఓ చంటిపాపని

ఎత్తుకుని ఆడించే అవకాశం కోసం, స్నానం చేసి పరిశుభ్రంగా తయరయ్యాడు.

ఆరోజే కాదు. మర్నాడూ వాడు శుచియై, సుస్నాతుడై వచ్చేసరికి చంద్రమ్మతో, “గొప్ప ఉపాయం తెలిసింది. ఇక మీదట నీ కొడుకు నువ్వు చెప్పినట్లు విని, బడికెళ్ళి బుద్ధిగా చదువుకుంటాడు” అన్నాను.

స్పర్శ ఎంత గొప్పది? ఓ చంటిపాపని ఎత్తుకుని ఆడించాలన్న కోరిక తీవ్రమై వాడిలో జీవితానికి అవసరమైన మంచి మార్పులు తెచ్చింది...

శాస్త్రిగారు కొనసాగిస్తున్నారు, “రెక్కలు తెగి నేలమీద పడి కొన ఊపిరితో ఉన్న జటాయువు, శ్రీరామచంద్రుడి చేతిస్పర్శలో చెప్పలేనంత హాయిని పొంది, సంతోషంగా ప్రాణాలు వదిలాడు. చనిపోయేముందు సాక్షాత్తూ భగవంతుడి హస్తస్పర్శ ఎంతో పుణ్యం చేసుకున్నవారికి కానీ లభించదు!”

మనిషికి దేవుడి స్పర్శ అరుదైన వరమైతే, పిల్లలూ దేవుడితో సమానమే కదా!

నాకు మా పెదనాన్నగారి మనవరాలు లకుమ గుర్తుకొచ్చింది. అది మా అబ్బాయి కంటే ఏడాది పెద్దది. ఆరేళ్ల వయసులో ఓసారి సెలవులకి మా ఊరొచ్చింది. మా పిల్లలకి నేను చెప్పే కథలు, అవి చెప్పే తీరు కూడా దానికి చాలా నచ్చేవి.

అప్పుడు మా అబ్బాయికి ఐదు, అమ్మాయికి మూడున్నర! వాళ్లని చెరో పక్కనా పడుకోబెట్టుకుని, దగ్గరగా తీసుకుని కథ చెబుతుంటే... నా పక్కన పడుకుందుకు తనూ వాళ్లతో పోటీ పడేది. తడవకి ఇద్దర్ని మాత్రమే దగ్గరకు తీసుకోగలను కాబట్టి, వంతులు వంతులుగా ఇద్దర్ని పక్కలో పడుకోబెట్టుకుంటే, ఒకరు నా పొట్టమీద కూర్చునేవారు.

మొదటి తడవ పొట్టమీద కూర్చునేదెవరో నిర్ణయించడానికి వాళ్లమధ్య ఒప్పందం కుదరకపోతే, ముగ్గురి చేతా పంట వేయించేవాణ్ణి. పండిన ఇద్దరూ నాకు చెరో పక్కా... దొంగేమో నా పొట్ట మీద!

కథ మొదలెట్టగానే, నా దగ్గరున్న టైమర్ అలారాన్ని పావుగంటకి సెట్ చేసేవాణ్ణి. అలారం మోగగానే పొట్ట మీదున్నవాళ్లు పక్కలోకొచ్చేవారు. మిగిలిన ఇద్దర్లో పొట్టమీదికెవరు వెళ్లాలో నేను నిర్ణయించేవాణ్ణి. మళ్లీ పావుగంటకి టైమరు.

ఈ టైమరు ఏర్పాటు వాళ్లకి ఎంతగా నచ్చిందంటే, వాళ్ల దృష్టి కథ కంటే ఎక్కువగా అలారం మీదే ఉండేది. మా అమ్మాయికైతే కథ అంత బాగా అర్థం చేసుకునే వయసు లేదేమో... అది మధ్యమధ్య రన్నింగ్ కామెంటరీ కూడా ఇచ్చేది. ‘ఇంక మిగిలింది ఐదు నిముషాలు, నాలుగు, మూడు...’ అంటూ!

“నువ్వా టైమరు తీసుకుని పెరట్లోకెళ్లి ఆడుకో. మేం కథలు వింటాం” అని లకుమ విసుక్కునేది. పొట్టమీద కూర్చున్నప్పుడు మాత్రం దాని దృష్టి కూడా టైమరు మీదే ఉంటే... అది వేరే విషయం!

ఆ తర్వాత లకుమ వరుసగా రెండేళ్లు... వాళ్ళ ఇంట్లో మారాం చేసి మరీ మా ఊరొచ్చేసేది. వాళ్లు ముగ్గురికీ కథలు చెప్పడం నాకు జీవితంలో మరపురాని మధురానుభూతుల్లో ఒకటి!

ఆ తర్వాత తండ్రి ఉద్యోగరీత్యా బెంగాల్ వెళ్లిపోయింది లకుమ. మా ఇంటికి మళ్లీ రాలేదు. ఇప్పుడది తన పిల్లలకి కథలు చెబుతూ ఈ టైమరు ఆట ఆడుతూండవచ్చు!

నా పిల్లలకి పిల్లలు పుట్టుకొచ్చేక చరిత్ర పునరావృతమై... మళ్లీ కథలు, టైమరు ఆట ఆడుకోవచ్చని ఆశపడ్డాను.

కానీ నా మనవరాలు నవజాతకి ఏడాది నిండేక, నా కూతురు కూడా మలేసియా వెళ్లి, అక్కడో ఏడాదుండి వెనక్కొచ్చింది. ఓసారి చూడ్డానికొచ్చినా ఆదరాబాదరాగా నాలుగు రోజులుండి వెళ్లిపోయింది. పిల్లలతో సరదా తీరలేదు. తర్వాత వాళ్లకి ఢిల్లీలో పోస్టింగు. సెలవులు కుదరక, అత్తారింటి బాధ్యతలవల్ల సమయం కలిసిరాక... మూడు నాలుగేళ్లపాటు తను మా ఇంటికి రాలేదు.

మధ్యలో మేమోసారి వాళ్లని చూడ్డానికెళ్లినా, కొంత టైం... ఢిల్లీ, ఆ చుట్టుపక్కలా చూడ్డానికే ఐపోయింది. ఆపైన నవజాత స్కూల్లో కూడా చేరింది. లేచింది మొదలు... పడుకునేదాకా దాని హడావుడి దానిది.

"ఇలా లాభం లేదే! ఈసారి సెలవులకి రెండు మూడు వారాలుండేలా మా ఇంటికి రండి. అన్నయ్యని కూడా ఆ టైంకి రమ్మంటాను. మీరిద్దరూ పాత రోజులు గుర్తు చేసుకుందురుగాని, మేమిద్దరం పిల్లలతో ఆడుకుంటాం!" అని అమ్మాయికి చెప్పాను.

నా భార్య వెంటనే కలగజేసుకుని, "మేమిద్దరం అనకండి. పిల్లలతో ఆడుకునేది మీరే! నాకైతే మీ అందరికీ వండి వార్చాల్సిన బాధ్యత ఒకటుందిగా" అంది.

అలా అన్నప్పుడామె మొహంలో కోపం లేదు. ఆ రోజు కోసం ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నట్లుంది.

ఏమైతేనేం... చిట్టచివరకు నా కోరిక ఫలించింది. సెలవులకి మావాళ్లొచ్చారు.

నా పెద్ద మనవడు సుధీర్‌కీ నవజాతలాగే ఆరేళ్లు. రెండోవాడు జయంత్‌కి నాలుగేళ్లు.

సాయంత్రం ఆరింటికి ముగ్గుర్నీ సమావేశపర్చి, టైమరు ఆట గురించి చెప్పి రూల్సు వివరించాను.

అది వింటూనే నవజాత, "పంటలక్కర్లేదు. నేనే పెర్మనెంట్ దొంగని" అంది.

"అలాగైతే ఇది టైమరు ఆట అవదు. ఉత్తినే కథలు చెప్పుకోవడమే ఔతుంది. కాబట్టి పంట వెయ్యాల్సిందే" అని నొక్కించాను.

"నో తాతయ్యా – అర్థం చేసుకో. నాకు ఫ్లర్టింగు నచ్చదు" అంది నవజాత ఠక్కున.

ఛెళ్లుమంది నాకు. ఫ్లర్టింగ్ అంటే అసభ్యంగా ప్రవర్తించడం. ఆ పదానికి స్పెల్లింగు కూడా తెలియకూడని ఆరేళ్ల పసిపాప ఆ పదాన్ని అర్థవంతంగా వాడింది.

జీవితంలోని అన్ని దశల్లోనూ, ఆడదాన్ని గౌరవించడంలో ఆదర్శపురుషుడినని, నేనెరిగిన మహిళాలోకంలో పేరు తెచ్చుకున్న నామీద... ఆ పసిపాప ఫ్లర్టింగు ఉద్దేశ్యాన్ని ఆరోపించింది.

ఎందుకిలా జరిగింది? నా ప్రవర్తనలో ఏ లోపముంది?

నవజాత అన్న మాట... కూతురికి చెప్పకోలేనిది.

నా భార్యకి చెప్పుకున్నాను. ఆమె మాత్రం ఏం చేస్తుంది, ఓదార్చి ఊరుకుంది.

క్రుంగిపోయాను. ఆ క్రుంగుబాటే నన్ను ఆచంట అప్పలనరసింహశాస్త్రిగారి ప్రసంగానికి రప్పించింది.

శాస్త్రిగారు కొనసాగిస్తున్నారు.

సీతాదేవి మళ్లీ అయోధ్యలో అడుగెట్టింది. సీతారామలక్ష్మణుల్ని ఆహ్వానించడానికి వచ్చిన ప్రముఖుల్లో వసిష్టులవారూ ఉన్నారు.

'వనవాసానికి ముందు ఏమడిగావో గుర్తుందిగా? తిరిగొచ్చేక చక్రవర్తి ఇల్లాలుగా నీ బాధ్యతల్ని స్వీకరించడానికి సంసిద్ధమయ్యేలా దీవించమన్నావు. ఇప్పుడు నిన్ను దీవించడానికి వచ్చాను' అంటూ ఆమె తల నిమరడానికి చేయి చాచాడు.

ఆ బ్రహ్మర్షిని చూడగానే సీతాదేవికి... ఋషి వేషధారి రావణుడు స్ఫురించాడు. ఆమె చప్పున ఒక్కడుగు వెనక్కి వేసి, 'స్వామీ! పతివ్రతను. పరపురుషులు తాకవచ్చా?' అంది." శాస్త్రిగారు సన్నివేశాన్ని వివరిస్తున్నాడు.

కానీ నాకింక ఏమీ వినబడ్డం లేదు.

అనుబంధం దివ్యమైనది కావచ్చు. ఆత్మీయం కావచ్చు. అది స్పర్శని పునీతం చేస్తుంది. ఆ స్పర్శ చర్మంతో ముడిపడితే– 'సర్వేంద్రియాణాం చర్మం ప్రధానం' అన్న మాట చర్మగీతిగా మహత్తరమౌతుంది.

కానీ చర్మాన్ని చర్మంగానే చూసేవారు, చర్మం కోసమే చర్మాన్ని స్పర్శించాలనుకుంటే, అప్పుడు 'సర్వేంద్రియాణాం చర్మం ప్రధానం' ఏ సంస్కృతికైనా చరమగీతి ఔతుంది.

శాస్త్రిగారు ఏంచెప్పారో నేను వినలేదు. నవజాత సంస్కృతి చర్మగీతి నుంచి చరమగీతికి చేరకుండా ఎలా ఆపాలా అని ఆలోచిస్తున్నాను!

# తండ్రి

పి. రాజేంద్రప్రసాద్
✆ 9492525607


***"మాస్టారండీ! ఏమీ అనుకోవద్దు. మీకీ దీన స్థితి ఏమిటి? ఎందుకిలా అయ్యారు?" సంకోచిస్తూనే అడిగాను. ఆయన గొంతు సవరించుకున్నాడు. ఇలా అడుగుతానని ఆయన ముందే ఊహించి ఉండాలి "ప్రసాదూ! నీకు తెలుసుగా మా ఆవిడ పోయిందనీ, నాకు ఒకడే కొడుకని!" అంటూ ఆపారు. నేను తెలుసన్నట్టు తల ఊపాను.***

ఆదివారం మధ్యాహ్నం పూట పన్నెండు గంటలా ముప్పై నిమిషాలవుతున్నది. రాజమండ్రిలోని మంగళవారపుపేటలో గల మూడు బెడ్‌రూముల ఇంటిలోని ముందు హాలులో టీవీ చూస్తూ, వంటింటిలో నుంచి వస్తున్న ఘుమఘుమలను ఆస్వాదిస్తూ కూర్చున్నాను. అక్కడ నన్ను ఎవ్వరూ డిస్టర్బ్ చెయ్యరు. ఇందుకు రెండు కారణాలు. మొదటిది, అది మా స్వంత ఇల్లు, పైగా అరవై ఒక్క సంవత్సరాల వయసున్న నేను ఆ ఇంటి పెద్దని. రెండవ కారణం, మా ఇంటిలో మా ఆవిడ ఆ సమయంలో వంటింట్లో ఉంటుంది. ఇద్దరు కోడళ్ళూ అత్తగారికి అంతో ఇంతో సాయం చేయడానికి రెడీగా అక్కడే నిలబడి ఉంటారు. పెద్దబ్బాయీ, ఇద్దరు పిల్లలూ వాళ్ళ రూములోనూ, చిన్నబ్బాయీ, వాడి ఒక్కగానొక్క కొడుకూ, వాళ్ళ వాళ్ళ గదుల్లో టీవీలు చూసుకుంటూ కూర్చుంటారు. పొరపాటున కూడా ఇటు రారు. నేను చూసే తెలుగు, హిందీ, తమిళ పాటలూ, సంగీత కార్యక్రమాలూ వాళ్ళ ఒంటికి అస్సలు సరిపడవు. అందుకే నేనూ ఆ టీవీ వాల్యూమ్‌ను వీలైనంత తగ్గించే వింటాను. లేదంటే మా అబ్బాయి కొనిచ్చిన బ్లూ టూత్ హెడ్‌ఫోన్స్ పెట్టుకొని వింటాను. డోర్‌బెల్ మోగింది. అమెజాన్ వాడో, ఫ్లిప్‌కార్ట్ వాడో అయ్యుంటాడు అనుకుంటూ తలుపు తీశాను. ఎదురుగా ఒక పెద్దాయన నిలబడి ఉన్నాడు. వయసు ఎనభై దాటి తొంభై దరిదాపులకు వస్తోందన్న సూచనగా వంగిపోయి ఉన్నాడు. నీరుకావి పంచెకట్టు, ఏనాటిదో వేలాడుతున్న చివికిపోయిన షర్టు, అతని బీదరికాన్ని చెప్పకనే చెపుతున్నాయి. ఎడమవైపున ఉన్న జేబులో పాతకాలం నాటి ఇంకు పెన్ను, కాళ్ళకి అవసానదశలో ఉన్న చెప్పులూ, కళ్ళకి అలాంటిదే కళ్లజోడూ... ఇదీ ఆయన అవతారం. ఒకప్పుడు బాగానే ఉండేవాడేమో గాని ఇప్పుడు మాత్రం చితికిపోయాడు. ఏది ఏమైనా ఇప్పుడు మాత్రం డోర్‌బెల్ కొట్టి మరీ అడుక్కోవడానికి వచ్చినట్టున్నాడు. ఈ మధ్య ఎవరూ ఇళ్ల తలుపులు తెరిచి పెట్టుకోవడంలేదు. తెరిస్తే ఏసీ పోతుంది మరి. అందుకని ఆడుక్కోవడానికి డోర్‌బెల్ కొట్టి మరీ పిలుస్తున్నట్టున్నారు అనుకుంటూ విసుగ్గా, గట్టిగా "ఏం కావాలీ?" అన్నాను.

ముసలాయన బెదిరాడు. అదే నాక్కావాల్సింది. ఇంతలో ఆయనే తేరుకుని "రాజేంద్రప్రసాద్‌గారు..." అంటూ సందేహంగా ఆపేశాడు.

"అవునయ్యా... నేనే! ప్రతివాడూ నేమ్‌బోర్డు చూడడం... పేరు పెట్టి అడగడం... వెధవది బోర్డు తీసి పడెయ్యాలి... చెప్పు ఏం కావాలి?" మరింత తీవ్రంగా అడిగాను.

"నేను వెంకటేశ్వరశాస్త్రిని ప్రసాదూ! వీ టీ హై స్కూల్లో మీ తెలుగు మాస్టార్ని." నెమ్మదిగా అన్నాడాయన.



నేను నిర్ఘాంతపోయాను. గబుక్కున తేరుకుని, గుమ్మానికి అడ్డం తొలగి, "మాష్టారూ! మీరా... క్షమించండి. ఏమీ అనుకోవద్దు. లోపలికి రండి." అంటూ ఆయన చేతిలోని సంచీ అందుకుని ఆయనను లోపలికి తీసుకుని వచ్చాను. ఆయన్ను సోఫాలో కూర్చోబెట్టి ఏసీ వేశాను. మనసులో పుట్టిన అపరాధభావం ఏ మాత్రం పోలేదు. అమాంతం ఆయన కాళ్ళ మీద పడ్డాను.

ఆయన కంగారుపడ్డారు.

"నన్ను క్షమించండి మాష్టారూ! మీ పట్ల చాలా అనుచితంగా ప్రవర్తించాను." అంటూ ఆయన కాళ్ళు పట్టుకున్నాను.

ఆయన కళ్ళల్లో ఎందుకో నీళ్ళు వచ్చాయి. నా భుజం పట్టుకొని మృదువుగా లేవదీస్తూ "ప్రసాదూ! ఇప్పుడేమైందిరా! నన్ను గుర్తు పట్టలేకపోయావంతే కదా!" అన్నారు.

లేచి నిలబడి "మీరు ఏమీ అనుకోవద్దు మాష్టారూ! గుర్తు పట్టలేకపోయాను." అంటూ అప్పటికే మా ఆవిడ తెచ్చి ఇచ్చిన చల్లటి మంచినీళ్ళు ఆయనకు అందించాను. అప్పటికే ఈ వింతనంతా చూడటానికి వచ్చిన మా పిల్లల్నీ, కోడళ్ళనీ, మనుమలనీ, మా ఆవిడ్నీ ఆయనకు పరిచయం చేశాను.

"అందరూ కలిసే ఉన్నార్రా! చాలా సంతోషం. ఆకలేస్తోందిరా! భోజనం పెట్టిస్తావా?" అన్నారు.

ఛెళ్ళున చెంప మీద కొట్టినట్టయ్యింది.

"అయ్యో! లేవండి మాష్టారూ! కాళ్ళు కడుక్కోండి! భోజనం చేద్దురుగాని." అంటూ లేవదీశాను.

భోజనం చేస్తూనే "ప్రసాదూ! వేరే దిక్కులేని వాణ్ణి. మీ ఇంట్లో కొంచెం చోటిస్తావా! తల దాచుకుంటాను." అన్నారు.

నా గుండె కరిగి నీరైంది. కళ్ళనీళ్ళు తుడుచుకున్నాను. "అంతకన్నానా మాస్టారండీ! ఇది మీ ఇల్లే! నిర్భయంగా ఉండండి. మీరొక్కరూ మాకు భారం కారు." అన్నాను.

మా పెద్దబ్బాయీ, చిన్నవాడూ కూడా "తాతయ్య గారూ! మా నాన్నగారికి గురువులు మాకు పూజనీయులు. మీకు ఏ లోటూ రానివ్వం. మీరిక్కడే ఉండండి." అన్నారు ఏకగ్రీవంగా!

ఆయన తృప్తిగా నవ్వి ఇద్దర్నీ "సుఖీభవ!" అంటూ ఆశీర్వదించారు.

భోజనానంతరం ఆయన్ని గెస్ట్‌రూమ్‌లో ప్రవేశపెట్టి పక్క సర్ది ఏసీ వేసి పడుకోమన్నాను. సాయంకాలం టెర్రస్ మీదకు వెళ్లి టీ తాగాము. ఏదో మాట్లాడాలి కనుక మొదలు పెట్టాను.

"మాస్టారండీ! ఏమీ అనుకోవద్దు. మీకీ దీనస్థితి ఏమిటి? ఎందుకిలా అయ్యారు?" సంకోచిస్తూనే అడిగాను.

ఆయన గొంతు సవరించుకున్నాడు. ఇలా అడుగుతానని ఆయన ముందే ఊహించి ఉండాలి "ప్రసాదూ! నీకు తెలుసుగా మా ఆవిడ పోయిందనీ, నాకు ఒకడే కొడుకని!" అంటూ ఆపారు. నేను తెలుసన్నట్టు తల ఊపాను.

ఇరవై ఏళ్ల క్రితం నేను ఇక్కడే జాబ్ చేసేటప్పుడు ఆయన అప్పుడప్పుడు కనబడినప్పుడు నమస్కారం పెడితే ఆయన తమ కుటుంబ విషయాలు చెప్తూ ఉండేవారు. నేను ఇక్కడించి హైదారాబాద్ ట్రాన్స్ఫర్ అయ్యి వెళ్లి పోయిన కారణంగా ఏమీ తెలియలేదు. మళ్ళీ నేను రిటైర్ అయ్యాక రాజమండ్రి వచ్చి ఇల్లు కట్టుకోవడం! ఇక్కడకు వచ్చి సంవత్సరం కూడా కాలేదు. అందుకనే ఆయన గురించి బొత్తిగా తెలియకుండా పోయింది.

ఆయన కొనసాగించారు "వాడికి పిల్లలు లేరు ప్రసాదూ! సరియైన ఉద్యోగమూ లేదు. ఏవేవో చిన్న చిన్న వ్యాపారాలు కూడా చేసి చితికిపోయాడు. నీకు తెలుసుగా... నాది ప్రైవేటు స్కూలు కాబట్టి పెన్షను నామమాత్రమే. ఏదో అలా గడిచేది.

అయిదేళ్ల క్రితం వాడి భార్య పోయింది. వాడికిప్పుడు ఏభై అయిదేళ్ళు. నీ కంటే చిన్నవాడే. వాడికి కాన్సరు వచ్చిందిరా!" ఆయన గుడ్ల నీరు కుక్కుకుంటూ కుర్చీలోంచి లేచి వెళ్లిపోయారు.

గాలికి ఊగిపోతున్నట్టు నడుస్తున్న ఆయన బక్క పలుచని శరీరాన్ని అలాగే చూస్తూ నోట మాట రాక కూర్చుండిపోయాను.

★★★

రెండు రోజులు గడిచాయి. ఈ రెండు రోజుల్లో ఆ ముసలాయనను ఇంకేమీ అడగలేదు. అడిగి, ఆయన మనసులోని గాయాన్ని ఇంకా రేపి నేనేం సాధిస్తాను? అందరూ కలిసి నెలకు నాలుగైదు లక్షలు సంపాదించే మాకు ఆయనొక భారం కాదు. అందుకే నేనేమీ మాట్లాడలేదు.

రోజూ మెట్లెక్కడం ఎందుకని సాయంకాలపు టీని హాల్లోనే ఏర్పాటు చేశాను. మూడోరోజు టీ తాగుతూ ఉండగా మాస్టారి జేబులోని సెల్ మోగింది. అంతవరకూ ఆయన దగ్గర సెల్‌ఫోన్ ఉన్నదని నాకు తెలియలేదు. ఆశ్చర్యంగా చూస్తున్నాను.

సెల్ మాట్లాడుతున్న మాస్టారి ముఖంలో సంతోషమో, దుఃఖమో తెలియని విచిత్ర భావాలు కలుగుతున్నాయి. మాట్లాడడం ముగించి ఒక్కసారిగా సెల్ పక్కన పడేసి ఏదో ఆలోచిస్తూ కూర్చున్నారు.

"మాష్టారూ! ఏమయ్యింది?" ఆందోళనగా అడిగాను.

ఆయన ముఖంలో సంతోషంలాంటి ఏదో ఒక భావం కనిపించింది "మా అబ్బాయి చనిపోయాడంట ప్రసాదూ! ఇక్కడే దగ్గరలోని ఇన్నీసుపేటలోనే! ప్రక్క ఇళ్ల వాళ్ళు దహన సంస్కారాలకి ఏర్పాటు చేసేశారంట. నేనెక్కడున్నానో తెలియదు కదా మరీ! నేను వెంటనే బయలుదేరాలి. వాడిని శ్మశానానికి తీసుకువెళ్ళకముందే వాడి దగ్గర ఉన్న ఏ టీ ఎమ్ కార్డు తీసుకోవాలి. నా పెన్షను ఇద్దరికీ సరిపోక నేను నీ దగ్గరికి వచ్చాను ప్రసాదూ! ఏమీ అనుకోకు. ఇప్పుడు వాడు చనిపోయి సుఖపడ్డాడు. నాకూ పెన్షన్ ఇక సరిపోతుంది. నిన్ను బాధ పెట్టను. వెళ్లొస్తానూ!" అంటూ బయలుదేరడానికి లేచారు.

నా నోట మాట రాలేదు. మాష్టారిని అర్థం చేసుకోడానికి అట్టే సమయం పట్టలేదు.

గొంతుకకు ఏదో దుఃఖపు తెర అడ్డుపడింది. "మేష్టారూ! ఆగండి. నేనూ వస్తాను. కారులో మిమ్మల్ని తీసుకుని వెళతాను." కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ అన్నాను!

# ఎవరి ఆనందం వారిదే కాని ...

మల్లాప్రగడ రామారావు
✆ 9989863398

***"నాన్నగారు కానుకలేవీ వద్దన్నారు. ఏమైనా ఇస్తే, 'శాంతి ఆశ్రమాని'కే ఇమ్మన్నారు. నేను ఇరవై వేలు ఇస్తున్నాను" ప్రకటించాడు రామం.***
***"నేనూ, హేమా అదే అనుకున్నాం" అన్నాడు నారాయణ, నీ సంగతేమిటన్నట్టు వాసుని చూస్తూ.***
***"నేనూ, పూర్ణా అత్తగారికి మామగారికి కొత్త బట్టలు కొన్నాం. పొందూరు ఖద్దరు చీరా, చాపూ."***
***"నీకన్నా నేనే నయం. పెదనాన్నకి, దొడ్డకి పట్టుబట్టలు కొన్నాను" అన్నాడు ధనుంజయ.***
***నవ్వేడు కాని వాసు బదులు పలకలేదు.***

"బావగారూ! షేర్డ్ ఆటోలోనేనా రావడం" పలకరించాడు రామం.

"మరే అన్నయ్యా!" జవాబిచ్చింది పూర్ణ.

"ప్రత్యేకం అడగాలేమిట్రా! బావగారు షేర్డ్ ఆటోలో రాకున్నా, స్లీపర్ క్లాస్‌లో కాకుండా రైలు ప్రయాణం చేసినా, నా మీసం గొరిగించుకుంటాను" అన్నాడు నారాయణ.

అందరూ నవ్వులు.

"వాళ్ళ ఇంట్లోకి సోఫా సెట్ వచ్చినా, బావగారు స్కూటర్ కొన్నా, పూర్ణ మెడలో రెండు పేటల గొలుసు కనబడినా, నేను అరగుండు గీయించుకుంటాను" వంత పాడాడు ధనుంజయ.

మళ్లీ నవ్వులు.

"ఇక ఆపండ్రా మీ పరాచికాలు" పెద్దాయన చిరాకు గమనించి, వేరే మాటల్లో పడ్డారంతా.

పెద్దాయన వెంకట్రావు. అర్ధాంగి సీతమ్మ. వారి కొడుకులు రామం, నారాయణ. కోడళ్ళు సుమ, హేమ. ఒకర్తే కూతురు పూర్ణ. అల్లుడు వాసు. తమ్ముడి కొడుకు ధనుంజయ.

మర్నాడు వెంకట్రావుగారి షష్టిపూర్తి. తెల్లవారుఝామునే రామం నూతన గృహప్రవేశం. పొరుగూర్లో ఉన్న నారాయణ, భార్యా పిల్లలతో ఉదయాన్నే వచ్చాడు. మధ్యాహ్నం భోజనాల వేళకి దిగాడు ధనంజయ. ఊర్లోనే ఉన్న పూర్ణ, వాసు చీకటి పడుతుండగా వచ్చారు.

"ఆయనన్నారని కాదు కానీ, నువ్వైనా చెప్పొచ్చు కదా అన్నయ్యగారికి! ఎందుకీ పిసినారితనం." నొచ్చుకుంటూ అంది సుమ, ఆడపడుచుతోపాటు లోపలికి వెళ్తూ.

"ఏడాదికో, ఆరు నెలలకో ఒక సినిమాకు వెళ్తారు. హోటల్‌కి ఎప్పుడైనా వెళ్తే గొప్పే. డబ్బంతా దాచి ఏం చేస్తారొదినా" హేమ.



"మాకిలాగే బాగుంది వదినమ్మలూ" నవ్వుతూ జవాబిచ్చింది పూర్ణ.

"వదిలేయక చేసేదేముందిలే. ఉన్న మీ ఒక్క పిల్లా, చక్కగా టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో స్కాలర్‌షిప్‌తో చదువుకుంటోంది. మీ ఆయనకీమధ్య ప్రమోషన్ కూడా వచ్చింది. అయినా నీ రాత నా రాత కన్నా అధ్వానమయింది." భారంగా అంది సీతమ్మ.

నవ్వుతూ చూసింది అమ్మ వైపు పూర్ణ.

"దానికీ రాతే బాగుంది లేవే" అన్నారు ఆ గదిలోంచి పెరట్లోకి వెళ్తున్న వెంకట్రావుగారు కూతురుని మురిపెంగా చూస్తూ... "ఇలా బ్రతకడం ఇద్దరికీ నచ్చే" అన్నారు కొనసాగింపుగా.

★★★

రాత్రయింది. భోజనాల వాళ్ళ భోజనాలు, ఫలహారాలవాళ్ళ ఫలహారాలు అయ్యాయి.

తండ్రి చాటుగా పొగ పీల్చుదామని అన్నదమ్ములు ముగ్గురూ డాబా మీద చేరారు. కూడా వాసు.

"నాన్నగారు కానుకలేవీ వద్దన్నారు. ఏమైనా ఇస్తే 'శాంతి ఆశ్రమాని'కే ఇమ్మన్నారు. నేను ఇరవై వేలు ఇస్తున్నాను" ప్రకటించాడు రామం.

"నేనూ, హేమా అదే అనుకున్నాం" అన్నాడు నారాయణ, నీ సంగతేమిటన్నట్టు వాసుని చూస్తూ.

"నేనూ, పూర్ణా అత్తగారికి మామగారికి కొత్త బట్టలు కొన్నాం. పొందూరు ఖద్దరు చీరా, చాపూ."

"నీకన్నా నేనే నయం. పెదనాన్నకి, దొడ్డకి పట్టుబట్టలు కొన్నాను" అన్నాడు ధనుంజయ.

నవ్వేడు కాని వాసు  బదులు పలకలేదు.

★★★

మర్నాడు శాస్త్రోక్తంగా గృహప్రవేశం, షష్టిపూర్తి జరిగాయి. బంధువులు, స్నేహితులతో ఇల్లు కళకళలాడింది. సాయంకాలం కుటుంబ సభ్యులందరూ శాంతి ఆశ్రమానికి వెళ్లారు.

కాషాయంబరాలు ధరించిన, డెబ్బై దాటిన, ఆశ్రమ నిర్వాహకులు జయరామ్‌గారు అందరినీ చిరునవ్వుతో స్వాగతించారు.

సీతమ్మగారికీ, వెంకట్రావుగారికీ ఆశ్రమంలో ఉంటున్న పిల్లల్లో ఓ ఇద్దరు చెరో గులాబీ అందించారు.

"మా నాన్నగారి పేరున... ఏదో ఉడతా భక్తిగా..." అంటూ తనతో తెచ్చిన చెక్కును జయరాంగారికి అందజేసాడు రామం.

"మనకున్న దాంట్లో కొంతైనా ఇలా వినియోగించాలి కదా..." అంటూ అదే పని చేసాడు నారాయణ.

"సుఖీభవ!" అని మాత్రం అన్నారు జయరాంగారు.

ఆ తంతు ముగిశాక, "ఆశ్రమం పెద్దగానే ఉందే! ఎప్పుడు వద్దామనుకున్నా కుదరలేదు. మొత్తం చూసొద్దాం" అని అందరినీ బయలుదేర తీసాడు రామం.

"మీరూ రండి బావగారూ! ఆశ్రమం చూసాకైనా..." అన్నాడు నారాయణ.

వచ్చిన దగ్గర నుంచీ పూర్ణతోబాటు పిల్లలతో ముచ్చటలాడుతున్న వాసు సమాధానంగా చిరునవ్వు నవ్వాడు.

"మీరు మారరు బావగారూ" అన్నాడు రామం.

"నువ్వైనా చెప్పొచ్చు కదా పూర్ణా!" అన్నాడు ధనుంజయ.

ఇంక ఊరుకోలేక నోరు విప్పాడు జయరాంగారి సహాయకులు శంకరంగారు.

"కొత్తగా చూసేదేముంది. ప్రతినెలా మొదటి ఆదివారం దంపతులిద్దరూ తప్పక వస్తారండి. జీతంలో సగం అమ్మవారి విగ్రహం ముందుంచాలి కదండీ..."

అవాక్కయ్యారు ముగ్గురు బావమరుదులూ.

ముందుగా తేరుకున్న నారాయణ, "మన్నించండి బావగారు! మీ గొప్పతనం అర్థం చేసుకోలేకపోయాం" అన్నాడు.

"అంతంత మాటలెందుకురా! మీకు బాగున్నట్టు మీరుంటున్నారు. మాకు బాగున్నట్టు మేముంటున్నాం" అంది పూర్ణ.

చూపులతోనే భార్యని అభిషేకించాడు వాసు.

"ఎవరిదారి వారిదేయైనా, కొన్ని దారులే లోకోపకారానికి దారి తీస్తాయి" అనుకున్నాడు శంకరం గారు.

# తాళం చెవి

**నాగమంజరి గుమ్మా**

✆ 9985667500

***ఈ పుస్తకం పేరు లీలావతి గణితం. గణిత, జ్యోతిష్య శాస్త్రాలలో పండితుడు భాస్కరాచార్యుడు. తన కుమార్తె జాతకం పరిశీలించి, బాల వైధవ్యం అంటే తనకు పెళ్లి అయిన కొద్ది రోజుల్లోనే ఆమె భర్త చనిపోతాడని గ్రహిస్తారు. బలమైన ముహూర్తం నిర్ణయించి, సమయం మించకుండా ఉండటానికి ఇసుక గడియారాన్ని కూడా సిద్ధం చేసుకుంటాడు. కానీ ఒక చిన్న ఇసుక రేణువు కాస్త పెద్దది కావడంతో కిందకు జారడానికి కాస్త సమయం పట్టింది.***

“మామ్. నా వర్క్ కంప్లీట్ అయిపోయింది. మా ఫ్రెండ్స్ ఎవరూ ఆన్లైన్ లేరు. నాకు బోర్ కొడుతోంది మామ్... ఈ హాలిడేస్‌లో టూర్ వెళ్తానంటే మీకు సెలవులు లేవని వద్దన్నారు. నేను ఇంకా చిన్న పిల్లాడినా... బి.టెక్ ఫస్ట్ సెమిస్టర్ అయిపోయింది కదా... వై డోంట్ యు సెండ్ మీ ఎలోన్?” కాస్త చిరాకుగా అన్నాడు అభి.

“అభి, నువ్వు పెద్దాడి వయ్యావు. ఇన్నాళ్లు హాస్టల్‌లో ఉండి చదువుకుని వచ్చావు. మాకు దూరంగా ఐదేళ్లు ఉన్నావు. ఇప్పుడే కదా ఓ పదిహేను రోజులు నువ్వు మాతో గడిపేది. రోజులో సగానికి పైగా నీ కంప్యూటర్‌తోనే గడుపుతావు. నేను ఇంట్లో ఉన్న కాసేపు నాతో స్పెండ్ చెయ్ మై బోయ్” చెప్పింది సుభద్ర.

“సరే మామ్, ఏం చెయ్యాలో చెప్పు, బట్ మా ఫ్రెండ్స్ ఆన్లైన్ వస్తే నేను మళ్ళీ వెళ్లిపోతాను.”

“ఓకే. నువ్వు కాసేపు నా రూమ్‌లోకి రా” అంటూ కొడుకు చెయ్యి పట్టుకుని తన గదిలోకి తీసుకువెళ్ళింది సుభద్ర.

ఎనిమిదవ తరగతి నుండి ఇంటర్ వరకు కార్పొరేట్ స్కూల్, కాలేజీల్లోనే గడిచింది అభిమన్యుకి. ఇప్పుడు బి.టెక్. కూడా హాస్టల్లోనే! ఇంటికి వచ్చిన ప్రతిసారి తన గదిలో కంప్యూటరుతోనో, లేదా టీవీ చూస్తూనో కాలం గడిపేసేవాడు. ఎప్పుడూ చదువులో ఫస్ట్ ర్యాంక్‌లో ఉండే కొడుకు ఆనందాల్ని కాదనలేకపోయినా.. తమకు, వాడికీ ఏదో దూరం పెరుగుతున్నట్లు గుర్తించింది సుభద్ర. భర్త పార్థుతో ఈ విషయమై మాట్లాడింది. కానీ పార్థు తేలిగ్గా తీసుకున్నాడు.

“వాడిని వదిలేయ్ సుభద్రా... ఇప్పటి తరం చదువులన్నీ కంప్యూటర్లోనే... పరీక్షలూ కంప్యూటర్‌లోనే! మనమేమైనా వాడిని పట్టించుకోకుండా వదిలేసామా? వాడేమైన చదువులో వెనకబడ్డాడా? ఎందుకు అనవసరంగా గాభరా పడతావు?” అని సుభద్రనే మందలించాడు.

భర్త తీసుకున్నంత తేలిగ్గా తన మనసుకు సర్ది చెప్పుకోలేకపోయింది. ఇలాగే వదిలేస్తే తమకు అభిమన్యుకు మధ్య దూరం పెరుగుతుందని, తర్వాత తమని కొడుకు పట్టించుకోవడం లేదని, అందరు తల్లిదండ్రులలాగే బాధపడాల్సి వస్తుందని

భావించింది. ఒక ప్రణాళికను సిద్ధం చేసుకుంది. అభి సెలవులకు రాగానే అమలుపరచడం ప్రారంభించింది. అందులో భాగంగా మొదట కొడుకు సెలవుల్లో ఊరికి వెళ్తానంటే, తను కూడా రావడానికి సెలవులు లేవనే సాకుతో మాన్పించింది. ఇప్పుడు తన గదిలోకి తీసుకు వచ్చింది.



“మామ్, ఏం చెయ్యాలి నేను?”

“చూడు అభి, పండుగ రాబోతోంది కదా... కాస్త నాకు ఈ పుస్తకాలు సర్దడంలో హెల్ప్ చేస్తావా?”

“సరే మామ్”

అభిమన్యు ఎప్పుడూ తల్లిదండ్రుల గదిలోకి రాలేదు.. ఆ అవకాశమే రాలేదు అంటే సమంజసంగా ఉంటుందేమో! నిజానికి తన గది, హాలు తప్ప వేరే ఏదీ తెలియదు అనడమే సరైనది! కాసేపు ఆ గదిని పరిశీలనగా చూసాడు. గోడలకు రెండు కళాత్మక చిత్రాలు, ఒక అరలో జ్ఞాపికలు, మూడు అరల్లో పుస్తకాలు, రెండు బట్టల బీరువాలు, ఒక విశాలమైన మంచం, ఒక టేబిలు, కుర్చీ ఉన్నాయి. జ్ఞాపికలను తదేకంగా చూసాడు. కొన్నిటిపై అమ్మ పేరు, కొన్నిటిపై నాన్న పేరు ఉన్నాయి. కొన్నిటిపై ఎవరి పేరు లేదు, కేవలం సంస్థ పేర్లు మాత్రమే ఉన్నాయి. ఈలోగా సుభద్ర కొన్ని పుస్తకాలను తెచ్చి టేబుల్‌పై పెట్టింది.

“రా అభి! ఈ పుస్తకాలను నీకు తెలిసినంత వరకు సెపరేట్ చెయ్యగలవేమో చూడు” అని పిలిచింది.

ఒక్కొక్క పుస్తకం తెరిచి చూసాడు. ఏమి అర్థం కాలేదు. అన్నీ తెలుగు పుస్తకాలు! తోచినట్టుగా సెపరేట్ చేసాడు. విసుగు వచ్చింది. ఇంతలో మరికొన్ని పుస్తకాలు తెచ్చి ముందు పెట్టింది. అయిష్టంగానే తిప్పిచూసి, వేరు చేస్తున్నాడు. ఒక

పుస్తకంలో పేజీలు తిరగేస్తే తెలుగు అక్షరాలు తక్కువగా, అంకెలు ఎక్కువగా కనిపించడంతో ఆసక్తిగా చూసాడు. అది ఒక పజిల్ పుస్తకంలా కనిపించింది. తెలిసిన మేరకు చదివి, కాస్త అర్థం చేసుకుని ఒక సమస్య సాధించాడు. హుషారు వచ్చింది. కానీ వచ్చిన చిక్కల్లా ఎక్కువ భాగం తెలుగులో ఉంది. తల్లి దగ్గరకు తీసుకు వెళ్ళాడు.

“అమ్మా, ఇవి కొంచెం చదివి చెప్పవూ” అని అడిగాడు.

చేస్తున్న పని ఆపి, అభి చేతిలోని పుస్తకం చూసింది. లీలావతి గణితం. “సరే రా” అంటూ కూర్చోపెట్టుకుని కొన్ని సమస్యలు చదివి వినిపించింది. వింటూనే ఎలా పరిష్కరించాలో ఆలోచన చేసి, జవాబు చెప్పేసేవాడు.

“అభి ఇలా నీతో కూర్చుంటే నా పనులెలా అవుతాయి? కొంచెం కొంచెంగా చదువు, అర్థం చేసుకో... నీకు చదవడానికి బాగా ఇబ్బంది అయినపుడు నాకు చెప్పు...” అని తిరిగి సర్దడంలో మునిగింది.

అభి కాస్త చిన్నబుచ్చుకున్నా సర్దుకుని చదవడం ప్రారంభించాడు. అనుమానాలుంటే, చదవడం కష్టం అయితే అమ్మను అడుగుతూ కాసేపు మాత్రమే ఉంటానన్నవాడు కాస్తా మధ్యాహ్నం వరకూ అక్కడే గడిపాడు. తన ఫ్రెండ్స్, కంప్యూటర్ విషయం మర్చిపోయాడు. సుభద్ర పెదవులపై లీలగా చిరునవ్వు మెరిసింది.

మధ్యాహ్నం భోజనం కాగానే తన గదిలోకి వెళ్తాడేమో అని చూసింది. మళ్ళీ పుస్తకం పట్టుకోవడం చూసి సంతోషించింది.

సాయంత్రం వరకు పుస్తకంతో కుస్తీ పట్టాడు. “మామ్ నాకు చాలా నచ్చింది ఈ బుక్. దీని పేరేంటి?” అడిగాడు.

“ఈ పుస్తకం పేరు లీలావతి గణితం. గణిత, జ్యోతిష్య శాస్త్రాలలో పండితుడు భాస్కరాచార్యుడు. తన కుమార్తె జాతకం పరిశీలించి, బాలవైధవ్యం అంటే తనకు పెళ్లి అయిన కొద్ది రోజుల్లోనే ఆమె భర్త చనిపోతాడని గ్రహిస్తారు. బలమైన ముహూర్తం నిర్ణయించి, సమయం మించకుండా ఉండటానికి ఇసుక గడియారాన్ని కూడా సిద్ధం చేసుకుంటాడు. కానీ ఒక చిన్న ఇసుక రేణువు కాస్త పెద్దది కావడంతో కిందకు జారడానికి కాస్త సమయం పట్టింది. ఈ చిన్న తేడా వలన ముహూర్త సమయానికి కొంచెం ఆలస్యం కావడం, పెళ్లి అయిన కొద్దిరోజులకే ఆమె భర్త చనిపోవడం జరిగేయి. ఇలా ఎందుకు జరిగిందో పరిశీలించి తెలుసుకున్న ఆ తండ్రి, తన కుమార్తె కాలక్షేపం కోసం ఈ పుస్తకాన్ని రచించాడు. ఆ కుమార్తె పేరిట ఇది లీలావతి గణితంగా ప్రసిద్ధి పొందింది.” చెప్పడం ముగించి, కొడుకు వైపు చూసింది.

“అమ్మా ఇవన్నీ కూడా పుస్తకాలలో ఉంటాయా?” ఆసక్తిగా అడిగాడు.

“అవును అభీ, నువు కంప్యూటర్లో ఆడే ఆటలు, చూసే కామిక్స్ అన్ని ఈ పుస్తకాలలో ఉన్నాయి. నువ్వు తెలుగులో చదవలేకపోతే ఇంగ్లీష్ పుస్తకాలు కూడా ఉన్నాయి చూడు.” అంటూ ఇంగ్లీష్‌లో ఉన్న మహాభారతం బొమ్మలకథ పుస్తకం చూపించింది. తాను మొన్నటి వరకు చూసిన ఛోటాభీమ్ వంటి ఆకారం కనపడగానే ఆసక్తిగా అందుకున్నాడు. “నీకు తీరిక ఉన్నపుడు చదువు” అంటూ కృష్ణలీలలు కూడా ఇచ్చింది. “హే రోల్ నెంబర్ 21” అంటూ అందుకున్నాడు.

“మామ్ నేను మా ఫ్రెండ్స్‌తో షేర్ చేసుకుంటా” అంటూ తన గదిలోకి వెళ్ళాడు. కాసేపు గడిపి, అంతలోనే బయటకి వచ్చిన కొడుకుని చూసి, “అప్పుడే అయిపోయిందా ఫ్రెండ్స్‌తో ఛాటింగ్?” అని ప్రశ్నించింది సుభద్ర.

"లేదు మామ్, మా ఫ్రెండ్స్‌తో వీడియో కాల్ మాట్లాడుతూ ఈ పుస్తకం చూపించానా... నాకు చాలా త్వరగా చదవాలి అనిపించింది మామ్... అందుకే త్వరగా ఆఫ్ చేసేసా" అన్నాడు అభి సంబరంగా...

కొడుకులో వచ్చిన ఈ మార్పు తనకు ఆనందం కలిగించగా, సాయంత్రం ఇంటికి వచ్చిన భర్తతో పంచుకుంది సుభద్ర. పార్థు కూడా అభి చదవడం, కంప్యూటర్ వైపు చూడకపోవడంతో కొంచెం ఆశ్చర్యపడ్డాడు. సుభద్ర అంతటితో వదిలిపెట్టలేదు. అభిమన్యు ఏం చదివాడో అడిగి, తనకు తెలిసిన మరికొన్ని కథలు కూడా చెప్పేది. ఇంట్లో పెద్దవాళ్ళతో కలిసి చిన్నతనంలో రామాయణం, భారతం, భాగవతాలు ఆటవిడుపు కథల్లా విని, నేర్చుకోవాల్సిన కొడుకు ఈ కార్పొరేట్ చదువుల పుణ్యమా అని ఇప్పుడు నేర్చుకుంటున్నాడు. తన వెనకాలే తిరుగుతూ, చదువుతూ తనకు ఆ కథలు చెప్తున్న కొడుకుని తృప్తిగా చూసుకుంది. సమయం మించక మునుపే తాను మేలుకున్నందుకు సంతోషించింది.

★★★

బంధాలు దూరమవుతున్నందుకు చింతిస్తూ కూర్చోక, పరిష్కార మార్గాలు ఆలోచించుకోవాలి. పిల్లలైనా, పెద్దలైనా, వారికి ఇష్టమైన వ్యాపకం కల్పిస్తూనే, మనం కూడా వాళ్ళతో కాసేపు గడుపుతూ ఉంటేనే, కుటుంబంలో అందం, ఆనందం. సాంకేతికత కాలక్షేపానికి మించి కాలహరణం కాకూడదు.

"మామ్ ఈ బుక్ సో ఇంట్రస్టింగ్... ఇది కంప్లీట్ చేశాక ఇంకోటి ఇస్తావా... ఏక్చువల్లీ గూగుల్‌లో ఇన్ఫర్మేషన్ కంటే ఈ బుక్‌లోనే బావుందమ్మా" అంటున్న అభి వైపు సాభిప్రాయంగా చూసింది.

"అవును నాన్నా... ఈ పుస్తకాలలోని విషయాలే గూగుల్‌లో పెడతారు. అంతా పెట్టలేరు కదా అందుకే కొంచెమే ఉంటుంది. ఎనీవే నీకు బోర్ తగ్గిందిగా"

"సో స్వీట్ ఆఫ్ యు మామ్, థాంక్యూ ఫర్ యువర్ బుక్" అన్నాడు కార్పొరేట్ అభి.

తాళంచెవి లేని తాళం, పరిష్కారం లేని సమస్య ఉండవు అనుకుంటూ తన పనిలో పడింది సుభద్ర.

# నేటి మహిళ

పాలెపు బుచ్చిరాజు
✆ 9825033946

***"సంధ్యా! తప్పనిసరి పరిస్థితుల్లో నేను మా బాస్ కూతుర్ని పెళ్లి చేసుకోవలసి వచ్చింది. జీవితంలో ఎవరూ ఎదగని ఎత్తులకి ఎదగాలని నా చిరకాల వాంఛ. నా ఆశయం ఈ పెళ్లి ద్వారా తీరుతుందని నా విశ్వాసం. వాళ్ళు మొత్తం కంపెనీని నాకు అప్పగిస్తున్నారు. కాదన లేకపోయాను. నిన్ను మోసం చేయడం నా ఉద్దేశం కాదు. కాని పరిస్థితులు నన్ను బంధించి వేశాయి. నువ్వు కూడా నాలాగే జీవితంలో చాలా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను!"***

బి.ఎస్సీ. కంప్యుటర్ సైన్సు పరీక్షా ఫలితాలు వచ్చాయి. సంధ్య, ప్రదీప్ మంచి మార్కులతో పాసయ్యారు. ఆనందంగా వెళ్లి కేంటీన్‌లో కూర్చుని కాఫీ తాగుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు. ప్రదీప్ తెలివైనవాడు. చక్కగా మాట్లాడగలడు. చలాకీగా ఉంటాడు. తన మాటలతో ఎటువంటి వారినైనా ఇట్టే ఆకట్టుకోగలడు. సంధ్య కాలేజిలో చేరినప్పటి నుంచే అతని ఆకర్షణలో పడింది. స్నేహం కలిసింది. అనతికాలంలోనే అది ప్రేమగా మారింది. చేతులు కలుపుకుని ఒకరికొకరు చెప్పుకున్నారు, ''పెళ్ళంటూ చేసుకుంటే, నిన్నే చేసుకుంటాను' అని!

"ఏం చేయాలనుకుంటున్నావు?" అడిగింది సంధ్య.

"ఇంకా చదవాలనుకుంటున్నాను. ఇండియాలో కాదు. యు.ఎస్.లో... ఇప్పటికే చాలా కాలేజీలకి అప్లై చేశాను. యు.ఎస్.లో ఎం.ఎస్. చేసి పెద్ద కంపెనీలో జాబ్ చేయాలనేది నా జీవితాశయం. అందుకోసం ఎంతటి త్యాగమైనా చేయగలను. న్యూయార్కు, టెక్సాస్‌నుంచి ఆఫర్సు వచ్చాయి. టెక్సాస్‌లోనే చదవాలని అనుకుంటున్నాను. అక్కడ ఫీజు కూడా తక్కువ. ఈ సెప్టెంబరులోనే సెమెస్టర్ ప్రారంభం. కాలేజీ ఫీజు సంగతి ఫరవాలేదు. బేంకు వాళ్ళు ప్రామిస్ చేశారు. పై ఖర్చుల మాటే ఆలోచిస్తున్నాను. ఎలాగో ఒక సంవత్సరం కష్టపడితే, చిన్న చిన్న జాబ్స్ చేస్తూ, అదనంగా సంపాదించుకుని రెండేళ్ళు గడిపేయవచ్చు! మావాళ్ళ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. వాళ్ళ దగ్గర్నుంచి నేను ఆశించేది సున్నా!"

"మరి మన పెళ్లి సంగతి?"

"రెండేళ్ళు ఆగక తప్పదు. ఆ తరవాత వద్దంటే డబ్బు. నిన్ను డాలర్లలో ముంచెత్తుతాను."

అది విన్న సంధ్య మనసులో బోయింగు విమానాలు పరుగులు తీశాయి. అమెరికా, న్యూయార్కు, నయాగరా, కాసినోలు తనని గిలిగింతలు పెట్టాయి. ప్రదీప్ తనకి పరిచయం కావడంలోని దైవరహస్యం ఇదేనని నమ్మింది.

"ఏమిటి? ఆలోచనలో పడ్డావు? నీ సంగతి ఏమిటి?"

"అమెరికాలో సెటిలవ్వాలని ఎవరికుండదు? నా కలలు కూడా అవే! కాని నా పరిస్థితి వేరు. మా అమ్మానాన్నలు డబ్బు మనుషులు. సంపాదన మీద మమకారమే గాని, ఖర్చులో మాత్రం పిసినార్లు! నేను అమెరికా ప్రపోజల్ పెట్టినా నెగ్గి చావదు. ఎందుకంటే నాకొక చెల్లెలు, తమ్ముడు ఉన్నారు. ఇంకా వాళ్ళ చదువులు, పెళ్ళిళ్ళు ఉన్నాయి. ఇవన్నీ మనసులో పెట్టుకుని, నాకు వెంటనే పెళ్లి చేసేద్దామని అనుకుంటున్నారు. మన ప్రేమ వ్యవహారం ఇంకా వాళ్లకి చెప్పలేదు."

"బాగానే ఉంది. నేను ఆర్థికంగా కొంత సహాయం నువ్వు చేస్తావని అనుకుంటున్నాను. మీరు బాగా డబ్బున్నవాళ్ళు, ముందుగా నాకు కొంత ధన సహాయం చేస్తే, నా యు. ఎస్. కలలు నిజమౌతాయని ఆశ!"

"మన ప్రేమ విషయం చెప్పి వాళ్ళని డబ్బడిగితే, అప్పుగా కూడా మనకు పైసా రాదు. పైగా ఈ సమ్మర్‌లోనే నా పెళ్లి చేసేయాలని చూస్తున్నారు. ఏం సాకు చెప్పి తప్పించుకోవాలో పాలుపోవడం లేదు."

"సరే! ఆలోచిద్దాం. ఎలా చేస్తారో! నువ్వు మాత్రం నా అమెరికా ఖర్చులో సింహభాగం సర్దవలసి ఉంటుంది. నా స్నేహితులందరినీ అడిగినా అయిదారు లక్షల కంటే ఎక్కువ సొమ్ము రాలదు. ఇంకా కనీసం పాతిక లక్షలైనా అవసరం ఉంటుంది. ఇదెలా సమకూర్చాలన్నది సమస్య! పరిష్కార మార్గం నేను ఆలోచిస్తాను. నువ్వు కూడా అదే ప్రయత్నంలో ఉండు. మళ్ళీ కలుద్దాం."



వారం తరవాత సంధ్యకి ఈమెయిల్లో మెసేజ్ వచ్చింది. "మనం అర్జంటుగా 'లుంబిని'లో కలుసుకోవాలి. రేపు సాయంత్రం ఆరు గంటలకి అక్కడుంటాను. తప్పకుండా రా!" అని.

మెయిల్‌లో కన్ఫర్మ్ చేసి అనుకున్న టైముకి లుంబిని చేరింది సంధ్య. అమెరికా వెళ్ళడానికయ్యే ఖర్చులో చాలా భారం తనపై పెట్టాడు ప్రదీప్. ఎంత ఆలోచించినా అంత డబ్బు సమకూర్చడం అసాధ్యమైన పనిగా అనిపించింది సంధ్యకి. 'డబ్బు గురించి ఏం చేశావు?' అని అడుగుతాడు. ఏం చెప్పాలో అంతు పట్టడంలేదు. మొహం వ్రేలాడేసుకుని వెళ్ళింది సంధ్య. అప్పటికే ప్రదీప్ అక్కడున్నాడు. హై స్పిరిట్స్‌లో ఉన్నాడు. హుషారుగా పలకరించాడు. ఇద్దరూ పచ్చిక తివాసి మీద కూర్చున్నారు.

ప్రదీప్ ముందుగా మాట్లాడాడు. "సంధ్యా! ప్రేమికులు కలిసి ఉండడానికి ఎంతటి త్యాగమైనా చేయడానికి సిద్ధంగా ఉంటారు. అవునా?" అని అడిగాడు.

"అవును. చరిత్ర దానికి తార్కాణం. ఇందులో కొత్త ఏముంది?"

"అంతే కాదు. భగవంతుడు కూడా విధాయకంగా ప్రేమికులకి అలాంటి పరీక్షలు పెట్టి తీరుతాడు! ఆ అవరోధాలు అధిగమించి, బైట పడినవారు తమ భావి జీవితాన్ని ఆనందమయంగా గడపగలుగుతారు. సాధారణంగా ఈ సమరంలో మనకి అడ్డుపడేవారు బంధువులు! కాని అదృష్టవశాత్తు మనకి ఆ ఆటంకం లేదు. కాని డబ్బు లోటు విలన్ అయి కూచుంది... అంటే నువ్వు ఒప్పుకుంటావా?"

"ఇది అక్షర సత్యం ప్రదీప్. నువ్వు ఇంతగా చెప్పాలా!"

"అక్కడికే వస్తున్నా. నేను చాలా దూరం ఆలోచించి, ఒక నిర్ణయానికి వచ్చాను. నువ్వు నాతో సహకరిస్తే, మనకి కావలసిన డబ్బు లభ్యమయ్యే అవకాశం ఉంది. మన కలలు నిజమౌతాయి. "

"సహకరిస్తే ఏమిటి? సహకరించక తప్పదు. అని ఆజ్ఞాపించు. అదెంత కష్టమైనా సాధించి తీరుతాను."

"అలా అని నువ్వు మాట ఇస్తే, పూర్తి వివరాలు చెప్తాను."

ఆ సమయంలో సంధ్య మనసులో... ప్రదీప్ వ్యక్తిత్వం, జీవితంలో ఎదగాలనే ఆకాంక్ష. అమెరికా వెళ్తే గాని, అది సాధ్యం కాదన్న దృఢనిశ్చయం ఆవరించి మైకం కమ్మించేశాయి. మారుమాటాడకుండా ఒట్టు పెట్టింది. అప్పుడు ప్రదీప్ తన ప్లాను సవివరంగా చెప్పాడు. ఆ సమయంలో ప్రదీప్ ఏం చెప్పినా కాదనే స్థితిలో లేదు సంధ్య. తన భావి జీవితానికి బంగారు బాట వేసుకునే ప్రయత్నంలో మంచి, చెడు, ధర్మం, అధర్మం అనే ఆలోచనలకి తావులేదు. ప్రదీప్ తనని అందలం ఎక్కించబోతున్నాడు. అందుకు తగినంత దోహదం చేయడమే తన కర్తవ్యం! ఆతను చెప్పిన దానికి క్షణం ఆలోచించకుండా సరే చెప్పింది. అక్కడినుంచి వెళ్ళిన మరుక్షణమే ప్రదీప్ తన అమెరికా ప్రయాణానికి ముందస్తు పేపర్ వర్కు చేయడం ప్రారంభించాడు.

★★★

సంధ్య తలిదండ్రులు ఆమెను 'తరవాత ఏం చేస్తావు?' అని అడగలేదు. అడిగే ఉద్దేశం కూడా లేదు. మంచి కుటుంబంలో, బాగా చదువుకుని, ఉద్యోగం చేసే వరుడి కోసం అన్వేషణ మొదలు పెట్టారు. సంధ్య ఒకటి రెండు సార్లు 'ఇప్పుడే పెళ్లి వద్దని,

ఇంకా చదువుకుంటానని నస పెట్టింది. కాని అమ్మా, నాన్నా అది సాగనివ్వలేదు. ఇంకా ఇద్దరు పిల్లల చదువులు, పెళ్ళిళ్ళు ఉన్నాయి. ఇంత ఖర్చు పెట్టడం కుదరదని చెప్పేశారు.

సంబంధాలు వస్తున్నాయి. పెళ్లి చూపులు జరుగుతున్నాయి. అక్కడే చెప్పేసే వాళ్ళు, వెళ్లి ఉత్తరం రాస్తామనే వాళ్లు చాలామంది! ఆఖరికి ఒక సంబంధం దగ్గర పడింది. మర్యాదస్తులు, సంప్రదాయమైన కుటుంబం. ఒక్కడే కొడుకు. ఎం.బి.ఏ. చేసి, బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. హైదరాబాదులోనే ఇల్లు కూడా ఉంది. అయినా కొడుకు ఉద్యోగరీత్యా, ప్రస్తుతం బెంగుళూరులోనే ఉంటున్నారు. ముఖ్యంగా అబ్బాయి ఇష్టపడ్డాడు. ఇరు పక్షాలవారికి అన్నీ నచ్చి, కట్న కానుకలు, లాంఛనాల వరకు వచ్చాయి మాటలు.

“కట్నం అంటూ మాకేమీ అక్కరలేదు. మీ సంతోషం కోసం అమ్మాయికి మీరే ఎంతైనా ఇవ్వండి. పెళ్లిమాత్రం ఘనంగా చేయాలి. హైదరాబాదులో మావాళ్ళు చాలా మంది ఉన్నారు. లోటుబాట్లు లేకుండా చూడాలి. మా తరపు నుంచి కోడలుకి పది తులాల బంగారం పెడతాము!” అన్నారు పెళ్ళివారు.

సంధ్య తలిదండ్రులు చాలా సంతోషించారు... తమకి నచ్చిన సంబంధం వచ్చినందుకు! సంధ్యకి నచ్చిందా లేదా అన్నది వారికి అనవసరం. తక్కువేంటి? అబ్బాయి ఎం.బి.ఏ. చదివాడు. మంచి ఉద్యోగంలో ఉన్నాడు. బుద్ధిమంతుడు. ఇంతకంటే మంచి మేచ్ ఎక్కడ దొరుకుతుంది? వివాహం నిశ్చయం అయింది. మగ పెళ్లివారితో సమానంగా తామూ పది తులాల బంగారం పిల్లకి ఇస్తామని చెప్పారు. పైగా కట్నం కూడా మరొక అయిదు లక్షలు ఇచ్చారు. నెల తిరక్కుండా పెళ్లి ఘనంగా జరిగింది. మనం ఎలా చేద్దామనుకున్నా కళ్యాణ మండపాల వాళ్ళు, కేటరింగు వాళ్ళు మన చేత పెళ్లి ఘనంగానే చేయిస్తున్నారు ఈ రోజుల్లో.

సంధ్య బెంగుళూరు కాపురానికి వెళ్ళింది. అమ్మా నాన్నా ఊపిరి పీల్చుకున్నారు. ‘గుండెల మీది కుంపటి మరో గూటికి చేరింది కదా’ అని!

కొత్తలో తల్లిదండ్రుల నుంచి ఫోను తరుచూ వస్తూ ఉండేది. సంధ్య పడగ్గదిలోకి వెళ్లి గంటల కొద్దీ మాట్లాడేది. అత్తగారు, మామగారు, చక్కని కుందనపు బొమ్మలాంటి కోడల్ని తెచ్చుకున్నాం కదా అని గుండెల మీద చేయి వేసుకుని నిద్రపోయారు. అలవాటు అయ్యే వరకు వంటా వార్పూ అత్తగారు చేసేది. ఆవిడకు... కొడుకు మాత్రం అంత సంతృప్తిగా ఉన్నట్టు అనిపించడంలేదు. ఆడవాళ్ళు ఇలాంటి విషయాలు ఇట్టే పసికట్టేస్తారు. రోజూ ఆఫీసుకు వెళ్లి వస్తున్నాడు. అబ్బాయి భార్య గురించి అంతగా పట్టించుకున్నట్టులేదు. పగలంతా కోడలు పడగ్గదిలోనే లాప్‌టాప్ పెట్టుకుని కూచుంటుంది. పోనీ అదేమైనా ‘వర్క్ ఫ్రం హోమ్’ అంటే అదీ కాదు. మరీ అన్ని గంటలు.. ఆ డబ్బా ముందు కూచుని ఏం చేస్తుందో భగవంతుడికే తెలియాలి. ఏనాడూ ఇద్దరూ సరదాగా బైటికి షికారుకని, సినిమాకని వెళ్ళిన పాపాన పోలేదు. పది రోజులయింది, పదిహేను రోజులయింది. పరిస్థితిలో ఏమీ మార్పు లేదు. ఇన్నాళ్ళు కొత్త గదా అని ప్రొద్దుటే కాఫీ తానే కలిపి పడగ్గదిలో ఇచ్చి వచ్చేది తల్లి. ఆ కప్పులు మళ్ళీ పనిమనిషి తీసుకొస్తేనే వచ్చేవి.

వంటగదికి వచ్చి ఒకనాడు కూడా “అత్తయ్యా!” అని పలకరించ లేదు. భర్తకు ఇవేమీ పట్టవు. కాని ఆమెను మాత్రం అనుమాన పిశాచం పట్టుకు పీడించసాగింది. ఇక ఉండబట్టలేక ఒకనాడు కొడుకుని ఏకాంతంలో నిలదీసి అడిగింది. “ఏరా! అంతా సవ్యంగానే ఉందా?” అని. వాడు మొహం చాటేసుకుని ఏమీ చెప్పకుండా తప్పించుకున్నాడు. తల్లి

అనుమానం మరింత బలపడింది. వదిలిపెట్టకుండా "పెళ్ళాం చేతి కాఫీ ఎప్పుడు తాగుతావురా?" అని అడిగింది ఒక రోజున.

"కాఫీనా? అసలు దగ్గరకే చేరకపోతే... ఎవరి పడకలు వారివే! మొదట్లో సిగ్గు అనుకున్నాను. తరవాత భయమో ఏమో అనుకున్నాను. ఇప్పుడు అసలు పెళ్లి ఎందుకు చేసుకున్నానా అని బాధ పడుతున్నాను" అన్నాడు.

పగలు రాత్రి లాప్‌టాప్ ముందు కూర్చుని ఉంటుంది. ఏమి అడిగినా ముభావంగానే సమాధానం ఇస్తుంది. కొడుకు కంఠంలో విచారం వ్యక్తం అయింది. ఇలాంటి విషయాలు తల్లితో తప్ప మరెవరితో చెప్పుకోగలడు? అది విని తల్లి విస్తుపోయింది.

మర్నాడు భర్తని కూర్చోబెట్టి సమస్య చెప్పింది. తాము ఎక్కడ పొరబడ్డామా... అని చాలా ఆలోచించారు. ఏమీ అంతు పట్టలేదు. ఏ సందర్భంలోనూ అనుమానం కూడా రాలేదు. పోనీ వియ్యాలవారిని అడిగితే? మర్యాదగా ఉండదేమో! నెల తిరక్కుండా ఒకనాడు అత్తగారు సంధ్యని వంటగదిలోకి పిలిచి, కాఫీ తీసికెళ్ళి కొడుక్కి ఇవ్వమని చెప్పింది. వాడు ఆఫీసుకి వెళ్లినప్పుడు గుమ్మంలో నిబడి టాటా చెప్పమంది. సంధ్య ఏమీ జవాబు చెప్పకుండా చెప్పినట్టు చేసి, పోయి లాప్‌టాప్ ముందు కూర్చుంది. ఈ రహస్యం ఎలా ఛేదించాలా అని మధన పడసాగింది అత్తగారు.

ఇంతకీ సంధ్య లాప్టాప్లో చేస్తున్నది గూగులింగ్ ఏమీ కాదు. ఫోనులో ఛాటింగ్ చేస్తే దొరికిపోతాననే భయంతో, సైలెంట్‌గా లాప్టాప్లో వరుస మెయిల్స్‌లో ప్రదీప్‌తో ముచ్చట్లు!

"మెయిల్స్ ఆలస్యంగా పెడుతున్నావు. కొత్త మొగుడు వదిలి పెట్టడం లేదా?"

"ఛీ! అదేం కాదు. ఇక్కడ నెట్ వర్క్ సమస్యలున్నాయి. ఇలా మాట్లాడి నువ్వు నన్ను అనుమానిస్తున్నావా? అవమానిస్తున్నావా? ఇది మన ప్రేమకే అవమానం. నిన్ను తప్ప మరెవరినైనా దగ్గరకు చేరనిస్తానా?"

"సరదాకి అన్నాను. మరీ అంత సీరియస్‌గా తీసుకోకు. నీ గురించి నాకు తెలియదా ప్రియతమా!"

"అబ్బో! అబ్బాయిగారికి కవిత్వం కూడా వచ్చా?"

"నువ్వు లేని నేను 'సారో సాంగ్స్' పాడుకునేది. ఇంతకీ మన ప్లాను ఎంత వరకు వచ్చింది? నా అమెరికా ప్రయాణానికి ఆర్థికంగా తప్ప మిగిలిన అన్ని సన్నాహాలు పూర్తి అయ్యాయి. విటమిన్ 'ఎమ్' లేకపోతే ఇక బండి ముందుకు సాగదు. నిన్నే నమ్ముకున్నాను. నీట ముంచినా పాల ముంచినా నీదే భారం!"

"నీటిలోను... పాలలోను మునగడం ఎందుకు? గగనయానం, అమృతపానం మన జాతకాల్లో రాసిపెట్టి ఉన్నాయి త్వరలోనే మంచి కబురు వింటావు."

"ఏమో! నీ దయ!"

★★★

సంధ్య ఉన్నట్టుండి ఒకనాడు ప్రొద్దుటే ఏడుస్తూ హాల్లోకి వచ్చింది. ఏమయిందని ఇంటిల్లిపాది కంగారు పడ్డారు. "ఏమి జరిగిందమ్మా?" అని అత్తగారు అడిగింది.

"హైదరాబాదులో మా తమ్ముడికి ఏక్సిడెంటు అయిందట. హాస్పిటల్‌లో ఉన్నాడు. వెంటనే వెళ్ళాలి." అంది ఏడుపు ఆపకుండానే.

అత్తగారు కంగారుపడి, కొడుకుని పిలిచి వెంటనే పది గంటల ఫ్లైట్‌కి టికెట్ తీసి, ఏర్‌పోర్ట్‌లో దింపి రమ్మని చెప్పింది. సంధ్య తన సామాను సర్దుకుని బయల్దేరింది. ఆ సామాను కాపురానికి వచ్చినప్పటి కంటే డబల్ ఉంది. సంధ్య మధ్యాహ్నం భోజనం హైదరాబాదులో వాళ్లింటిలోనే చేసింది.

అనుకోకుండా ఊడిపడిన కూతుర్ని చూసి కంగారు పడ్డారు అమ్మా నాన్నా. కొంత సద్దు మణిగాక అమ్మ అడిగింది "ఏమిటే! కబురు కాకరకాయ లేకుండా వచ్చేశావు? అంతా కుశలమేనా?"

సంధ్య ఏమీ చెప్పకుండా తల్లి భుజాల మీద పడి ఏడ్వసాగింది. తల్లి గుండెల్లో రాయి పడింది. కీడు శంకించడమే కాదు నిర్ధారణ కూడా చేసుకుంది. "అమ్మా! వాళ్ళసలు మంచివాళ్ళు కారే! అక్కడున్న నాలుగు రోజులూ నిప్పుల మీద ఉన్నట్టుంది నాకు. నిత్యమూ నరకం అనుభవించాను. ఇక ఉండ లేక తమ్ముడికి ఏక్సిడెంటు అయిందని అబద్ధం చెప్పి పెట్టె బేడా సర్దుకుని అర్జంటుగా వచ్చేశాను. ఇక వెళ్ళను. మీరు బలవంత పెడితే, నుయ్యో, గొయ్యో చూసుకుంటాను." అని ఏకరువు పెట్టింది.

తల్లి కూతుర్ని ఓదార్చి, లబో దొబోమంటూ భర్తకి విషయం చెప్పింది. ఇద్దరూ ఆలోచనలో పడ్డారు. పెళ్ళికి ముందు వెనకా ముందూ అన్నీ తెలుసుకుని మరీ, మంచివాళ్ళని తెలిశాక చేశారు. ఇలా ఎందుకు జరిగిందో వారికి అంతు పట్టలేదు. పెళ్ళిలో కూడా అందరూ కలిసి కట్టుగా ఉండి చిన్న చిన్న లోటుపాట్లు ఉన్నా సర్దుకుపోయారు. వచ్చిన చుట్టాలంతా వజ్రం లాంటి పెళ్ళికొడుకుని కొట్టేశావని అభినందించారు. ఇప్పుడీ పిల్ల చెప్పే కథనం దానికి భిన్నంగా ఉంది. ఏం చేయాలో తెలియక తికమక పడుతున్నారు.

ఇక్కడ నాలుగైదు రోజులు పోయాక కొడుకుని కదిపింది తల్లి. "ఏరా! కోడలు ఫోను చేసిందా? అంతా బాగానే ఉందా?" అని.

"తన దగ్గర్నుంచి ఫోను లేదు సరికదా, నేను కాల్ చేస్తే కూడా స్విచ్ ఆఫ్ వస్తోంది." అని ఆఫీసుకు వెళ్ళిపోయాడు కొడుకు.

ఉండబట్టలేక భర్తకి చెప్పింది వియ్యంకుడికి లేండ్‌లైనులో కాల్ చేయమని!

ఆమె అడిగితే ఆయన మాట్లాడకుండా ఉండలేడు. "బావగారూ! తమ్ముడికి ప్రమాదం జరిగిందని సంధ్య హైదరాబాదు వచ్చింది. అబ్బాయి ఇప్పుడెలా ఉన్నాడు? సంధ్య ఎప్పుడు వస్తోంది?"

"అవునండీ! ఇప్పుడు కాస్త బాగానే ఉంది. సంధ్య... వచ్చేస్తుంది. వస్తుంది త్వరలో..." అని పొడిపొడిగా మాట్లాడి ఫోను పెట్టేశాడాయన.

వారం రోజుల తర్వాత వచ్చింది కోడలు కాదు... రిజిస్టర్డ్ పోస్ట్! కోడలు పంపిన లాయరు నోటీసు! అందుకున్న భార్యాభర్తలు అది చదువుకుని, నిలువునా కూలిపోయారు.

"నా క్లయింటు సంధ్య వివాహమై బెంగుళూరులో మీ యింటికి వచ్చినప్పటి నుంచి ఆమెను, మీరూ మీ అబ్బాయీ చిత్రహింసలు పెడుతున్నారని, మీరు కట్నం మరొక అయిదు లక్షలు కావాలంటున్నారని, ఆతను తాగి వచ్చి, భార్యను

నిరంతరం మానసికంగాను, శారీకంగాను వేధిస్తున్నాడని... మీ అందరి మీద అభియోగం తెచ్చింది. భారత రాజ్యంగ చట్టం, సెక్షను 498A ప్రకారం, ఇది గృహహింస నేరం క్రింద వస్తుంది. న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే, ముందుగా ఏ విధమైన విచారణ లేకుండా మీకు జైలు శిక్ష విధించబడుతుంది. ఈ నోటీసు అందిన పది రోజుల లోపున మీరు నా ఆఫీసుకి వచ్చి నా క్లయింటుతో రాజీకి ఒప్పందం కుదుర్చుకుంటే సరే... లేకపోతే న్యాయ పోరాటం చేయడం ఖాయం."

ఇట్లు

క్లయింటు తరఫు న్యాయవాది.

ఇదీ సారాంశం.

నిండిన పాలకుండలాంటి స్వచ్ఛమైన సంసారంలో, ఒక చిన్న విషపుచుక్క పడి, కుటుంబంలో అశాంతిని నింపింది. తల్లికి తాము ఎక్కడ పొరబడ్డామో అంతుపట్టలేదు. అనుమానంతో వెళ్లి బీరువా తలుపు తీసిచూసింది. ఏముంది? అంతా ఖాళీ! పది పదిహేను తులాల బంగారం, కొంతవరకు నగదు అంతా మటుమాయం! కోడలు ఎంత గుండెలు తీసిన బంటో అర్థం చేసుకుంది అత్తగారు. ఏడుస్తూ పోయి భర్తతో మొరపెట్టుకుంది.

'రోలు పోయి మద్దెలతో చెప్పుకున్నట్టనిపించింది' ఆయనకి! గతం గురించి ఆయన ఆలోచించడంలేదు. ముందుదారి ఏమిటా అన్నది సమస్య. సాఫీగా సాగిపోతున్న జీవితంలో తగిలిన ఎదురుదెబ్బకి ఆయన కొంతవరకు చింతించిన మాట వాస్తవం. కాని కుమిలిపోలేదు. అనుభవం ఉన్నవాడు. తరరాలుగా వివక్షకి గురైన స్త్రీజాతిని ఉద్ధరించడానికి ప్రభుత్వం చేసిన చట్టాల్ని, కొందరు స్వార్థంతో ఎలా దురుపయోగం చేస్తున్నారో ప్రతినిత్యమూ పత్రికల్లో చదువుతున్నదే! లాయరు చెప్పిన చట్టం తాలూకు పర్యవసానం కూడా బాగా తెలిసినవాడాయన. నేటియువతీ యువకుల్లో అత్యాశలు, స్వతంత్రంగా జీవించగలమనే మొండి ధైర్యం వారిని ఎలా తప్పుదారి పట్టిస్తున్నాయో అర్థం చేసుకోగలడు. మానమర్యాదలు కాపాడుకోవాలంటే ప్రస్తుత సమస్యకి ఒకటే మార్గం. దానినే ఎన్నుకుని మర్నాడే హైదరాబాదుకి ప్రయాణం కట్టాడు.

లాయరుకి ఫోను చేసి వెళ్లి విషయం కనుక్కున్నాడు. లాయరు కథనం ప్రకారం, కట్నం రూపంలో వాళ్ళు ఇచ్చిన అయిదు లక్షలు కాక, అదనంగా మరొక పది లక్షలు క్యాష్ సంధ్యకు ఇస్తే, సమస్య పరిష్కారం అవుతుంది. ఆయన ఏమాత్రం వెనుకాడకుండా వారం తిరక్కుండా డబ్బు సంధ్య పేరున బ్యాంకులో వేయడానికి ఒప్పుకున్నాడు. లాయరు ద్వారా వివరాలు సేకరించాడు. అంతే కాదు. మాట నిలబెట్టుకున్నాడు.

సంధ్య తలిదండ్రులకి నెమ్మదిగా అసలు విషయం తెలిసింది. తల్లి, డబ్బుకోసం ఆశపడి కూతురు చాలా పెద్ద తప్పు చేసిందని బాధ పడింది. ఇంక దీనిని ఎవడు పెళ్లి చేసుకుంటాడని ఆరాట పడసాగింది. తండ్రి ఆలోచనలు మరోలా ఉన్నాయి. డబ్బు ఆశ కాదు. అవసరం! అది ఎలా వచ్చింది అన్నది ముఖ్యం కాదు. పెళ్లి విషయమా? అదే చెప్పిందిగా' ప్రేమించినవాడు పెళ్లి చేసుకుని అమెరికా తీసుకు వెళ్తాడని'... భయమేముంది?

డబ్బు సమయానికి అందడంతో ప్రదీప్‌కి మార్గం సుగమం అయింది. సెప్టెంబరు సెషన్‌లో జాయినవడానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఆగష్టు 15, స్వాతంత్ర్య దినోత్సవంనాడు హైదరాబాదు శంషాబాద్ ఏర్‌పోర్ట్ నుంచి ఎయిర్ ఇండియా బోయింగులో బుక్ చేసుకున్నాడు. సెండాఫ్‌కి సంధ్య వెళ్ళింది. రెండు చేతులు పట్టుకుని ఆప్యాయంగా పలకరించాడు. "నీ మేలు మరిచిపోను. త్వరలోనే అమెరికాలో కలుసుకుందాం." అన్నాడు.

సంధ్యకి గుండె గొంతుకలోకి వచ్చింది. ఒక్కసారిగా ఉక్కిరిబిక్కిరి అయింది. పరస్పర విరుద్ధభావాలు ముప్పిరిగొని బుర్ర తిరగసాగింది. ఆతను చేయి ఊపుతూ ముందుకు సాగిపోతున్నాడు. ఆమె అక్కడే ఉండిపోయి అంతా చూస్తోంది. కాని ఏమీ కనిపించడం లేదు. అంతరాత్మ ఘోషిస్తోంది. 'తప్పు చేస్తున్నావేమో! తెలుసుకో' అని హెచ్చరించబోయింది. కాని వక్రబుద్ధి, దాని నోరు నొక్కేసింది. 'నువ్వెప్పుడూ ఇంతే. బాగుపడుతుంటే చూడలేవు.' అని నిందించింది. క్షణకాలం అంతా శూన్యం. సంధ్య టాక్సీ ఎప్పుడు ఎక్కిందో! బరువైన హృదయంతో ఇల్లు చేరుకుంది.

★★★

ప్రదీప్ విమానం దిగిన వెంటనే వాట్సప్ చేశాడు ప్రయాణం బాగా జరిగింది అని! రిసీవ్ చేసుకోవడానికి సీనియర్ ఫ్రెండు వచ్చాడని, ఇల్లు చూసుకునే వరకు అతనితోనే ఉంటానని చెప్పాడు. అంతరాంతరాల్లో సంధ్యకి ఒక ప్రక్క బెరుకుగా ఉన్నా పైకి మాత్రం గంభీరంగానే ఉంది. భౌతికంగా దూరం అన్న మాటేగాని వాట్సప్, మెయిల్, స్కైప్ లాంటివి నేడు మనుషుల మధ్య దూరాన్ని మాయం చేశాయి. ఆగష్టు నెల అంతా ఇల్లు వెదుక్కోవడం, కాలేజిలో విషయాలు అవగాహన కోసం బిజీగా ఉన్నాడు ప్రదీప్. అయినా రోజూ గంటసేపు అయినా సంధ్యతో ఛాటింగ్ అవుతూనే ఉంది. ఆ కారణంగా సంధ్యకి రాత్రి పూట నిద్ర ఉండటం లేదు. పగలంతా తన గదిలోనే నిద్రలో ఉంటుంది. రోజులు సాగిపోతున్నాయి.

తన విషయంలో అమ్మకి, నాన్నకి అభిప్రాయ భేదాలు వచ్చాయి. నిత్యమూ ఇంటిలో తగాదాలు. కీచులాటలు. నాన్న అయితే, ప్రదీప్ తిరిగి వచ్చి సంధ్యని పెళ్లి చేసుకుని అమెరికా తీసుకుని వెళ్తాడని గట్టి నమ్మకంతో ఉన్నాడు. ఎందుకంటే డబ్బు విషయంలో సంధ్య చేసిన త్యాగం మరువలేనిది.

అమ్మ అలా కాదు. ఎప్పటి మాట! రెండేళ్ళు ఓపికతో వాడి రాక కోసం పడిగాపులు కాయాలి. ఈ లోగా ఎన్ని మార్పులు వస్తాయో! అసలు తిరిగి వస్తాడా? పెళ్లి చేసుకుని తనతో తీసుకు వెళ్తాడా? వెళ్ళాక వదిలేస్తే? దీని గతి ఏం కాను? ఎన్నెన్ని కథలు వినడం లేదు. ఇలా ఆశలతో మగ్గడం కంటే మరో సంబంధం చూసి పెళ్లి చేయడం మంచిది... అనే ఆలోచనలతో ఉంది.

సంధ్య ఇంట్లో మామూలుగానే తిరుగుతోంది. తన గదిలోనే కాలక్షేపం చేస్తూ ప్రదీప్ ఫోను కోసం ఎదురుచూడడం నిత్య కార్యక్రమం. గంటలకొద్దీ అతనితో మాట్లాడడం. ఎప్పుడో కాని గదిదాటి బైటికి రాదు. వచ్చినా వీధి గుమ్మం దాటి బైటికి పోయిన దాఖలాలు లేవు. ప్రదీప్‌కి క్లాసులు ప్రారంభం అయ్యాక ఎక్కువ సమయం దొరకడం లేదు. అదీగాక టైము వ్యత్యాసం ఒకటి!

నెమ్మదిగా ఫోనులు ఆదివారానికి పరిమితం అయ్యాయి. సెలవుల్లో సైట్ సీయింగ్ అనీ, ఫ్రెండ్సుని కలవాలని వెళ్ళిపోతూ ఉంటాడు. ఇక్కడ సంధ్యకే ఏమీ తోచదు. అమ్మా, నాన్నా ఆట్టే వేధించకుండా తనమానాన తనని వదిలేశారు. చూస్తూండగానే మూడు సెమిస్టర్లు గడిచిపోయాయి. ప్రదీప్ నాలుగో సెమెస్టర్‌లో ప్రవేశించాడు. ఇంతవరకు తెచ్చుకున్న డబ్బు సరిపోయింది. ఇక పార్ట్ టైమ్ జాబ్ చేసి, తినడానికి ఉండడానికి సంపాదించుకుంటూ, ప్రాజక్టు వర్క్ పూర్తిచేయాలి. సంధ్యకి చాలా ఆతురతగా ఉంది. ఎంత వేగం అమెరికా వెళ్ళిపోదామా అని ఎదురు చూస్తోంది. ప్రదీప్‌కి ఇండియా వాళ్ళదే ఐ.టి. కంపెనీలో జాబ్ దొరికింది. చేస్తున్న పని బాగుందని వాళ్ళు కొంత జీతం కూడా ఇస్తున్నారు. కంపెనీ యజమాని కూతురు కూడా తనతోటే ఎమ్మెస్ చేసింది. ఆమె ద్వారానే ప్రదీప్ ఉద్యోగం దొరికింది. సమయం దొరికినప్పుడల్లా ప్రదీప్ సంధ్యకి ఫోను చేస్తూనే ఉన్నాడు.

ఆరునెలలు ఆగి, "ఎప్పుడు వస్తున్నావు? నాకింక ఎదురు చూసే ఓపిక లేదు." అని అడిగింది సంధ్య.

"ఇప్పుడే తిరిగి రావడానికి కుదరదు. వీసా సమస్యలు వస్తాయి. ఇక్కడికి తిరిగి రావడానికి పర్మిషన్ కావాలి. రూల్సు చాలా కాంప్లికేటేడ్‌గా ఉంటాయి. అన్నీ చూసుకుని వస్తాను. ఈ లోగా నేను గతంలో పని చేసిన కంపెనీ వాళ్ళే నాకు జాబ్ ఇచ్చారు. జాయిన్ అయ్యాను. వాళ్ళ అమ్మాయికి నేనంటే చాలా ఇష్టం. ఇద్దరం ఒకే ప్రోబ్లం మీద పని చేస్తున్నాం. ఇలా రాస్తున్నానని అసూయ పడకు. మా పరిచయం ఆఫీసు వరకే పరిమితం. వాళ్ళు కోటీశ్వరులు." అని చెప్పాడు.

అంతవరకు నిండు ధైర్యంగా ఉన్న సంధ్య మనసులో చిన్న అనుమాన బీజం పడింది. కాని ఒకప్రక్క ప్రదీప్ నమ్మకమైన మనిషి. తనకి అన్యాయం చేయడని నమ్మకం కూడా ఉంది. తను ఆశించినట్టుగా కాక, ఇంకా ఆలస్యం అవుతున్నందుకు కొంత నిరుత్సాహపడింది.

ఉన్నట్టుండి ఒకనాడు ప్రదీప్ నుంచి పెద్ద మెయిల్ వచ్చింది. సాంతం చదివి మూర్చపోయింది సంధ్య.

"సంధ్యా! తప్పనిసరి పరిస్థితుల్లో నేను మా బాస్ కూతుర్ని పెళ్లి చేసుకో వలసి వచ్చింది. జీవితంలో ఎవరూ ఎదగని ఎత్తులకి ఎదగాలని నా చిరకాల వాంఛ. నా ఆశయం ఈ పెళ్లి ద్వారా తీరుతుందని నా విశ్వాసం. వాళ్ళు మొత్తం కంపెనీని నాకు అప్పగిస్తున్నారు. కాదన లేకపోయాను. నిన్ను మోసం చేయడం నా ఉద్దేశం కాదు. కాని పరిస్థితులు నన్ను బంధించి వేశాయి. నువ్వు కూడా నాలాగే జీవితంలో చాలా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను!"

కొంత సేపటికి తనను తను తమాయించుకుంది. "భేష్! ప్రదీప్ నాకు బాగా బుద్ధి చెప్పావు. లోకంలో 'కుక్క కాటుకి చెప్పుదెబ్బ' అంటారు. కాని నువ్వు కొట్టింది చావుదెబ్బ." అని వాపోయింది. ఇంత మోసం చేస్తావా? అని కోపంతో ఊగిపోయింది. ప్రేమించినవాడి కోసం తను చేయరాని తప్పు కూడా చేయడానికి సాహిసించింది. ఆమెలో ప్రతీకారజ్వాల రగులుకుంది. జీవితంలో మోసపోయినప్పుడు, ఒకప్పటి 'ఆడది' అయితే భగవంతుడు నా నొసట ఇంతే రాశాడు అని ఏడుస్తూ కూర్చునేది. కాని సంధ్య 'నేటి మహిళ'. సమాజంలో తన హక్కులని కాపాడుకోవడానికి పోరాటం చేయగల దిట్ట. ఆలోచించి, ఒక నిర్ణయానికి వచ్చింది. వెంటనే అమలు పరచడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. తను కూడా అమెరికా వెళ్ళాలి. అక్కడ ప్రదీప్ జీవితంలో అల్లకల్లోలం సృష్టించాలి. వాడి చేత్తో వాడి కంటినే పొడిచి గుడ్డివాడిని చేయాలి. అంతవరకు తనకోపం చల్లారదు.

# మరుభూమిలో మారణహోమం

స్వరలాసిక

✆ 9701371256

***"నేను... నిన్ను నా తమ్ముడిలా భావించాను" సంజయ్ క్షణక్షణానికీ శరీరం చల్లగా మారడంతో గొంతు పిండేసుకుని చెప్పగలిగాడు.***
***మగ్బుల్ కళ్ళలో పశ్చాత్తాపపు ఛాయలు కనిపించాయి. "నాకు వేరే మార్గం లేదు" హీన స్వరంతో గొణిగాడు. "వారి వద్ద నా కుటుంబం బందీగా ఉంది. నేను ఇలా చేయకపోతే... వారు నావాళ్లను చంపేస్తారు."***
***సంజయ్ గుండె దడదడలాడింది. ఇప్పుడు అతడికి అర్థమైంది. మగ్బుల్ ఉచ్చులో చిక్కుకున్నాడు. కానీ మగ్బుల్ ద్రోహాన్ని భరించడం సులభం కాదు.***
***సంజయ్ చుట్టూ ఉన్న ప్రపంచం మసకబారింది. అతడి దృష్టి అంచులు క్రమంగా నల్లగా మారాయి.***

సుదూరంగా వినిపిస్తున్న తుపాకీ పేలుళ్ల శబ్దం ధూళిమయమైన కొండల మధ్య ప్రతిధ్వనిస్తూ దిగంతాలకవతల చెలరేగిన యుద్ధాన్ని నిరంతరం గుర్తుచేస్తోంది. సార్జెంట్ సంజయ్ సింగ్ తన చేతిలో రైఫిల్ బారెల్‌ను పట్టుకుని కిందికి నక్కి, చుట్టూ ఉన్న ఆ మరుభూమిని పరిశీలించసాగాడు. సూర్యుడు నిర్దయగా తన ప్రతాపాన్ని సైనికులపై చూపిస్తున్నాడు. సైన్యమంతా చెమటతో తడిసి ముద్దయిపోయింది. ఆ విదేశీ దుమ్ముతో వారి యూనిఫామ్ కళా విహీనమయ్యింది. అయినా ఆ వేడిమి వారికి దుర్భరమైనదేమీ కాదు. ఏ క్షణంలో దాడి జరిగినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నారు.

సంజయ్ మనసు స్వల్పకాలం ఇంటి వైపుకు మరలింది. ఇప్పుడు తన తల్లి ఇంటి ముందున్న తోటలో పూలచెట్లకు నీళ్ళందిస్తూ ఉంటుంది. తండ్రి వసారాలో కూర్చుని ఎప్పటిలాగే పేపర్ తిరగేస్తూ ఉంటాడు. భార్య ప్రీతి డిన్నర్ సిద్ధం చేస్తూ ఉంటుంది. ఆమె చిరునవ్వు, మృదుస్వరం ఇంటిలో ఆహ్లాదాన్ని నింపుతూ ఉంటుంది. చిన్నారి కూతురు మీరా... తన రాక కోసం ఎదురుచూస్తూ ఉంటుంది. క్షణక్షణం తాను ఎదుర్కొంటున్న ఆపదల గురించి పాపం దానికి తెలియదు. తను వారందరినీ చాలా మిస్సయ్యాడు. వెంటనే తన ఆలోచనలను పక్కకుపెట్టాడు. తన మనుగడ యుద్ధంపై పూర్తి దృష్టి పెట్టమని డిమాండ్ చేస్తున్నప్పుడు సెంటిమెంట్‌కు తావుండదు.

"సార్జెంట్" అనే పిలుపుతో అతడు వాస్తవంలోనికి వచ్చాడు. ఆ గొంతు కార్పొరల్ మగ్బుల్‌ది. ఆ యువకుడు తన సెకండ్–ఇన్–కమాండ్. సరైన విశ్రాంతి లేకుండా, చాలా రోజుల ఒత్తిడితో అతడి ముఖం ఉద్రిక్తంగా ఉంది. "డ్రోన్లు తూర్పు వైపు కదలికను గుర్తించాయి. శత్రువులు మరో దాడికి సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది."

సంజయ్ తలపంకించాడు. అతడి దవడ కండరం క్షణకాలం బిగుసుకుపోయి తిరిగి యథాస్థానానికి వచ్చింది. "మనుషులను సిద్ధం చేయండి. ఏదేమైనా మనం ఈ ప్రాంతాన్ని కోల్పోకూడదు."

మగ్బుల్ సెల్యూట్ చేసి ఆర్డర్స్‌ను రిలే చేయడానికి పరుగు తీశాడు. సంజయ్ నిలబడి తన సైనికులు సిద్ధమవుతున్న దృశ్యాన్ని చూశాడు. ప్రతి సైనికుడూ అధిక సామర్థ్యంతో ముందుకు కదులుతున్నారు. వారంతా అలసిపోయారు. ఈ స్థలాన్ని ఆధీనంలోకి తీసుకోవడానికి వారు కష్టపడి పోరాడారు. ఇప్పుడు దానిని వదులుకోవడానికి ఏమాత్రం సిద్ధంగా లేరు.



సంజయ్ కలియతిరుగుతూ తన అలసటను కప్పిపుచ్చుకుంటూ, సైనికులను ప్రోత్సాహకరమైన మాటలతో ఉత్సాహపరిచాడు. ఆ సైనికులు అతడిని ఆరాధనగా చూశారు. సందేహపు ఛాయలు మచ్చుకైనా అతడి ముఖంపై కనబడనీయలేదు. గత కొన్ని వారాలుగా తిరుగుబాటుదారులు, దాడిపై దాడి చేస్తూ ఔట్‌పోస్టును అతడి యూనిట్ నుండి కబళించడానికి ప్రయత్నిస్తున్నారు. వారికి సంఖ్యాబలం ఉంది. పైగా ఆ చుట్టుముట్టు, ఆనుపానులు వారికి బాగా తెలుసు. ఐతే సంజయ్ సైనికులకు అంతకంటే బలమైనది ఒకటి ఉంది. అదే సంకల్ప బలం.

"సార్జెంట్, వారు వస్తున్నారు!" లుకౌట్ పోస్టు నుండి ఒక అరుపు వినిపించింది.

సంజయ్ దిబ్బపైకి పరుగులు తీశాడు. బైనాక్యులర్స్ అందుకుని సుళ్ళు తిరుగుతున్న ధూళిలో, దానితో చూడసాగాడు. వేగంగా కదులుతూ, ఆయుధ సామాగ్రితో శత్రు సైన్యం వస్తోంది. వారి చిరిగిపోయిన యూనిఫాములు దుమ్ములో కలిసిపోయాయి. పరిచయమున్న భూభాగంలో వడిగా తమ సైన్యాన్ని తాకడానికి వస్తోంది శత్రుమూక!

"పొజిషన్స్" సంజయ్ రంకె వేశాడు. అతని స్వరం అంతవరకూ ఉన్న అల్లకల్లోలాన్ని అణచివేసింది. అతడి సైనికులు... వస్తున్న శత్రువులపై రైఫిల్స్ గురిపెట్టారు.

మొదటి గుండు దూసుకెళ్ళింది. వెనువెంటనే వేగంగా కాల్పులు ఇరువైపులా జరగసాగాయి. సంజయ్ తలపై నుండి బుల్లెట్లు దూసుకెళ్ళాయి. గాలి దుమ్ము, పొగలతో దట్టంగా మారింది. అతడు ఒక బండరాయి వెనుకకు దూసుకెళ్లాడు. తన రైఫిల్‌ని స్థిరంగా గురిపెట్టి ముందుకు సాగుతున్న శ్రేణి పైకి కాల్పులు జరిపాడు. అతడి కాల్పులు గురి తప్పడం లేదు. సంవత్సరాల తరబడి తీసుకున్న శిక్షణ, అనుభవం అతడి ప్రతి కదలికను నడిపించాయి.

పోరాటం వేడిలో కాలం మసకబారింది. పేలుళ్ళు, కాల్పుల శబ్దం జీవన పోరాటపు స్వాభావిక గుణానికి లయబద్ధమైన నేపథ్యం అయ్యింది. సంజయ్ అటూ ఇటూ కదులుతూ, తన సైనికులను దిశానిర్దేశం చేస్తూ, గాయపడిన సైనికులను సురక్షిత ప్రదేశానికి ఈడ్చుకుని వెళుతున్నాడు. అతడి చేతులు తుపాకీ బరువుతో నొప్పిగా ఉన్నాయి, కానీ అతడు నొప్పిని పట్టించుకోలేదు. అతడు యుద్ధంలో కొనసాగాలి... అలాగే తన వారందరూ కూడా.

"సార్జెంట్!" మగ్బుల్ పెడబొబ్బలు పెడుతున్నట్టు అరిచాడు. సంజయ్ తన యువ కార్పొరల్ తన వైపుకు పరిగెత్తి వస్తున్నట్లు గమనించాడు. అతడి చేతి నుండి రక్తం ప్రవహిస్తుంది, కానీ అతడి ముఖంలో ఏదో దృఢ నిశ్చయం కనిపిస్తోంది. "వారు దక్షిణం నుండి మనల్ని చుట్టుముట్టడానికి ప్రయత్నిస్తున్నారు. వారు చొచ్చుకు వస్తే, మన పని అయినట్లే"

సంజయ్ మనసులో గొణుగుకున్నట్లు "ఇప్పుడే ఒక బృందాన్ని అక్కడికి తీసుకువెళ్ళు! నీకు వీలయినంత వరకు వారిని అక్కడే నిలువరించు. నేను ఇక్కడ మిగతా వాటిని చూసుకుంటాను" చెప్పాడు.

మగ్బుల్ తలూపి, గాయపడిన తన చేతిని పట్టుకుని, తన సైనికుల వద్దకు తిరిగి పరుగెత్తాడు. తమ సంఖ్య కంటే శత్రువులు ఎక్కువగా ఉన్నారని సంజయ్‌కు తెలుసు. కానీ తనవారు చాలా భీకరంగా పోరాడుతున్నారు. అతడి గుండె వేగంగా కొట్టుకోసాగింది భయం నుండి కాదు, మనుగడ కోసం... తన మనుషులను రక్షించడానికి... వారు రక్తం చిందించిన భూమిని రక్షించడానికి... అతడు తన మిగిలిన యూనిట్‌తో తిరిగి సమాయత్తం కావడానికి తిరిగినప్పుడు, ఒక పేలుడు భూమిని కదిలించి, అతన్ని నేల మీద పడిపోయేలా చేసింది. అతని చెవుల్లో భయంకరమైన శబ్దం. ప్రపంచం అతడి చుట్టూ తిరిగినట్లయ్యింది. ధూళి గాలిని నింపి, ఒక్క క్షణం అంతా మసకబారింది. అతడికి కాలులో తీవ్రమైన నొప్పి అనిపించి, బలవంతంగా తనను తాను లేచి కూర్చోవడానికి ప్రయత్నించాడు. అతడి రైఫిల్ పేలుడులో ఎక్కడో పడిపోయింది. అతడి కాలు తీవ్రమైన వేదనతో కొట్టుమిట్టాడింది, కానీ అతడు తన పళ్ళ బిగువున లేచి తనను తాను నిలబెట్టుకున్నాడు. మద్దతు కోసం సమీపంలోని బండపై వాలాడు.

ఇద్దరు తిరుగుబాటుదారులు రైఫిళ్లు ఎత్తి తన వైపుకు వస్తున్న దృశ్యాన్ని పొగమంచులో మసకగా చూశాడు. సంజయ్ తన సైడ్ ఆర్మ్ కోసం వెదికి దానిని సమీపించాడు. అతడి చేతులు నొప్పితో వణుకుతున్నాయి. శత్రు సైనికులు సమీపిస్తున్నప్పుడు అతడి గుండె కొట్టుకోసాగింది. వారి ముఖాలు స్పష్టంగా కనిపించాక అతడు గురిపెట్టి కాల్చాడు. ఒకడి ఛాతీకి ఖచ్చితమైన గురిచూసి వాడిని నేలకొరిగేలా చేశాడు. రెండవ సైనికుడు ఎదురు కాల్పులు జరిపాడు. సంజయ్ తలదించుకున్నాడు. బుల్లెట్ అతని భుజాన్ని తాకినట్లు అనిపించింది. పళ్ళ బిగువున నొప్పిని పట్టించుకోకుండా మళ్లీ కాల్పులు జరిపాడు. రెండవ తిరుగుబాటుదారుడు మరోసారి కాల్పులు చేయక ముందే అతన్ని మట్టుబెట్టాడు.

ఊపిరి పీల్చుకున్న సంజయ్ యుద్ధభూమిని కలియజూసాడు. అతడి సైనికులు చాలా తక్కువగా శ్రేణి వెంబడి కనిపించారు. తిరుగుబాటుదారులు వెనక్కి తగ్గారు, కానీ ప్రస్తుతానికి మాత్రమే. వారు తిరిగి వస్తారని అతడికి తెలుసు. ఈసారి వారు అంత అదృష్టవంతులు కాకపోవచ్చు.

ఒక పరిచయమైన స్వరం వినిపించింది. “సార్జెంట్! మీరు గాయపడ్డారు!” మగ్బుల్ అతడి వైపు పరుగుత్తుకొచ్చాడు. అతడి ముఖంలో ఉపశమనం, ఆందోళనా మిశ్రమంగా ఉన్నాయి.

“నేను బాగానే ఉన్నాను,” సంజయ్ అబద్ధమైతే చెప్పాడు కానీ అతడి కాలు నిప్పుల్లో ఉన్నట్లు అనిపించింది.

“మేము వారిని ప్రస్తుతానికి నిలువరింపగలిగాము. కానీ మనకు ఉప బలగాలు త్వరగా కావాలి.”

మగ్బుల్ తలూపాడు. “నేను ఇప్పటికే అదనపు బలగాలను పిలిచాను. వారు గంటలోపు ఇక్కడ ఉంటారు.” సంజయ్ తన కాలు నొప్పి తీవ్రస్థాయికి చేరుకున్నా క్షణం పాటు ఉపశమనం పొందాడు. అతడు బండరాయిని ఆధారంగా చేసుకుని నిలబడి, యుద్ధభూమిపై ధూళి అణిగి, స్థిరపడటాన్ని గమనించాడు. వారు ఈ రౌండ్‌ను గెలుచుకున్నారు, ఐతే యుద్ధం ఇంకా ముగిసిపోలేదు.

సూర్యుడు పశ్చిమాద్రి వైపు క్రుంగడం మొదలు పెట్టడంతో ఆ ప్రాంతమంతా బంగారు వర్ణంతో నిండిపోయింది. సంజయ్ ఆలోచనలు ఇంటి వైపు మళ్ళాయి. ప్రీతీ, మీరా ఇంకా ప్రశాంతమైన జీవితం.. ఈ చావుకీ, విధ్వంసపు చోటుకీ చాలా చాలా దూరంగా... కానీ అతడు ఆ ఆలోచనలను ఎక్కువ సేపు కొనసాగనివ్వలేదు. తను ఒక సైనికుడు. యుద్ధం చేయడం తన విధి! దేశం కోసం పోరాడతాడు, ఎంతకైనా తెగించి నిలబడతాడు.

సంజయ్ తలపంకించాడు. మగ్బుల్ స్వరంలో ఏదో వింత గోచరించింది. నొప్పినుండి దృష్టి మరలించడానికి ప్రయత్నిస్తూ, తన యువ కార్పొరల్ వైపు చూశాడు. వెంటనే మగ్బుల్ చూపులో ఏదో ఒక కదలిక. అపరాధం. భయం. ఏదో చీకటి!

సంజయ్ మాట్లాడబోయేటంతలో, అతడి చుట్టూ ఉన్న ప్రపంచం గిర్రున తిరుగుతున్నట్లు అనిపించింది. అతడి దృష్టి మసకబారింది. అతడి తలపులు దూరం కాసాగాయి. అది కేవలం కాలునొప్పి వల్ల కాదు. ఇంకేదో ఉంది. తన నుండి సత్తువ హరించుకుపోతున్నట్లు, విపరీతంగా బలహీనమైనట్లు అనిపించసాగింది. ఆ వాస్తవం అతడికి స్ఫురించిన వెంటనే గుండె పగిలిపోయినట్లయ్యింది.

తనపై విషప్రయోగం జరిగింది!

మగ్బుల్ అతడి పక్కనే మోకరిల్లాడు. అతడి ముఖం బలవంతపు ఆందోళన ముసుగు కప్పుకొని ఉంది. “రెస్ట్ తీసుకోండి సార్జెంట్. సహాయం అందుతోంది.”

సంజయ్ మనసు గిర్రున తిరుగుతోంది! మగ్బుల్? అది అసాధ్యం. తాను అన్ని సంవత్సరాలుగా మార్గదర్శనం చేసిన తన సెకండ్–ఇన్–కమాండ్, యువ సైనికుడు తనకి వెన్నుపోటు పొడిచాడు!

“నువ్వు...” సంజయ్ మాట్లాడటానికి చాలా కష్టపడ్డాడు. అతడి స్వరం చాలా తక్కువగా ఉంది. “ఏం... నువ్వు చేశావా?”

మగ్బుల్ ముఖం వివర్ణమయ్యింది. అతడి ముసుగు జారిపోయింది. “నన్ను క్షమించండి, సార్జెంట్. ఇది ఇలా జరగకూడదు. కానీ వారు నన్ను ఇలా చేయమన్నారు.”

సంజయ్ తలతిరిగినట్లయ్యింది. తిరుగుబాటుదారులు... మగ్బుల్ వద్దకు వచ్చి అతడిని బెదిరించి ఉండాలి లేదా ప్రతిఫలంగా అతడికి డబ్బు ఎర చూపి ఉండాలి. కానీ ఇప్పుడు అది కాదు ముఖ్యం. విషయం ఏమిటంటే, మగ్బుల్ తనకి విషం ఇచ్చాడు. సమయం తగ్గిపోతూ ఉంది.

“నేను... నిన్ను నా తమ్ముడిలా భావించాను” సంజయ్ క్షణక్షణానికీ శరీరం చల్లగా మారడంతో గొంతు పిండేసుకుని చెప్పగలిగాడు.

మగ్బుల్ కళ్ళలో పశ్చాత్తాపపు ఛాయలు కనిపించాయి. “నాకు వేరే మార్గం లేదు” హీనస్వరంతో గొణిగాడు. “వారి వద్ద నా కుటుంబం బందీగా ఉంది. నేను ఇలా చేయకపోతే... వారు నావాళ్లను చంపేస్తారు.”

సంజయ్ గుండె దడదడలాడింది. ఇప్పుడు అతడికి అర్థమైంది. మగ్బుల్ ఉచ్చులో చిక్కుకున్నాడు. కానీ మగ్బుల్ ద్రోహాన్ని భరించడం సులభం కాదు.

సంజయ్ చుట్టూ ఉన్న ప్రపంచం మసకబారింది. అతడి దృష్టి అంచులు క్రమంగా నల్లగా మారాయి. అతడి శరీరం బరువు అనిపించింది. కాలు, భుజం నొప్పి ఇప్పుడు దూరమయ్యాయి. కానీ అతడు చివరి ఆలోచనతో వేలాడుతున్నాడు.

అతడు ఇక్కడే చనిపోయినా, మగ్బుల్ వెన్నుపోటు అతడి ప్రాణాలకు మూల్యం చెల్లించినా, సంజయ్ దానిని ఊరికే పోనివ్వడు. అలా చేయడం అతడికి కుదరని పని.

శక్తినంతా కూడదీసుకుని సంజయ్ తన రేడియో దగ్గరికి చేరుకున్నాడు. అతడు బటన్ నొక్కినప్పుడు అతడి వేళ్లు వణుకుతున్నాయి. “కమాండ్... దిసీజ్ సార్జెంట్ సింగ్,” అతడు గట్టిగా అరిచాడు, కానీ అతడి గొంతు వినపడలేదు. “అంతర్గత ముప్పు పొంచి ఉంది... మగ్బుల్... రాజీ పడ్డాడు...” రేడియో చిటపటమని చప్పుడు చేసింది. చీకటి తనని పూర్తిగా ఆక్రమించక ముందే సంజయ్ అస్పష్టమైన సమాధానాన్ని అటు వైపునుండి విన్నాడు. సంజయ్ కళ్ళు తెరిచినప్పుడు, అతడు ఒక తాత్కాలిక వైద్య గుడారంలో ఉన్నాడు. అతడి కాలికి బ్యాండేజ్ కట్టారు. నొప్పి మందగించినప్పటికీ కొంత సలుపుగా ఉంది. అతడు తనను తాను అవగతం చేసుకునేందుకు ప్రయత్నిస్తూ రెప్ప వేశాడు. ఒక పరిచయమైన ముఖం కనిపించింది. లెఫ్టినెంట్ శర్మ, అతడి కమాండింగ్ అధికారి.

“సార్జెంట్ సింగ్” శర్మ మృదువుగా చెప్పాడు. అతడి స్వరంలో ఉపశమనం స్పష్టంగా ఉంది. “మీరు సాధించారు.” సంజయ్ గొంతు తడారిపోయి ఉంది, కానీ అతడు మాటలను బలవంతంగా బయటకు వదిలాడు “మగ్బుల్?” శర్మ మొహం నల్లబడింది. “మాకు తెలుసు. మీ సందేశం మమ్మల్ని రక్షించింది. మేము మీ శరీరంలో విషం కనుగొని, దానిని తటస్థీకరించాము. మగ్బుల్... అతడిని డీల్ చేశాము.”

సంజయ్ కళ్ళు మూసుకున్నాడు. అలసట అతడిని ఆవహించింది. అతడు ప్రాణాలతో బయటపడ్డాడు కానీ ద్రోహం యొక్క బరువు అతడి గుండెపై భారంగా ఉంది.

యుద్ధంలో శత్రువు ఎల్లప్పుడూ మన ఎదురుగా ఉండడు. కొన్నిసార్లు, మన పక్కనే నిలబడి ఉంటాడు కూడా!

# బహుమతి

ఇందిర రాజగోపాల్

✆ 9167021807

కథామంజరి బాల కథ

***"గ్రంథాలయాలు స్థాపించకముందు, అపూర్వమైన మన సాహితీసంపద అంతా తాళపత్రాలపై భద్రపరచి ఉంది. అప్పట్లో అవే మన గ్రంథాలయములు. అంటే మా తాతగారి కాలం అన్నమాట. తరువాత పుస్తకములు, గ్రంథాలయములు వచ్చాయి! నా చిన్నప్పుడు గ్రంథాలయముల వాడుక బాగా ఎక్కువగా ఉండేది. మేమంతా గ్రంథాలయములకు వెళ్ళి, నచ్చిన కథల పుస్తకములను, నవలలను తెచ్చుకుని చదువుకునేవాళ్ళం.***

సమయం సాయంత్రం 5 గంటలు! ఆకాశం నిండా కారు మబ్బులు కమ్ముకుని ఉన్నాయి. రాజశేఖర్ ఈ రోజు పార్క్‌కి వెళ్ళడం పడదు అని నిర్ణయించుకుని సోఫాలో చతికిలబడ్డాడు.

తల్లి రాధ పర్యవేక్షణలో హోంవర్క్ ముగించి, తాతగారి దగ్గరికి వచ్చాడు గోపి.

"తాతయ్యా! ఈ రోజు పార్క్‌కి వెళ్ళలేం కదా! నీ మొబైల్లో ఓ అప్లికేషన్ సెట్ చేస్తాను. నీ మొబైల్ పట్టుకుని హాలులో వాకింగ్ చెయ్యి. అరగంటలో ఎన్ని స్టెప్స్ నడిచావో తెలుస్తుంది.' అన్నాడు.

మనుమడి తెలివితేటలకి అబ్బురపడిపోతూ... "మరి నువ్వు గేములు ఎప్పుడూ ఆడుకుంటావు?" అని ప్రేమగా అడిగాడు రాజశేఖర్.

రోజూ తాతగారితో గోపి పార్క్‌కి వెళ్ళి, తాతగారు వాకింగ్ చేస్తుంటే, ఇంట్లో రాధ మొబైల్‌లో ఆటలు ఆడనివ్వదని, ఆయన మొబైల్ తీసుకుని, ఆడుకుంటాడు. ఇది వారి దిన చర్య!

"నీ వాకింగ్ అయిన తరువాత!" అని, మొబైల్ తీసుకొని, 'గూగుల్ ఫిట్' యాప్‌ని సెట్ చేసి, తాత గారికిచ్చాడు.

సంభాషణ అంతా వింటున్న రాధ కూడా కొడుకు తెలివితేటలకి లోలోపలే ఆనందపడింది.

★★★

"తాతయ్యా! నాకు ఒక మొబైల్ కొనిపెట్టవా! నేను లెక్కలలో ఫస్ట్ వస్తే, కొని ఇస్తానన్నావుగా!" అన్నాడు.

మొబైల్ కొని ఇస్తే, అదే పట్టుకు కూర్చుంటాడని రాధ భయపడుతుంది, కాని గోపీ తెలివితేటలకి పదునుపెట్టాలని నిర్ణయించుకుని... "అలాగే! కాని నువ్వు రోజూ ముందు నేను చెప్పిన పని పూర్తి అయిన తరువాత నువ్వు నీకు నచ్చిన గేములు ఆడుకోవాలి... సరేనా!" అన్నాడు

"అలాగే తాతయ్యా!" అంటూ ఒక్కసారి తాతయ్యని కౌగలించుకున్నాడు గోపి.

★★★

గోపి తన పుట్టినరోజు పార్టీ కి వచ్చిన స్నేహితులందరికీ తాతయ్య ఇచ్చిన బహుమతి చూపించాడు.



అందరూ ఆసక్తిగా ఆ మొబైల్ వంకే చూస్తున్నారు

రాధకి మాత్రం పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్లుగా ఉంది. ఎంతో ప్రేమతో, మనవడికి పుట్టినరోజు కానుకగా ఇచ్చిన మామగారికి ఏమి చెప్పలేకపోయింది.

పార్టీ అయిన తరువాత నెమ్మదిగా తాతయ్య పడుకున్న గదిలోకి వెళ్ళి, 'తాతయ్యా! నేనేమి చేయాలో చెప్పు?" అన్నాడు.

"మన పని రేపటినుంచి మొదలు పెడదాం! ముందు ఏమి చేయవలసినది చెబుతా శ్రద్ధగా విను!" అంటూ చెప్పనారంభించాడు.

"గ్రంథాలయాలు స్థాపించకముందు, అపూర్వమైన మన సాహితీసంపద అంతా తాళపత్రాలపై భద్రపరచి ఉంది. అప్పట్లో అవే మన గ్రంథాలయములు. అంటే మా తాతగారి కాలం అన్నమాట. తరువాత పుస్తకములు, గ్రంథాలయములు వచ్చాయి! నా చిన్నప్పుడు గ్రంథాలయముల వాడుక బాగా ఎక్కువగా ఉండేది. మేమంతా గ్రంథాలయములకు వెళ్ళి, నచ్చిన కథల పుస్తకములను, నవలలను తెచ్చుకుని చదువుకునేవాళ్ళం. వార్తాపత్రికలని అక్కడే కూర్చుని చదువుకునేవారం! ఇప్పటి సాంకేతిక యుగంలో సమాచారం అంతా కంప్యూటర్లలోను, యూట్యూబ్లోను దొరుకు తున్నాయి కదా! గ్రంథాలయములకు వెళ్ళే అవసరం తగ్గిపోయింది. ఇకపోతే నా మెదడులో ఒక పెద్ద గ్రంథాలయం ఉంది. నా గ్రంథాలయంలో నుంచి, నేను రోజూ నీకు కొంచెం కొంచెం చెబుతాను. నువ్వు రికార్డ్ చెయ్యి. నీకు దాని అర్థం విడమరచి చెప్పి, ఎలా చదవాలో చెబుతాను. ఇదంతా మనం కూడా యూట్యూబ్‌లోకి ఎక్కిద్దాం. సరేనా!" అంటూ గోపీవైపు చూశాడు రాజశేఖరం .

శ్రద్ధగా వింటూన్న గోపి "తప్పకుండా తాతయ్యా" అన్నాడు

తాత మనుమడు కూర్చుని రికార్డింగ్ ప్రారంభించారు.

రికార్డ్ చేసిన తరువాత... రికార్డింగ్ సరిగా ఉందా లేదా అంటూ తాతగారి పక్కన కూర్చుని, ఆ పద్యాలన్నీ వినేవాడు. ఏ ప్రయత్నం లేకుండా గోపీకి రికార్డ్ చేసిన పద్యాలన్నీ నోటికి వచ్చేశాయి.

'హమ్మయ్య! దారిలో పడ్డాడు' అని మనస్సులో అనుకొని, గర్వంగా గోపీవంక చూశాడు రాజశేఖరం.

రోజూ శ్రద్ధగా తాత మనుమళ్లు చేసే పని అర్థం చేసుకున్న రాధ, మామగారి మేధకు ఆశ్చర్యపోయింది. 'మామగారు గోపికి ఇచ్చిన బహుమతి ఎంత అమూల్యమైనది' అని అనుకుంటూ సంబరపడిపోయింది రాధ.

# పొడుగు తోక

ఆర్. సి. కృష్ణస్వామి రాజు
✆ 9393662821

కథామంజరి బాల కథ

***శక్తినంతా కూడగట్టుకుని అతడి పాదం నుంచి తనని తాను శరీరాన్ని గట్టిగా లాక్కొని పరుగులు తీస్తూ బయటికి వెళ్ళింది.***
***ఇంటి బయటికి వచ్చి చూసుకున్న దానికి తన తోక తెగి ఉండటం కనిపించింది. 'కుయ్యో మొర్రో' అంటూ పొలం దగ్గరికి చేరింది.***
***అంతా చూసిన పొట్టి తోక ఎలుక తల్లి "పొట్టి తోక ఉందని ఇన్నాళ్ళూ బాధ పడినావు. అదే పొట్టి తోక నీ ప్రాణాలు కాపాడింది చూడు" అని తన ఎలుక బిడ్డకి వివరించింది.***

ఒక రైతు పొలంలో దండిగా ఎలుకలు ఉండేవి. అవి రైతు పండించే వరి పంటను తింటూ హాయిగా కాలం గడిపేవి. దాంతో పాటు పొలం పక్కనే ఉన్న రైతు ఇంట్లోకి అప్పుడప్పుడూ వెళ్ళి, రకరకాల కాయగూరలు, పండ్లు, పప్పు దినుసులు తినేవి.

ఎలుకల దండులోని నల్ల చారలున్న ఓ ఎలుకకు పొట్టి తోక ఉండేది. తనకు ఉన్న పొట్టి తోకను చూసి ఆ ఎలుక చాలా బాధ పడేది. పొడుగు తోకలున్న ఎలుకలను చూసి కుళ్ళి కుళ్ళి ఏడ్చేది.

'నాకున్న పొట్టి తోకను చూసి ఎవరు పెళ్లి చేసుకుంటారు? నాదీ బతుకేనా... నాకు చచ్చి పోవాలని ఉంది' అని కుమిలేది.

దాని బాధ చూసిన తల్లి ఎలుక "తోక ఎంత ఉంటే ఏమి? నీకు కాలు వంకరా, కన్ను వంకరా... అన్నీ బాగున్నాయి కదా. దానికన్నా మించిన మంచి మనసు నీకు ఉంది! నీవు గమనించావో, లేదో... మన తోకలు పొట్టివైనా, పొడుగువైనా నలుపే కదా! దాన్ని ఎంత తోమినా దాని నలుపు పోదు కదా. నీ మంచి మనసుకు తగ్గట్టు అన్నీ మంచిగా జరుగుతాయిలే! అయినా తోక చిన్నదని ఎవరైనా ప్రాణాలు తీసుకుంటారా? నీలాంటోడు ఒకడు ఎలుక మీద కోపంతో ఇంటికి నిప్పు పెట్టుకున్నాడంట!" అని తిట్టినట్టు తిడుతూనే ధైర్యం చెప్పేది.

ఇంతలో పక్క పొలంలోని పొడుగు తోక ఎలుకతో, పొట్టి తోక ఎలుకకి సావాసం కుదిరింది.

ఆ పొడుగు తోక ఎలుక కావాలనే తన తోకను ఆడిస్తూ వయ్యారాలు పోయేది. అప్పుడు పొట్టి తోక ఎలుక మరింత బాధపడేది. కానీ తల్లి చెప్పిన మాటలు గుర్తు తెచ్చుకుని కాలం గడిపేది.


ఒకరోజు రైతు ఇంట్లో నుంచి చేపల కూర ఘుమఘుమ

వాసనలు రాసాగాయి. 'ఎప్పుడూ తినే వరి గింజలేనా... చేప కూర తిందాము' అనుకుంది పొడుగు తోక ఎలుక.

ఒంటరిగా వెళ్ళడానికి ధైర్యం లేక, తోడుగా పొట్టి తోక ఎలుకను తీసుకెళ్ళింది.

రైతు ఇంట్లో అందరూ గాఢంగా నిద్ర పోతున్నారు. ఇదే సమయమని రెండు ఎలుకలూ వంట ఇంట్లోకి దూరాయి. చిన్నగా కూర గిన్నె మూత తీశాయి. తొందరలో గిన్నె మూత నేల మీద పడింది. ఆ శబ్దానికి రైతు లేచాడు. ఎలుక దూరిందని తెలుసుకున్నాడు. వెంటనే చిన్న కొడుకును నిద్ర లేపాడు. ఎలుకలను కొట్టి చంపమని ఆదేశించాడు.

పొలాన్ని పాడు చేస్తున్నాయని చాన్నాళ్ళుగా కోపంగా ఉన్న చిన్న కొడుకు... శబ్దం చేయకుండా వంటగదిలోకి వెళ్ళాడు. ఎలుకల్ని చూసి కడుపు మండింది. కసికసిగా చిన్న తోక ఎలుక మీదికి దూకాడు. దానికి చిన్న తోక ఉండటంతో అతడి కాలుకు అది అందలేదు. 'బతుకు జీవుడా...' అంటూ సరసరా రైతు ఇంటి నుంచి వచ్చేసింది.



పక్కనే ఉన్న పొడుగు తోక ఎలుక, ఎటు పోవాలో తెలియక అక్కడే అల్లిబిల్లి తిరగసాగింది. దాన్ని చూసిన రైతు చిన్న కొడుకు కాలితో తొక్కాలని దాని పైకి దూకాడు. దాని తోక పొడవైనది కావడంతో అతడి కాలు కింద ఇరుక్కుంది. రైతు కొడుకు తన కాలితో మరింత గట్టిగా నొక్కాడు. ఊహించని ఆపదకు ఆ పొడుగు తోక ఎలుక బెంబేలెత్తింది.

శక్తినంతా కూడగట్టుకుని అతడి పాదం నుంచి తనని తాను శరీరాన్ని గట్టిగా లాక్కొని పరుగులు తీస్తూ బయటికి వెళ్ళింది.

ఇంటి బయటికి వచ్చి చూసుకున్న దానికి తన తోక తెగి ఉండటం కనిపించింది. 'కుయ్యో మొర్రో' అంటూ పొలం దగ్గరికి చేరింది.

అంతా చూసిన పొట్టి తోక ఎలుక తల్లి "పొట్టి తోక ఉందని ఇన్నాళ్ళూ బాధ పడినావు. అదే పొట్టి తోక నీ ప్రాణాలు కాపాడింది చూడు" అని తన ఎలుక బిడ్డకి వివరించింది.

వారి దగ్గరికి వచ్చి చేరిన తోక తెగిన ఎలుక " పొడుగు తోక ఉందని గర్వపడేదాన్ని! అదే నా ప్రాణానికి ముప్పు తీసుకొచ్చింది" అని ఏడుస్తూ కూర్చుంది.

ధైర్యం చెబుతూ మిగిలిన ఎలుకలు తెగిన తోకకి వైద్యం ప్రారంభించాయి.

'పొట్టి తోక ఉందని బాధ పడాల్సిన పని లేదు, పొడుగు తోక ఉందని గర్వ పడాల్సిన పనీ లేదు. ఏ తోకైనా ఒకటే' అని తెలుసుకున్న ఆ రెండు ఎలుకలూ ఆ రోజు నుంచీ స్నేహంగా ఉండసాగాయి.

# పేరులో ఏముంది?

డా. జె. భాగ్యలక్ష్మి
✆ 9818191192

**విశిష్ట అతిథి కథ**

***"సార్ ఏమనుకోకండి, మీ గుర్తింపు కార్డు చూపించండి. మాకు కొంచెం సెక్యూరిటీ ప్రోబ్లెమ్" అని ఒకతను అన్నాడు. నాకు నవ్వొచ్చింది. నేను భగవంతుని భద్రత కోరదామని వచ్చాను. ఇక్కడేమో నావల్ల భగంతుని భద్రతకే ప్రమాదమంటున్నారు. పోకెట్‌లో నుండి ఐడెంటిటీ కార్డ్ తీసి చూపించాను.***

ఏ ముహూర్తంలో మా తాతగారు నాకు పేరు పెట్టారో గాని.. ఎప్పుడూ ఏదో ఒక చిక్కులో పడక తప్పట్లేదు!

మా తాతగారు నాకంత జ్ఞాపకం లేరు. నా మూడునాలుగేళ్ల ప్రాయంలోనే ఆయన పోయారని మా అమ్మ చెప్పేది. మా కుటుంబం రంగూన్‌లో ఉండేది. నాన్న ప్రభుత్వోద్యోగి. బహుశా తాతగారు కూడా బ్రిటిష్‌వారి కాలంలో ఉద్యోగరీత్యా అక్కడకు వెళ్ళి ఉంటారు. ఐదవ తరగతి దాకా.. నా చదువు అక్కడే సాగింది. మాది తెలుగు కుటుంబమే గాని, నేను చదివే స్కూల్లో ఇంగ్లీషు తప్ప మరే భారతీయ భాషా ఉండేది కాదు! కానీ, తెలుగు అక్షరాలు రాయటం చదవడం ఇంట్లో అమ్మ నేర్పింది. ఎప్పుడు చేర్చిందో గాని, పెదబాలశిక్ష ఒక పాత కాపీ ఇంట్లో ఉండేది. దానిలో నుండి కథలూ, సామెతలూ వగైరా చదివి వినిపిస్తూ ఉండేది. ఇక మా నాన్నగారైతే.. ఏవేవో పాత పుస్తకాలు దగ్గర పెట్టుకొని, పద్యాలు రాగయుక్తంగా చదువుతూ ఉండేవారు. ఆ రాగాలు నాకూ అలవడ్డాయి. ఆయన వద్దే ఎన్నో తెలుగు పద్యాలు నేర్చుకున్నాను. కానీ ఆ పుస్తకాలు మాత్రం పొరపాటున కూడా నేను తెరిచేవాడ్ని కాదు. ఆ కాగితాలు రంగు మారిపోయి, చేయి తగిలితే చేతికి అంటుకునేటంత మెత్తగా ఉండేవి. నాన్నగారు మాత్రం వాటిని భద్రంగా తెరిచేవారు. భక్తిగా మూసిపెట్టేవారు.

ఇంతకూ నా పేరు చెప్పనే లేదు. ఎడ్వర్డ్ వెంకటశాస్త్రి! ఇ.వి. శాస్త్రి అని రాసుకునేవాడ్ని! తమిళ సాంప్రదాయమో.. మరే సాంప్రదాయమో తెలీదు గాని, అందరి తెలుగు కుటుంబాలకు మల్లే మాకు ఇంటిపేరు లేదు.

నేను ఐదో తరగతి చదువుతుండగా మా కుటుంబం ఇండియాకు అంటే మద్రాసుకు వచ్చేసింది. అక్కడే నా చదువంతా సాగింది. పచ్చయ్యప్ప కాలేజీలో ఫిలాసఫీలో బి.య్యే. ఆనర్స్ చేశాను.

అప్పుడే మా నాన్నగారు ఉద్యోగరీత్యా ఢిల్లీకి వచ్చారు. మేమందరం కూడా ఢిల్లీకి వచ్చాం. నేను 'సెయింట్ స్టీఫెన్స్' కాలేజీలో ఎమ్మే చేశాను. అక్కడే లెక్చరర్‌గా చేరాను. ఇది ఇరవయ్యేళ్ళనాటి మాట!

ఆ తరవాత జీవితంలో రావలసిన మార్పులన్నీ వచ్చాయి. కానీ ప్రతీ మలుపు వద్దా.. నా పేరు ఒక ప్రశ్నార్థకంగా నిలబడేది. ఢిల్లీ జీవితంలో దేశంలో అన్ని ప్రాంతాలవారూ తారసపడతారు గనుక, వ్యక్తిగత విషయాలలో అంతగా కుతూహలం ప్రదర్శించరు. ఏ పేరో, ఏ కులమో కూడా ఎవరికీ పట్టదు. అయితే రాష్ట్రం పట్ల ఆసక్తి ఉంటుంది. ఒకప్పుడు మద్రాసీలనే వారిని ఇప్పుడు సౌతిండియన్స్ అంటున్నారు. కొంచెం బాగా చదువుకున్నవాళ్లైతే.. రాష్ట్రం పేరు గుర్తు పెట్టుకుంటారు.



తెలుగువాళ్లైతే మీరు తెలుగువాళ్ళా.. అరవవాళ్ళా అని అడుగుతుంటారు. "మీ తెలుగు బాగానే ఉంటుంది గనుక తెలుగువాళ్ళయి ఉండాలని' వాళ్ళే ఒక నిర్ణయానికి వచ్చేవారు. తరవాత ఏ ఊరని అడిగేవారు. నా జీవితచరిత్రంతా చెప్పేసరికి 'మద్రాసా' అని చప్పరించేసేవారు. 'కాకపోయినా మీ పూర్వీకులు ఆంధ్రలో ఏ ప్రాంతం నుండైనా అంటే రాయలసీమ, తెలంగాణా, ఆంధ్ర, ఉత్తరాంధ్ర వంటి ప్రదేశాలకు చెంది ఉండాలి కదా' అని పరిశోధనాత్మకమైన ప్రశ్నొకటి వదిలేవారు.

"మద్రాసు దగ్గరే ఏదో ఊరు? నాకంతగా తెలీదు. ఎప్పుడో మా తాతగారు రంగూన్ వెళ్లారు" అనే వాడిని.

"నిజమేలే, ఆరోజుల్లో అంతా మద్రాసే కదా" అని తలూపేవారు.

నాకు ఈ ముక్కచెక్కలుగా ఆలోచించడం మొదట్నుండీ లేదు. నేను పుట్టి పెరిగిన ప్రాంతం, చదువుకున్న స్థలాలూ, మా ఇంటి వాతావరణం ఇందుకు కారణం కావచ్చు!

ఒకసారి వారణాసి నుండి వచ్చిన మిత్రుడొకడు "మీరు శాస్త్రి ఎప్పుడు పాసయ్యారు?" అని అడిగాడు.

నా తల తిరిగిపోయింది. "ఏమిటన్నారూ?" అన్నాను.

"మీరు సంస్కృత పండితులు కదా?" అన్నాడు.

"అబ్బే అలాంటిదేమీ లేదు. మా భాషలో సంస్కృతం ఎక్కువ గనుక, కొద్దిగా ఆ జ్ఞానం ఉంది.. తప్పితే, మా నాన్నగారి దగ్గర కొన్ని శ్లోకాలూ అవీ నేర్చుకున్నాను. బాగా విడమర్చి చెప్పేవారు" అన్నాను.

అతను నవ్వాడు. "భలే జోక్ చేసారే" అన్నాడు. అందులే జోకేమిటో నాకు బోధపడలేదు.

"కొన్ని శ్లోకాలు నేర్చుకున్నందుకే మీకు శాస్త్రి పట్టా ఇచ్చారా?"

"నాకెవ్వరూ ఇవ్వలేదు. మా అమ్మా నాన్నా పెట్టిన పేరది!"

అప్పుడు నా కొలీగ్ ఒకతను విడమర్చి చెప్పాడు 'శాస్త్రి' అనే డిగ్రీ కోర్స్ ఒకటి ఉందని!

★★★

మహారాష్ట్ర యూనివర్సిటీ ఒకదానికి కొన్నాళ్లు విజిటింగ్ ప్రొఫెసర్‌గా వెళ్ళాను. అక్కడ మరాఠీ బోధించే ఒక ప్రొఫెసర్‌తో పరిచయమైంది. ఆయన పేరు విఠల్ శాస్త్రి. మేమిద్దరం ఉన్నప్పుడూ 'ప్రొఫెసర్ శాస్త్రి' అని ఎవరైనా పిలిస్తే కాస్త తికమకగా ఉండేది. ఆ సందర్భంలో ఒకాయన "మీరిద్దరూ శాస్త్రులే కదా! బ్రాహ్మణోత్తములు. ఎవరు పలికినా పరవాలేదు" అని పరిహాసమాడాడు.

"దానితో మరాఠీ ప్రొఫెసర్‌కు కోపం వచ్చింది. "నేను అట్టడుగు నుండి పైకి వచ్చిన వాడ్ని. నెత్తిన బరువులు మోసిన వాడ్ని. కష్టపడిన వాడ్ని. మీలో ఎవరైనా నాలా కష్టపడ్డారా? ఏమాత్రం బాధలైనా అనుభవించారా? మానసికంగా కుంగిపోయారా? అన్నీ చక్కగా చదివితే ఎవరైనా చదవవచ్చు పై చదువులు! వెలగబెట్టొచ్చు గొప్ప ఉద్యోగాలు! నన్నూ నా కులాన్నీ అందరూ హీనంగా చూస్తారని నాకు తెలుసు. చదువుకునే రోజుల్లోనే ఇవన్నీ గమనించాను. అందుకే అగ్రకులాలనే వాళ్ల మీద కసికొద్దీ.. 'శాస్త్రి' అనే పేరుకేమైనా 'కాపీరైటుందా' అన్న కోపం కొద్దీ నా పేరుకు 'శాస్త్రి' తగిలించుకున్నాను" అన్నాడు.

ఈసారి తెల్లబోవడం నా వొంతైంది. ఒక పేరు వెనుక ఇన్నిన్ని అర్థాలుంటాయని నాకెన్నడూ తోచలేదు. 'శాస్త్రి' అంటే బ్రాహ్మణుడికి 'బ్రాండ్‌నేమ్' అని నేనెప్పుడూ అనుకోలేదు. శాస్త్రాలు తెలిసినవాడంటే ఏ పండితుడైనా 'శాస్త్రి' అనే అనుకున్నాను. ఇది నా తెలివితక్కువతనమేమో!

ఒక పార్టీలో ఒక తెలుగాయన కలిశాడు. "శాస్త్రిగారూ మీరు 'ఇ.వి శాస్త్రి' కదా, 'ఇ' అంటే ఏంటండీ?" అని అడిగాడు.

"ఎడ్వర్డ్" అన్నాను.

ఆయన ఉలిక్కిపడినట్టు ఆయన కప్పులోని సూపు వణికింది.

కాస్త గొంతు తగ్గించి "మీరసలు క్రిస్టియన్‌లా కనిపించరు" అన్నాడు.

"క్రిస్టియన్లు ఎలా కనిపిస్తారేమిటి?" అని అడిగాను.

"కొంచెం తెలిసిపోతుందిలెండి. ఇంతకూ..."

"నేను క్రిస్టియన్ అని ఎందుకు అనుకున్నారు?"

"ఎడ్వర్డ్ క్రిస్టియన్ పేరు కదా!"

"ఏమో మరి, మా తాతగారు బ్రిటిష్ రాజు 'ఎడ్వర్డ్' పేరు పెట్టినట్టున్నారు నాకు!" అని అన్నాను.

ఇదేదో తిక్క వ్యవహారం అనుకున్నట్టున్నాడు, 'ఎక్స్క్యూజ్మీ' అంటూ అక్కడ్నుండి కదిలాడు.

ఇంటలెక్చువల్... అంటే బుద్ధిజీవిగా కనబడడానికి గెడ్డం పెంచాలనే ఫేషన్ ఎప్పుడొచ్చిందో నాకు తెలియదు. కానీ నేను ముప్పయ్యేళ్లు దాటాకే గెడ్డం పెంచాను. ప్రొఫెసర్ అయ్యేసరికి అక్కడక్కడా తెల్ల వెంట్రుకలతో నా తలా, గెడ్డం.. నాకొక పర్సనాలిటీ తెచ్చాయని నేననుకున్నాను. ఏదో ఒకటి గాని, ఎవరూ దీని గురించి తేలిగ్గా మాట్లాడలేదు... మా ఇంట్లో కూడా అందుకేనేమో! నేను ఏ ప్రాంతంవాడినో ఎవరూ నిర్ణయించలేకపోయేవారు. ఎక్కడికి వెళ్ళినా అవతలివాళ్ళ కళ్ళలో 'పెద్దమనిషి' అన్న భావన కనిపించేది. అదీ మంచిదే అనుకున్నాను.

ఈ మధ్య తిరువనంతపురంలో ఒక కాన్ఫరెన్సుకు వెళ్ళాను. కేరళకు వెళ్ళడం నాకదే మొదటిసారి! ఊళ్ళో చూడడానికి ఏమేమి ఉన్నాయని అడిగితే అనంతపద్మనాభస్వామి ఆలయం చూడవలసిందేనని అన్నారు.

కాన్ఫరెన్స్ పదికి గాని ప్రారంభం కాదు. ఉదయమే దైవదర్శనం చేసుకుందామని అనుకున్నాను. 'దేవాలయం ఎక్కడని' ప్రొఫెసర్ జార్జ్‌ని అడిగాను. నేను తీసుకెళ్తానని చెప్పాడు. ఆ రోజు ఒకటే తుంపర. అయినా వానలో తడుస్తూ వెళ్ళాం. చొక్కా తీసేసి కండువా కప్పుకుంటే మంచిదని ఇదివరకే జార్జ్ చెప్పాడు. కానీ నా దగ్గర కండువా లేదు. ఆ వానకూ, చలికీ చొక్కా తీయాలని లేదు. కానీ జార్జ్ మాత్రం అన్ని హంగులతో వచ్చాడు. గుడిలో ప్రవేశమప్పుడు జార్జ్ ధీమాగా ముందుకు వెళ్లిపోయాడు. నన్ను మాత్రం ఒకాయన ఆపేశాడు.

"ఎందుకు ఆపారు?" అన్నాను.

"మీ పేరేమిటి?" అని అడిగాడు.

"ఇ.వి.శాస్త్రి" అన్నాను.

"ఎక్కడి నుండి వచ్చారు?" అన్నాడు.

“ఢిల్లీ నుండి” అని సమాధానం ఇచ్చాను.

ఇంతలో ఇంకొకతను చేరాడు. వీరందరూ పవిత్రంగా కనిపిస్తున్నారు. భక్తులెవరో, పూజారులెవరో చెప్పడం కష్టం. వాళ్ళలో వాళ్ళు ఏదో మలయాళంలో మాట్లాడుకున్నారు. “సార్ ఏమనుకోకండి, మీ గుర్తింపు కార్డు చూపించండి. మాకు కొంచెం సెక్యూరిటీ ప్రోబ్లెమ్” అని ఒకతను అన్నాడు.

నాకు నవ్వొచ్చింది. నేను భగవంతుని భద్రత కోరదామని వచ్చాను. ఇక్కడేమో నావల్ల భగంతుని భద్రతకే ప్రమాదమంటున్నారు. పోకెట్ లోనుండి ఐడెంటిటీ కార్డ్ తీసి చూపించాను. ఆయన నా మొహాన్నీ, ఐడెంటిటీ కార్డులోని ఫోటోనూ పరిశీలనగా చూశాడు.

“సారీ, మీరు వెళ్లొచ్చు. ఏమనుకోకండి, ఏదో మా జాగ్రత్త! అటు నుండి కుడి వేపుగా వెళ్ళండి” అని ఒక పెద్ద వరండా వేపు చెయ్యి చూపించాడు.

ఒక్కక్షణంలో, ఆ చీకట్లో స్వామిని ఏం చూశానో తెలియదు. కిందకు జార్చినట్టున్న చెయ్యి మాత్రం కనిపించింది. చేతులు జోడించి ఇవతలకు వచ్చాను. జార్జ్ నా కోసం ఎదురుచూస్తున్నాడు. “ఏమిటి ఇంత ఆలస్యమైంది?” అన్నాడు.

“అక్కడ వాళ్ళు నా ఐడెంటిటీ కార్డ్ చూపించమన్నారు.”

జార్జ్ నవ్వాడు.

“ఎందుకు నవ్వుతున్నావ్?” అని అడిగాను.

“నీ వేషం చూసి. నన్ను చూడు ఎంత హాయిగా వెళ్లిపోయానో”

“నా వేషమెలా ఉందేమిటి?” గెడ్డం తడుముకున్నాను.

★★★

ఈసారి అనుభవం ఆలీగఢ్‌లో! యూనివర్సిటీ వాళ్ళు ఏదో ఒక ఎడ్వైజరీ బోర్డులో నన్ను మెంబర్‌గా వేశారు. ఆ మీటింగుకని బయలుదేరాను. ఒక రాత్రి ప్రయాణం గనుక హాయిగా ట్రెయిన్లోనే వెళ్ళాను. నేను వస్తున్నానని ఏ వివరాలూ ఇవ్వలేదు. అందుకే స్టేషన్‌కు ఎవ్వరూ రాలేదు. సరే తెలిసిన ప్రాంతమే కదా అని ఆటోరిక్షాను పిలిచాను.

“యూనివర్సిటీకా? యాభై రూపాయలు” అన్నాడు తన తెల్లటి లేసు టోపీ సర్దుకుంటూ.

“మీటర్ ప్రకారం తీసుకో” అన్నాను.

“అది పని చెయ్యడం లేదు.”

నేను ఆటో ఎక్కాను. అది స్టార్ట్ అయింది.

“భాయిసాబ్ కొంచెం రేటు ఎకువ చెప్తున్నావు కదా” అన్నాను.

“లేదు సాబ్, మీకు నేనెందుకు ఎక్కువ చెప్తాను. మీ దగ్గర ఎక్కువ డబ్బు తీసుకుంటానా?” అన్నాడతను బండి ముందుకు పోనిస్తూ.

“నా దగ్గర అంటే అర్థం?”

“మీరూ ముసల్మానే, నేనూ ముసల్మానే! మీ దగ్గర ఎక్కువ రేటు తీసుకుంటానని ఎలా అనుకున్నారు?”

నాకు నవ్వొచ్చింది. చివరకు అడిగాను. “అది సరే, నేను ముసల్మాన్నని నీకెలా తెలిసింది?”

“మీకూ నాకూ తెలిసినా తెలియకపోయినా అల్లాకు తెలుసు కదా” అన్నాడతను.

నిజమే సర్వజ్ఞుడైన అల్లాకు అన్నీ తెలుసు. అందుకేనేమో షేక్స్పియర్ ‘పేరులోనేముంది?” అన్నాడు. ‘రోజ్‌ను ఏ పేరుతో పిలిచినా దాని పరిమళం ఒకటే కదా” అన్నాడు.

ఇంతకూ ‘రోజ్’ను, అదే గులాబ్‌ను తెలుగులో ఏమంటారు? రాయలసీమలో, తెలంగాణాలో, ఆంధ్రలో, ఉత్తరాంధ్రలో... పువ్వే కదా! ఇక్కడ ఐడెంటిటీ క్రైసిస్, గుర్తింపు సంక్షోభం ఏమీ లేదు కదా!

*(పత్రిక మాసపత్రిక మే 2005 నుండి పునర్ముద్రణ)*

# హాట్‌హోం

**సి. ఆనందారామం**

**కథామార్గదర్శి కథ**

> ***"ఏంఅక్కర్లేదు అవతలికి పదండి. ఆ గరిటతో వాళ్ళందరి ముందుకు రావాలా? అక్కడే మీరు వంటంతా చేస్తున్నట్లు ప్రకటించుకోవాలా?"***
> ***"చెయ్యగా లేంది, చెప్తే తప్పొచ్చిందా? కష్టపడి ఇంత వంట చేస్తున్నందుకు నాకామాత్రం పేరయినా దక్కనియ్యవా?"***
> ***"ఛ ఛ వాళ్ళంతా ఎలా నవ్వారనీ? రేపు వాళ్ళముందు ఎలా తలెత్తుకోవాలి?"***
> ***"వాట్! నవ్వారా? మొగుడు వంట చేస్తూ పెళ్లాం సోఫాలో కూచున్నంత మాత్రాన నవ్వాలా? ఈ భారతదేశం ఇంకా నాలుగు శతాబ్దాలు వెనకుంది. వీళ్ళంతా బ్రూట్స్ ఇడియట్స్."***

"ఇవాళ నుంచీ మన ఇల్లు మారిపోబోతోంది.. స్వర్గధామం కాబోతోంది. స్వీట్ హోం కాబోతోంది!" ఫాక్టరీ నుంచి వస్తూనే హడావుడిగా హుషారుగా ఆనందంగా అన్నాడు చిట్టిబాబు.

భర్త వచ్చే టైం అయిందని టీ కి నీళ్ళు పడేస్తోన్న కమల బెంగగా చూస్తూ, "మళ్ళీ బార్ కెళ్ళారా?" అంది.

"ఛ..ఛ బార్ లేదూ, బీరూ లేదూ! ఇది నెలాఖరు. శ్రీమతి రంగనాయకమ్మగారి స్వీట్ హోం చదివాను. బాగుంది. చాలా బాగుంది. ఇవాళ నుంచి నేను బుచ్చిబాబునై పోతాను. మనిల్లూ స్వీట్ హోం అయిపోతోంది!"

"కాదు..."

"అయి తీరుతుంది..."

"ఒక్కనాటికి కాదు, మీరయితే బుచ్చిబాబు కాగలరు. నేను విమలని కావద్దూ? ఆవిడెక్కడ? నేనెక్కడ?" నిట్టూర్చింది కమల.

జాలిగా చూసాడు చిట్టిబాబు. "అదేం కమలా! కాస్త రెండు జళ్ళేసుకుని తెల్లచీర కట్టుకుని... నీకున్నవన్నీ తెల్లచీరలేగా? సినిమాకు రాలేవూ?"



ఫక్కున నవ్వింది కమల. "ఇదా మీకు స్వీట్ హోంలో నచ్చింది?"

"అన్నీ నచ్చాయనుకో! ప్రోగ్రాం సినిమాతో ప్రారంభిద్దాం.. ఏం?"

టీ కప్పు భర్త కందించి, మరో సోఫాలో కూలబడింది కమల. "రేపు రామూకి లెక్కల టెస్ట్ వుందట నేను రాలేను. వాడికా ఆల్జీబ్రాలో ఒకటే కన్ఫ్యూషన్. $-3-2=-1$ అంటున్నాడు ఫండమెంటల్సే బుర్ర కెక్కటంలేదు."

"వాడు చదువుకుంటాడులే! చిన్న క్లాసేగా... నువ్వు బయల్దేరు ఎంచక్కా రెండు జళ్ళేసుకుని!"

"మరో రెండేళ్ళాగండి. రెండు జెళ్ళకి సాయం పరికిణీ వోణీ కూడా కుట్టించుకుని కట్టుకునొస్తాను"

"నిజంగానా! అప్పుడు మరీ చిన్నపిల్లలా ఉంటావు. కానీ, రెండేళ్ళాగడం దేనికీ? ఇప్పుడే..?

"మరీ చిన్నపిల్లలా కనబడటానికి. ఫేమిలీ ప్లేనింగ్ పుణ్యమా అని ఇద్దరేగా పిల్లలు. చిన్నదాన్ని కాకేమవుతాను."

"నువ్వు ఏదో వ్యంగ్యంగా మాట్లాడుతున్నావు." కమలవైపు అనుమానంగా చూసాడు చిట్టిబాబు.

ఫకాలున నవ్వింది కమల. "వ్యంగ్యం ఏంలేదు. అంతా వాచ్యమే."

"అది సరే! నువ్వు బయల్దేరు. క్లాస్ టెస్టేగా.. వాడు చదువుకుంటాడు."

"అబ్బబ్బ! నన్ను వాగించకండి...."

"నీకు తెలీదు... విమల ఎంచక్కా అలా లెక్చర్ల మీద లెక్చర్లు దంచుకోండబట్టే... గడగడ వాగుకోండబట్టే గదా, ఆ ఇంటి స్వీట్ నెస్ అలా నలుదిశలా వ్యాపిస్తోంది. మాట్లాడాలి డియర్! సరదాగా నవ్వుతూ తుళ్ళుతూ వాదించుకోవాలి. నేను బుచ్చిబాబులా అన్నింటికీ ఊఁ కొడ్తాగా! నీకు భయం లేదు."

"నేను విమలను కాలేనవి చెప్పానా లేదా?"

"ఎందుకు కాలేవు?"

"విమల అదృష్టవంతురాలు..."

"బుచ్చిబాబులాంటి మొగుడు దొరికినందుకా? నేను బుచ్చిబాబులా ఉంటానంటున్నానుగా!"

"కాదు... అందుకు కాదు. విమల చదూకో లేదుట. ఉద్యోగం లేదుట. అయినాసరే మొగుడు కసురుకుంటే ఇంట్లోంచి దర్జాగా లేచిపోతుందట. నేనూ ఉన్నాను... చదువుకున్నాను... ఉద్యోగమూ ఉంది. ఎన్నెన్ని చికాకు లొచ్చాయో! అడుగు బయట పెట్టగలిగానా? మీ నలుగురక్కయ్యలూ, ఒక చెల్లెలూ సరిగ్గా నా పరీక్షల ముందు సంగీత సాధనకు కూర్చునేవారు. గుర్తులేదూ! ఒకరు తంబూరా, ఒకరు వీణా, ఒకరు మృదంగం, ఒకరు ఫిడేలూ..."
"ఫిడేలు వదినది... "

"అన్నట్లు ఆవిడ కూడా ఆ సంగీత సాధనలో ఉన్నారు కదూ! అయితే అవిడకి ఫిడేలు వాయించుకోడానికి ఉండేదికాదు. వీళ్ళందరికీ కాఫీలు కాచిపొయ్యటంతోనే సరిపోయేది. మాంచి పరీక్ష రోజులు... ఒకళ్ళు సినిమా కబుర్లు, మరొకళ్ళు 'వాళ్ళ అత్తగారి కుటుంబం మీద నేరాలూ... మరొకళ్ళు ఎవత్తో స్నేహితురాలి ముచ్చట్లు మరొకరు సా... మరొకరు పా... ఇలా సాగేది సంగీత సాధన! నిద్రమాత్రలు మింగి, వాళ్ళ సాధన అయ్యేవరకూ పడుకుని అప్పుడు లేచి చదువుకొనేదాన్ని! ఆ నిద్రమాత్రలతో బలహీనం అయిపోయాను. విమల్లా లెక్చర్లు నేనెలా దంచగలను?"

"ఓపిక లేదంటోనే ఇంత వాగుతున్నావ్, ఇంకా ఓపికుంటే అడిగావూ! దేవుడికే తెలుసు ఎవరెవరి రోగం ఎలా కుదర్చాలో..."

"ఇప్పుడేగా వాదించాలన్నారు. బుచ్చిబాబులా తలూపుతానన్నారు ఇదేవిటీ?"

"ఛ! వాదనలంటే ఇవా? జాతీయ అంతర్జాతీయ సమస్యల మీద.. అంతేకాని మా వాళ్ళని దుయ్యబట్టమనా? నా క్కోపం రాదూ!"

"ఐసీ మీక్కోపం రాని మాటలంటే బుచ్చిబాబులా ఊకొడ్తారన్నమాట. అయ్యా ! ఒక వంటవాణ్ణి, ఒక గవర్నెస్‌నీ, ఒక ట్యూషన్ మాస్టర్నీ, మీ పిల్లల అల్లరి పడగలిగిన వాణ్ణి అపాయింట్ చెయ్యండి, మరుక్షణంలో రెండు జళ్ళేవిటి? కావాలంటే నాలుగు జళ్ళేసుకుని పరికిణీ ఓణీ ఏం కర్మ? పంజాబీ డ్రెస్లో ఇరుక్కుని, మీ వెంట సినిమాకీ వస్తాను. అట్టే మాట్లాడితే బార్‌కి వస్తాను. నా ఇల్లు నేను సర్దుకోలేక సతమతమవుతున్నాను, జాతీయ అంతర్జాతీయ సమస్యలొక్కటే తక్కువయ్యాయి నా మొహాన్కి...."

టీ కప్పు బల్లమీద పెట్టి ఛర్రునలేచి నించున్నాడు చిట్టిబాబు "ఇంతకూ నువ్వు వస్తావా? రావా?"

అంతకంటె సర్రున లేచి నించుంది కమల, "వస్తాను.. కానీ ఇప్పుడు కాదు, పిల్లలకి సెలవు రోజవ్వాలి. పిల్లల తల్లి బాధ్యతలు ముందూ, సరదాలు తర్వాత నాకు! తలచుకున్నప్పుడు తాత పెళ్ళంటే కుదర్దు. ఇంకోటి.. రెండు జళ్ళు కావాలంటే పడగ్గదిలో వేసుకుంటాను. వీధిలోకి రాను! 'లోకంలో ఉంటూ తోకముతో మనకేటికి' అనగలిగే ఓపిక నాకు లేదు!" విసురుగా వెళ్ళిపోయింది కమల.

"నేను విమల్ని కానంటుంది కాని, ఆ విమలకి తాత ఇది!" అని గొణుక్కుంటూ సెకండ్‌హాండ్ డొక్కు కారులో రయ్యిన బయటి కెళ్ళిపోయాడు చిట్టిబాబు.

ఆరు దాటినా ఇద్దరు వెధవలూ వీధిలొ ఆడుతూనే ఉన్నారు. పెద్దయ్యాక సమానత్వం మాట దేవుడెరుగు, పుట్టొనే ఈ మొగపిల్లలకీ ఆడపిల్లలకీ ఎంత తేడా! వీళ్ళు దుండగీళ్ళు.. రౌడీలు.. ఆటకాయి వెధవలు!

"ఇంక ఆటలు చాలించి లోపలికి రండి" గుమ్మంలో నిలబడి ఓపికతో అరిచింది కమల.

"ఇదిగోనమ్మా.. ఈ ఒక్క బేటింగూ అయిపోయాక..." క్రికెట్ బేట్ చేత్తో పుచ్చుకునే అంటున్నాడు రాము.

"వెధవా! రేపు లెక్కల టెస్ట్ పెట్టుకుని ఇంకా ఒక్క బేటింగ్ అంటున్నావా? రా లోపలికి! చ...ఛ బొత్తిగా శ్రద్ధ లేదు చదువు మీద."

తల్లి మాటలు వింటోనే చిన్న క్రికెట్ బేట్ తో పెద్ద ప్లేయర్‌లా ఆడేస్తున్నాడు రాము, సమాధానం చెప్పటానిక్కూడా తీరకుండా!

"వస్తున్నావా? నన్ను రమ్మంటావా?" రెండడుగులు ముందుకేసింది కమల.

బేట్ చేత్తో పుచ్చుకుని పరుగెత్తుకొచ్చాడు రాము. అన్నగారి అడుగుజాడల్లో వచ్చాడు శీను.

"ఏరా పిలుసోంటే రావేం?" శ్రీనుని చూసి దబాయించింది కమల.

"రామూగాణ్ని రమ్మంటున్నానమ్మా! వాడిని తీసుకొద్దామనీ..." కళ్ళనిండా కొంటెతనంతో సిన్సియర్‌గా అంటున్నాడు చిన్న వెధవ.

వాడి కళ్ళలో ఆ కొంటెతనం చూస్తోంటే కోపం పోయి నవ్వొచ్చేస్తుంది. చెప్పేకారణాలు కూడా అలానే ఉంటాయి వెధవకి! ఇద్దరికీ ఏణ్ణార్థం తేడా ఏమో 'అన్నా' అనైనా పిలవడు.. రామూగాడనే! ఇద్దరూ కోట్లాడుకోని క్షణం ఉండదు. విడిచి ఉండే క్షణమూ ఉండదు. విమల అదృష్టవంతురాలు.. ఎంచక్కా ఒక మొగపిల్లాడూ, ఆడపిల్ల! అన్నీఅలా కలిసిరావాలి.

రాత్రి తొమ్మిదిదాకా కూచుని రాము తల్లోకి ఆల్జీబ్రా ఫండమెంటల్ రూల్సన్నీ ఎక్కించేసరికి తలనొప్పొచ్చేసింది కమలకి. అసలు మధ్యాహ్నం నుంచి తలనొప్పిగానే ఉంది. అందుకే చిట్టిబాబు.. రెండు జళ్ళూ, మూడు జళ్లూ అంటోంటే చిరాకేసింది.

మరునాటికి తలనొప్పి మరింత ఎక్కువ కాగా సలపరం కూడా తగిలినట్లయి లేవలేకపోయింది కమల.. నన్నగా మూలిగింది.

"ఏవిటి కమలా!" ప్రేమగా అడిగాడు చిట్టిబాబు.

"జ్వరం తగిలినట్టుందండీ."

."వాట్!" అంటో గబగబ చిట్టిబాబు కమల నుదురూ చెంపలూ తడిమి తడిమి కొలిచాడు జ్వరం.

"బాగుంది జ్వరం చూట్టం!" సగం బాధతో, సగం నవ్వుతో అంది కమల.

"నిజంగానే జ్వరం వచ్చేసింది, నువ్వు లేవకు కమలా! పడుకో! ఇవాళ అన్నీ నే చేస్తాను టేక్ రెస్ట్."

రయ్యిన బాణంలా వంటింట్లోకి దూసుకు వెళ్ళాడు చిట్టిబాబు. కమల మనసు ఆనందంతో నిండిపోయింది. నిజంగా చిట్టిబాబు చాలా మంచివాడు బుచ్చిబాబు కంటే మంచివాడు.

కాఫీ తెచ్చి మంచం మీది కందించాడు చిట్టిబాబు. అరమోడ్పు కన్నులతో తాగింది కమల.

లుంగీ చుట్టబెట్టుకుని మళ్ళీ వంటింట్లో కురికాడు చిట్టిబాబు.

అంతలో సరళా, రాధా, జానకి, అనసూయా వగైరా కాలేజీ స్టూడెంట్సంతా బిలబిల్లాడుతూ వచ్చేసారు. "మేడమ్ కాలేజీ కొస్తారా?" అనుకుంటూ. వాళ్ళని డ్రాయింగ్ రూంలో కూచోబెట్టి. తనూ కూచుని ఏదో చెప్పబోతోంటే చేతిలో గరిటతో అక్కడికొచ్చాడు చిట్టిబాబు.

"కమలా అలుగెడ్డ ఉడికిపోయింది. వేయించమంటావా? ఉల్లిపాయలు ఉప్మాకూర చెయ్యమంటావా? సాంబారు, రసం, రెండూ ఉండాలా? సాంబారొక్కటి చాలా?" నళినీ, రాధా, సరళా వగైరాలంతా ఒకళ్ళ ముఖాలొకళ్ళు చూసుకుంటున్నారు.

వాళ్ళ ముఖాలు చూసాడు చిట్టిబాబు. "వీళ్ళందరికీ కాఫీలు తెమ్మంటావా కమలా?" బెంగగా అడిగాడు.

అమ్మాయిల్లో చాలామంది ముసిముసిగా నవ్వుకున్నారు. ఒకరిద్దరూ చురుకుపాలు ఎక్కువున్న వాళ్ళ ఆపుకోలేక పకాలున నవ్వేసారు. కమల ప్రాణం చచ్చిపోయింది...

"ఏం కమలా! వీళ్ళందరికీ కాఫీ...." ఇంకా అక్కడే ఉండి కమల ఆజ్ఞ కోసం చూస్తున్నాడు చిట్టిబాబు.

"ఏం అక్కర్లేదు.. మీరు వెళ్ళండి." కసిరింది కమల.

"మేం వస్తామండీ," అంటో ఒక్కక్షణం అక్కడ కూచోకుండా తూనీగల్లా తుర్రుమన్నారు వాళ్ళు. రయ్యిన వంటింట్లో కొచ్చింది కమల. విరుచుకు పడింది చిట్టిబాబు మీద. "ఒక్కరోజు కాస్త వంటింట్లోకొచ్చి ఇంత రాద్ధాంతం చేస్తారా? ఇన్నాళ్ళూ అటు ఉద్యోగమూ, ఇటు వంటా, ఛస్తున్నా బ్రతుకుతోన్నా చేసుకోటంలా? మీ అంతట మీరే సాయం చేస్తానని.... చివరికి..." కమల కేడుపొచ్చేస్తోంది!

చేతులో గరిటతో దిగాలుగా చూసాడు చిట్టిబాబు. "ఇప్పుడేవయింది కమలా! ఇంకా ఏవైనా చెయ్యమంటావా? నీకు మళ్ళీ ఓ కప్పు కాఫీ కావాలా?" ప్రేమగా అడిగాడు చిట్టిబాబు.

ఆ ప్రేమకు కమల హృదయం కరగలేదు. ఇందాకటి అవమానమే తిరిగి కరగి, కళ్ళ లోంచి స్రవించింది. "ఏం అక్కర్లేదు అవతలికి పదండి. ఆ గరిటతో వాళ్ళందరి ముందుకు రావాలా? అక్కడే మీరు వంటంతా చేస్తున్నట్లు ప్రకటించుకోవాలా?"

"చెయ్యగా లేంది, చెప్తే తప్పొచ్చిందా? కష్టపడి ఇంత వంట చేస్తున్నందుకు నాకామాత్రం పేరయినా దక్కనియ్యవా?"

"ఛ ఛ వాళ్ళంతా ఎలా నవ్వారనీ? రేపు వాళ్ళముందు ఎలా తలెత్తుకోవాలి?"

"వాట్! నవ్వారా? మొగుడు వంట చేస్తూ పెళ్లాం సోఫాలో కూచున్నంత మాత్రాన నవ్వాలా? ఈ భారతదేశం ఇంకా నాలుగు శతాబ్దాలు వెనకుంది. వీళ్ళంతా బ్రూట్స్ ఇడియట్స్."

"ఏ అట్బూ లేవు అవతలకు నడవండి. రేపట్నుంచీ వంటమనిషిని పెట్టేస్తాను వెధవ బాధ, ముఫై రూపాయిలిచ్చి తిండి పెడ్తే అదే చూసుకుపోతుంది. వందరూపాయలైతే ఔతాయి.. మధ్యన నాకేం!"

"కమలా! ప్లీజ్! ఆ వంద రూపాయలూ లెక్కడక్కుండా నా కియ్యవా? రెండుపూటలా వంట నేనే చేస్తాను. చేసి, కాసిని నూనె మరకలూ, మసి మరకలూ, నీ చీరకీ, మొహాన్కీ పులిమి, నేను నీట్‌గా డ్రెస్సయి కూర్చుంటాను. సడన్‌గా ఎవరైనా వస్తే ఇవ్వటానికి కాఫీ తయారుచేసి ఫ్లాస్క్‌లో పోసి ఉంచుతాను. ఎవరైనా వస్తే నువ్వే ఇద్దువుగాని... రాకపోతే లాగేద్దువుగాని ఓ.కే. !"

ఎంత చిరాకు తెచ్చుకుందామన్నాకమలకి నవ్వొచ్చేస్తోంది. గిరుక్కన తిరిగి ఇవతలి కొచ్చేసింది. చిట్టిబాబు అల్లరి తెలిసే వంటింట్లోకి రానిచ్చినందుకు లెంపలేసుకుంటూ!

ఏడవుతోన్నా పిల్లలు మంచాల మీంచి లేవటం లేదు. మెలకువ రాక కాదు, లేస్తే కాలకృత్యాలు కాగానే చదువుకోవలసొస్తోందని!

నెమ్మదిగా రెండుసార్లు విసుగొచ్చింది కమలకి. కోపంగా రెండు అంటించబోయింది.

"కొట్టకు...కొట్టకు", ధీరుడిలా అడ్డుపడ్డాడు చిట్టిబాబు.

"కొట్టకుండా మీరు లేపండయితే." చిరచిర లాడుతూ వెళ్ళిపోయింది కమల.

చిట్టిబాబు వెంటనే టేప్‌రికార్డర్ ఆన్ చేసి, ఆ మధ్య రికార్డు చేసిన సుడిగుండాలు సంక్షిప్త శబ్ద చిత్రం పెట్టాడు. పిల్లలిద్దరూ గబుక్కున లేచారు. పరుగెత్తుకొచ్చి టేప్‌రికార్డరుకి చెరో వైపునా కూర్చున్నారు.

"లేచి ముఖం కడుక్కోండి." కోపంగా అంది కమల.

పిల్లలిద్దరూ కదల్లేదు. తల్లికి సమాధానం చెప్పలేదు, ఏకాగ్రంగా 'సుడిగుండాలు' వినేస్తున్నారు.

"ఇదెక్కడి గోలండి. పొద్దున్నే టేప్‌రికార్డరు పెడితే వీళ్ళు మాట వింటారా? ముఖాలు కడుక్కొని పాలు తాగి పుస్తకాల ముందు కూచుంటారా?"

"అవన్నీ నాకేం తెలుసు? కొట్టకుండా లేపమన్నావ్? లేపాను." చిద్విలాసంగా నవ్వుతో అన్నాడు చిట్టిబాబు. ఉసూరుమంది కమల. కమల చాలా కష్టపడి మాంటిసరీ మెథడ్స్, చిల్డ్రన్ సైకాలజీ వగైరా వగైరా చాలా చదివింది. పిల్లలు అంత ఏకాగ్రంగా వింటున్నప్పుడు డిస్టర్బ్ చెయ్యటం మంచిదికాదు. వాళ్ళ మనసు అప్పుడు ఇంకోదాని మీద నిలవదు. సుడిగుండాలు మంచి సినిమాయే కదా, అనుకుని చేసేదిలేక వంటింట్లోకి నడిచింది. గంటయి సినిమా పూర్తయ్యాక చిరంజీవు లిద్దరూ టూత్‌బ్రెష్‌లు పుచ్చుకుని వాష్‌బేసిన్ దగ్గిరకు నడిచారు. అప్పుడే విన్న డైలాగులు వల్లించేస్తున్నారు.

"సరదా... హత్య చేస్తే ఎలా వుంటుందోనని సరదా... హంతకుడు పట్టుబడకుండా పోలీసులు గగ్గోలు పెడుతుంటే చూడాలని సరదా... హత్యని గురించి ఏం చెప్పుకుంటున్నారో వినాలని సరదా..."

వింటోన్న కమలకి గుండెలు ఝుల్లుమన్నాయి. ఇంతసేపూ 'సుడిగుండాలు' ఏకాగ్రంగా విని వీళ్ళు పట్టుకున్నదిదా? ఇంట్లో తల్లి ఎంత తాపత్రయపడినా, బైటి స్నేహితుల ప్రభావం పిల్లల మీద, ముఖ్యంగా మొగపిల్లల మీద ఎక్కువ! బడికి పంపకా తప్పదు. బళ్ళో స్నేహితులు ఉండకా మానరు. రకరకాల స్నేహితులు. సమాజంలో విజృంభించే రకరకాల శక్తులకి నిజరూప ప్రతిబింబాలు. ఎత్తెత్తి కాళ్ళేస్తే ఎంగిలాకుల్లో పడట్లు, వీళ్ళేనేదో పరమ ఆదర్శంగా పెంచుదామని తను చస్తోంటె, ఏ ప్రభావంతోనో కొట్టుకుపోరుగదా! ఒక రకమైన నిస్త్రాణ ఆవహించింది కమలను! ఆ చిరాకు చిట్టిబాబు మీద కోపంగా మారింది.

"ఏమిటిది మీరు? పిల్లలికి చదువూ సంధ్యా చూడవలసింది పోయి, అన్నీ నే చూస్తుంటే పైన అడ్డుపుల్ల లేస్తారా? పొద్దున్నే టేప్‌రికార్డర్ పెడతారా ఎవరైనా? ఆ వెధవలిద్దరూ ఆ డైలాగులు తలుచుకుంటూ కూచుంటే పుస్తకంలోది బుర్ర కెక్కుతుందా? ఛ ఛ ఈ సంపారం నే నీదలేను. ఎక్కడికైనా పోతాను."

"నిజంగా వెళ్ళిపోతావా?" బెంగగా అడిగాడు చిట్టిబాబు.

ఆ బెంగ చూస్తే మరింత ధైర్యం వచ్చింది కమలకి. "ఆ ! తప్పకుండా వెళ్ళిపోతాను."

"పిల్లల్ని తీసికెళ్లావా? ఒక్కదానివే వెళతావా?"

"నాకెందుకింకా తాపత్రయాలన్నీ మీ దగ్గరే ఉంచుకోండి."

"అల్ రైట్ ! వాళ్ళిద్దరినీ నరసాపురం పంపేస్తాను."

"నరసాపురమా! ఎంచక్కా తెల్లవారు ఝామునే కోవెలా, ప్రసాదాలూ, భలే! నాయనమ్మగారు రోజూ మిఠాయిలు చేస్తారు. అజీర్తి చేస్తే తాతగారు ఇంజక్షన్ చేసి ఏడవకుండా పావలా ఇస్తారు. అది పెట్టి కోమటి కొట్లో కొబ్బరుండలు కొనుక్కోవచ్చు. గోళీలు కూడా ఉంటాయి... రోజూ రాత్రి తాతగారు భజన చేయిస్తారు. తర్వాత కొబ్బరిముక్కల ప్రసాదం..." ఉత్సాహంగా చెప్పుకుపోతున్నాడు రాము.

"రామూ! శనివారం, శనివారం బోలెడన్ని దోసెలు.." అందించాడు శీను.

ఇద్దరు వెధవలూ తండ్రి చెరో ప్రక్క నిలబడి "ఎప్పుడు వెళ్తావమ్మా,"అన్నారు ఆశగా!

కమలకు అరికాలి మంట నెత్తికొచ్చింది. తెల్లవారింది మొదలు వీళ్ళకోసం నానా యాతనాపడుతోంటే 'ఎప్పుడు వెళ్తావమ్మా' అని అడుగుతున్నారు వెధవలు.

"అవతలకు పొండి పెద్దవాళ్ళ మాటల్లో కల్పించుకోవద్దని ఎన్నిసార్లు చెప్పాను?"

తల్లి కళ్ళూ, ముఖమూ చూస్తూనే.. తల్లి మూడ్ అర్థం చేసుకోగలరు ఇద్దరు పిల్లలూ! అక్కడ నిలబడకుండా పరుగెట్టారు.

“ఎప్పుడు వెళ్తావు కమలా?” దీనంగా అడిగాడు చిట్టిబాబు.

“ఇవాళే.”

“భోజనం చేసి వెళ్ళు.”

“థాంక్స్.”

“బైదిబై, ఎడ్రసిచ్చి వెళ్ళు.”

“ఎందుకూ? అక్కడికొచ్చి బ్రతిమాలటానికా?” కంఠం కోపంగా పలికినా అందులో బోలెడు ఆశ ధ్వనించింది.

“ఛ! నిన్నలా విసిగిస్తానా? నువ్వూ పిల్లలూ లేకుండా ఒక్కడే ఉంటే నా ఖర్చు విపరీతంగా పెరిగిపోదూ! నా జీతం ఏమూలకే? డబ్బు అవసరమయినపుడు మాత్రం వస్తాను. ఫస్ట్ వీక్ లోనే వస్తాలే. నీ కష్టసుఖాలు నాకు మాత్రం తెలీవూ!”

నవ్వూ ఏడుపూ పొంగుకొస్తూంటే మాటాడలేక పోయింది వెంటనే కమల.

“నేనొచ్చేవరకూ వెళ్ళకు కమలా! కారులో దిగబెడతాను, మళ్ళీ ఎన్నాళ్ళకు కలుసుకుంటామో? కారు తొయ్య మననులె! బాగా రిపేర్ చేయించుకొస్తాను…”

టిఫెన్ తినేసి, కాఫీ తాగుతూ “అన్నట్లు ఏవేం కావాలో అన్నీ సర్దుకో మొహమాట పడకు.” అన్నాడు.

బై బై చెప్పేసి వెళ్ళిపోయాడు.

చిట్టిబాబు చాలా నిజాయితీపరుడు.. కమలకి వాగ్దాన మిచ్చినట్లు కారు రిపేరు చేయించుకుని మరీ వచ్చాడు సాయంత్రం… “కమలా! ఉన్నావా, వెళ్ళిపోయావా?” అనుకుంటూ.

“మీ ఆశలు ఫలించవు…” నవ్వుకుంటూ వచ్చింది కమల ఇవతలకి.

ఎప్పుడూ చూసే కమలె…! ఒక్కసారి నలుముకుని చూసాడు చిట్టిబాబు…. కమల సాధారణంగా తెల్ల ఫుల్‌వాయిల్ చీరలే కడుతుంది. ఆ రోజు తెలుపు చికెన్‌వర్క్ చేసిన ఫుల్వాయిల్ చీర కట్టుకుంది… హకోబా జాకెట్ వేసుకుంది. సన్నని ముత్యాల గొలుసు కంఠం చుట్టుకొని ఒక వరసా, గుండెల క్రిందికి ఒక వరసా వచ్చేలా వేసుకుంది. జుట్టంతా చెంపల క్రిందికి జారి వంకీలుగా ముఖం మీదికి పడేలా సద్దుకుని, మరీ క్రిందికీ పైకి కాకుండా, గుండ్రమూ కోలా కాకుండా సిగ చుట్టుకుంది. సిగచుట్టూ వత్తుగా కట్టి సన్నజాజుల మాల తురుముకుంది. రెండు బంగారు గాజుల మధ్య రెండు రాళ్ళగాజులు ఒక చేతికి, వాచ్ ఒక చేతికి పెట్టుకుంది.

“కమల ఇలాగే బాగుంటుంది. దర్జాగా హుందాగా ఆకర్షణీయంగా ఒక రకం డిగ్నిటీతో.” తనలో అనుకున్నాడు చిట్టిబాబు.

“రెడియేనా? పిల్లలేరీ?”

“పనిమనిషితో సర్కస్‌కి పంపాను. రేపు ఆదివారం కదా! “

"అదేం? వాళ్ళని నరసాపురం పంపుదామనుకొంటూంటే..."

"పంపుతారు, పంపుతారు. మీ ఆటలు నేను సాగనిస్తాననే అనుకొంటున్నారా? అంతా సవ్యంగా ఉన్నప్పుడే నేను గృహలక్ష్మిని.. లేదా శ్రీమతి పురాణం సీతగారు సాయించినట్లు గృహరాక్షసిగానూ మారగలను. పిల్లల్ని నరసాపురం తోలేసి బార్‌లో కూచుందామనుకున్నారా? వాళ్ళని చావదన్ని చదివిస్తాను. నా కంఠంలో ప్రాణముండగా రాంభజన చేసుకుంటూ కొబ్బరిముక్కలు తిని గోలీలాడుకో నివ్వను. మీరు బార్ కెళ్ళి ఇంట్లో అడుగు పెడదామనే అనుకుంటున్నారా? వీధుల్లో పడి వచ్చే పోయ్యేవాళ్ళకి వినోదంగా దొర్లవలసిందే! డోర్స్ బంద్! టేక్ కేర్."

"అయితే వెళ్ళటం లేదా?" నీరసంగా అడిగాడు చిట్టిబాబు

"నేను ముందే చెప్పాను. ఇది స్వీట్‌హోం కాదని... హాట్‌హోం!" పైటచెంగు గుండ్రంగా తిప్పి నాజుగ్గా నడుం పక్క చెక్కుకుంది కమల. వేడివేడి పకోడీలు మొగుడి ముందుపెట్టి "ఇవిగో ఈ హాట్ పకోడీలు ఆరగించండి." అంది. 'ఇది ఆ విమలకి తాత!' అని మనసులో గొణుక్కుని పైకి "పకోడీలు చాలా బాగున్నాయి కమలా..!" అన్నాడు. "కానీ?"

"బోలెడు ఖర్చుపెట్టి కారు రిపేర్ చేయించాను అంతా వేస్టేనా?"

"వేస్టేందు కవుతుంది? సినిమా కెళ్దాం. పిల్లల్ని సర్కస్‌కి పంపాను. పనిమనిషి తోడుంది. పైగా రేపు సెలవు." చిట్టిబాబు ముఖం పెరిగింది.

"యెక్సెలెంట్ అయిడియా:" అంటూ ఉత్సాహంగా టీ తాగేసాడు.

కారు ఎక్కబోతూ, "మధ్యలో తొయ్యమనరు గదా!" అంది కమల బెదురుతూ తన బట్టల వంక చూసు కుంటూ.

"నో... నో! నీ కా ట్రబులిస్తానా? అంతగా మధ్యలో ఆగిపోతే నువ్వా కొండల మీదా గుట్టల మీదా కూచుని ప్రకృతి రమణీయకతని ఆస్వాదిద్దువు గాని! ఈలోగా నేను రిపేర్ చేసుకుంటాను. ఇద్దరం ఝామ్మంటూ ఇంటికొచ్చేద్దాం... ఓ కె!" నవ్వుకుంటూ చిట్టిబాబు పక్కన కూర్చుంది కమల.

★★★

(మొట్టమొదట శ్రీమతి రంగనాయకమ్మగారు స్వీట్‌హోం సృష్టించారు. తర్వాత శ్రీమతి పురాణం సీతగారు దాని మీద కొన్ని వ్యాసాలు రాసారు సరదాగా! నేను ఒక హాట్‌హోం సృష్టించాను... పురాణం సీతగారికి భయపడుతోనే! శాస్త్రంలో కాని, సాహిత్యంలో కాని మొదట సృష్టించినవాళ్ళదే ఘనత. ఈ 'హోమ్స్' సృష్టించింది రంగనాయకమ్మ గారే.. అందుకే ఆవిడకిది అంకితం. కృతజ్ఞతతో – ఆనందారామం.)

*("జయశ్రీ" సంక్రాంతి ప్రత్యేక సంచిక 1969 నుంచి పునర్ముద్రణ)*

## కథా కమామీషు

‘ఎవరూ పుట్టించకపోతే మాటలు ఎలా పుడతాయి?’ అన్నారు శ్రీ పింగళివారు మాయాబజార్ చిత్రంలో. అంతే కాదు కొత్తమాటలు పుట్టించినందుకు మెచ్చి వీరతాళ్ళు కూడా వేయించారు. అలా కొత్తమాటలు పుట్టించడంలో మన తెలుగువాడు ప్రముఖుడుగా పేరు తెచ్చుకున్నాడని వేరే చెప్పాలా అన్నట్టుగా ఎన్నో కొత్త మాటల కోసం పరభాషా పదాలను అరువు తెచ్చుకుని మరీ పుట్టించాడు.

అలా పుట్టిన మాటలు మన భాషలో ఇమిడిపోయి జాతీయాలుగా కూడా ప్రాచుర్యం పొందాయి. ‘కథా కమామీష్’ అనే మాటను మీరు వినే ఉంటారు. ఇది మనదగ్గర చాలా ప్రాచుర్యం పొందింది కూడా. ఇంతకీ ఏంటండీ ఆ కథా కమామీషు? దేనికి ఈ సోదంతా మీరు అనొచ్చు కూడా. కథ గురించి మీకు వేరే వివరించవల్సిన అవసరం లేదేమో కానీ, కమామీషు దగ్గరే వస్తుంది అసలు గసగస.

‘కమాయిష్’ అనే పారశీక పదాన్ని అమాంతంగా పట్టేసి మన తెలుగులో కుట్టేసుకున్నాడు మన తెలుగోడు. మరి ఆ పారశీక మాటకు అర్థం ‘వ్యవహారం’ట. అందండీ అసలు వ్యవహారం. “ఆ...! ఇప్పుడు చెప్పవోయి నీ కథేంటి? నీ వ్యవహార మేంటి?’ అంటూనే తన చమత్కారాన్ని రంగరించి మరీ మాట్లాడుతాడు.

‘సరే ఇప్పుడీ వ్యవహారం గురించి ఇక్కడ పనేంటి?’ అంటే మన కథామంజరి పుట్టింది కథల కోసమే కదా! మరి కథలున్న చోట కమామీష్ ఉండాలనే ఉద్దేశంతో ప్రస్తావించం తప్ప మరేం కాదు. ఏదేమైనా తెలుగు కథ కలకాలం మనల్ని అలరించాలి. కథామంజరి ఆ ‘వ్యవహారానికి’ మరో ప్రస్థానం కావాలి.

అంతకన్నా మనకు కావాల్సింది ఏముంది.